www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 18-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 93 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి సా5:02 తదుపరి నవమి; నక్షత్రం: అశ్విని రా2:14 తదుపరి భరణి, వర్జ్యం: రా.10:28-11:58; దుర్ముహూర్తం: ఉ.8:28-9:20, మ.12:47-1:38; అమృతఘడియలు: రా.7:27-8:57; రాహుకాలం: ఉ.10:30-12:00; సూర్యోదయం: 5:53; సూర్యాస్తమయం: 6:49 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిహార్‌లో ఉచిత విద్యుత్ పథకం

గృహ వినియోగదారులకు నెలకు 125 యూనిట్ల వరకూ ఉచితం.. సీఎం నితీశ్‌కుమార్ వెల్లడి 2

అసెంబ్లీ ఎన్నికల వేళ పోటాపోటీ హామీలు

తాము అధికారంలోకి వస్తే నెలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తామని ఇప్పటికే ఆర్జేడీ హామీ

ఏపీ లిక్కర్ స్కామ్ నిందితులు..

శ్రవణ్‌రావు ఫ్లాట్‌లోనే!

- చాణక్య బూనేటితోపాటు మరో నలుగురూ అక్కడే
- వాళ్లకు ఫ్లాట్ ఇచ్చింది రెంటల్ ఏజెన్సీ కాదు.. శ్రవణ్‌రావే
- కలిసే ఉన్న లిక్కర్ స్కామ్ నిందితులు, ఫోన్ ట్యాపింగ్ నిందితుడు
- ఎవరెవరు ఉన్నారన్న వివరాలు టవర్ రిజిస్టర్‌లో నమోదు
- ఖరీదైన ఫ్లాట్ వ్యవహారంలో శ్రవణ్‌రావు అరాచకం
- సహ యజమాని ఆకర్ష్‌కు అద్దెలో వాటా చెల్లించని వైనం
- ఈ నెల 22న విచారణకు రావాలని ఆకర్ష్‌కు ఏపీ సిట్ నోటీసు

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శ్రవణ్‌రావు ఫ్లాట్‌లో ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ నిందితులు ఉన్నారంటూ 'ఆంధ్రజ్యోతి' రాసిన కథనం అక్షర సత్యమైంది. దుబాయ్‌లోని ఖరీదైన ప్రాంతంలో శ్రవణ్‌రావు మరొకరితో కలిసి కొనుగోలు చేసిన ఫ్లాట్‌లోనే లిక్కర్ స్కామ్ నిందితులు మకాం వేసినట్లు తేలింది. లిక్కర్ స్కామ్ సూత్రధారి రాజ్ కసిరెడ్డికి సన్నిహితంగా ఉంటూ వ్యవహారం నడిపిన చాణక్య బూనేటి, మరో నలుగురు ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకు ఆ ఫ్లాట్‌లోనే ఉన్నారని వెల్లడైంది. ఆ ఫ్లాట్‌ను డీలక్స్ హాలిడే హోమ్స్ సంస్థకు లీజుకిచ్చామని, ఆ సంస్థ ఎవరికి అద్దెకిచ్చిందో తమకు తెలియదని శ్రవణ్‌రావు తరఫున ఐన్యూస్ యాజమాన్యం ఇచ్చిన ప్రకటన అవాస్తవమని తేలింది. యజమాని కోటా కింద శ్రవణ్‌రావే కొంతకాలం తీసుకుని, లిక్కర్ స్కామ్ నిందితులకు ఇచ్చారని.. స్వయంగా ఆయన వారితో కలిసి ఉన్నారని పక్కా ఆధారాలూ లభించాయి.

సెక్యూరిటీ రిజిస్టర్‌లో వివరాలతో..

దుబాయ్‌లోని పారామౌంట్ టవర్ హోటల్స్ అండ్ రెసిడెన్సెస్‌లో 35వ అంతస్తు వరకు హోటల్ ఉండగా ఆపై అంతస్తుల్లో నివాస ఫ్లాట్లు ఉన్నాయి. అందులో 5801 నంబర్ ఫ్లాట్ శ్రవణ్‌రావుకు సంబంధించింది. దీనిని



దుబాయ్‌లో నిందితులు ఉన్న టవర్

రెంటల్ ఏజెన్సీకి లీజుకు ఇచ్చారు. ఒప్పందం ప్రకారం ఏడాదిలో ఒక నెల పాటు యజమాని ఆ ఫ్లాట్‌ను ఉచితంగా వాడుకోవచ్చు. అంతకు మించితే నిర్వహణ ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకు రెండు నెలల పాటు ఫ్లాట్‌ను ఉపయోగించుకున్న శ్రవణ్‌రావు ఒక నెల

మిగతా 14వ పేజీలో...


కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ తదితరులు

సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

13

- ఎలక్ట్రానిక్స్ పార్కులను ఏర్పాటు చేయండి
- కొత్త రైలు మార్గాలను మంజూరు చేయండి
- రీజినల్ రింగ్ రైల్‌కు త్వరగా అనుమతివ్వండి
- కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రి వైష్ణవ్‌కు సీఎం రేవంత్ వినతులు

కేటీఆర్ పిరికిపంద

డ్రగ్స్ పరీక్షలకు సిద్ధమన్నాడు.. కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నాడు

- పరీక్షలకు జుట్టు, రక్తం ఇస్తానని చెప్పి.. తర్వాత మాటమార్చాడు
- ఆయన చుట్టూ ఉన్నోళ్లంతా గంజాయి బ్యాచే కదా!
- చీకట్లో రహస్యంగా లోకేశ్‌తో ఎందుకు భేటీ అయ్యారు!?
- పనితనం తెలుసు కాబట్టే ప్రతిపక్ష నేత హోదా ఇవ్వట్లేదు
- కేటీఆర్, హరీశ్, కవితలకు వాళ్ల ఇంట్లోనే విలువ లేదు
- కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను చర్చలతో పరిష్కరించాం
- దొంగ సారా అమ్మిన జగదీశ్ రెడ్డి కూడా నీతులు చెబితే ఎలా!?
- సోడా పోయడం.. సారా అమ్మడం.. ఈ రెండే ఆయనకు తెలిసినవి
- కాంగ్రెస్ ఇచ్చిన బీసీ రిజర్వేషన్లను 23% కి తగ్గించిందే కేసీఆర్
- ముస్లిం కోటాను బీజేపీ రాష్ట్రాల్లో తీసేసి.. ఇక్కడ డిమాండ్ చేయాలి
- 42% కోటా అమలుకు మా వ్యూహం మాకుంది.. అమలు చేస్తాం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): "నేనెప్పుడూ డ్రగ్స్ తీసుకోలేదని, పరీక్షలకు సిద్ధమని కేటీఆర్ సవాల్ విసిరాడు. ఆ తర్వాత పిరికిపందలా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నాడు. నేను స్వయంగా అమరవీరుల స్థూపం దగ్గరికి వెళితే.. రాకుండా పారిపోయాడు. పరీక్షల కోసం రక్తం, జుట్టు ఇస్తానని సవాల్ విసిరి, మాట మార్చి కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకున్నాడు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేటీఆర్‌ది గంజాయి బ్యాచ్ అని, ఆ బ్యాచ్ సవాల్ విసిరితే తాను స్పందించాలా? అని ప్రశ్నించారు. ఢిల్లీ తుగ్లక్ రోడ్డులోని తన అధికారిక నివాసంలో గురువారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. "కేటీఆర్ సన్నిహితుడు, వ్యాపార భాగస్వామి కేదార్ రకరకాల డ్రగ్స్ ఒకే సారి తీసుకొని దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. దానికి సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికను తెప్పించాం. అసెంబ్లీ సాక్షిగా ఆ నివేదికను బయట పెడతాం. కేటీఆర్ బావమరిది ఫాంహౌస్‌లో గంజాయి, డ్రగ్స్‌తో దొరికాడు. కేటీఆర్ చుట్టూ ఉన్నోళ్లంతా గంజాయి బ్యాచ్‌నే కదా?" అని ప్రశ్నించారు. వాళ్ల మాటలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుతో అధికారికంగా తాను చర్చల్లో పాల్గొంటే తప్పుబడుతున్న కేటీఆర్.. ఆ రాష్ట్ర మంత్రి లోకేశ్‌తో చీకట్లో రహస్యంగా ఎందుకు భేటీ అయ్యారో చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలదీశారు. కళ్లు మూసుకుని పిల్లి పాలు తాగినట్లు.. కేటీఆర్ చేసేవన్నీ

మిగతా 13వ పేజీలో...

రేవంత్.. ఓ పిరికి దద్దమ్మ!

డ్రగ్స్ కేసు అంటూ నాపై విషం చిమ్మడం ఎందుకు?

13 దమ్ముంటే ఆధారాలు చూపించాలి

లేదంటే పర్యవసానాలు తప్పవు: కేటీఆర్

బీఆర్ఎస్ నా దారిలోకి రావాల్సిందే!



- బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ సరైనదే
- అన్నీ తెలిసే బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోంది
- నిపుణులతో చర్చించాకే నేను మద్దతిచ్చా
- మల్లన్న వ్యాఖ్యలపై స్పందించకపోవడం దారుణం
- దీన్ని ఆ పార్టీ నేతల విజ్ఞతకే నేను వదిలేస్తున్నా
- బనకచర్లను అప్పనంగా చంద్రబాబు చేతిలో పెట్టారు
- రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి
- ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కొంత కాలంగా బీఆర్ఎస్ విధానాలపై పరోక్ష విమర్శలు చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. ఒక్క సారిగా దూకుడు పెంచారు. సొంత పార్టీపై ప్రత్యక్షంగా విమర్శనాస్త్రాలు సంధించారు. బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకురావాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని, దీన్ని వ్యతిరేకించడం సరికాదంటూ బీఆర్ఎస్ తీరును తప్పుపట్టారు. తీన్మార్ మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలపై పార్టీ స్పందించకపోవడంపైనా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కాకున్నా.. తర్వాతైనా తన దారిలోకి రావాల్సిందేనంటూ ఆమె వ్యాఖ్యానించడం.. రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీకి కవిత మద్దతు ఇస్తున్నారా? లేక బీసీ రిజర్వేషన్లపైనే

మిగతా 14వ పేజీలో...

హెచ్‌సీఏ కుంభకోణంలో..

కవిత, కేటీఆర్ పాత్ర..!

- కేటీఆర్ బావమరిదికి కాంట్రాక్టులు
- సీఐడీ, ఈడీకి ఫిర్యాదు చేసిన తెలంగాణ క్రికెట్ అసోసియేషన్
- బీసీసీఐ నుంచి హెచ్‌సీఏకు అందిన 600 కోట్లపైనా విచారణకు డిమాండ్
- ఫిర్యాదులో అజహర్‌తో పాటు పలువురి పేర్లు
- జగన్‌మోహన్‌రావుపై ఈడీ కేసు నమోదు
- ఫోర్జరీ స్కెచ్ వేసిందెవరు?
- బీఆర్ఎస్ పెద్దలతో మీ సంబంధాలేమిటీ?
- జగన్ మోహన్‌రావుకు సీఐడీ ప్రశ్నలు
- ఇన్‌స్పెక్టర్ సమాచారంతో దేవరాజ్ పరారీ!
- ఇన్‌స్పెక్టర్ ఎల్లక్షరెడ్డిపై సస్పెన్షన్ వేటు?

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లో జరిగిన కుంభకోణం వెనుక ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే కేటీఆర్ పాత్ర ఉందని.. వీరిపై విచారణ జరపాలంటూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు యండల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి ధరమ్ గురవారెడ్డి సీఐడీ, ఈడీకి ఫిర్యాదు చేశారు. గురువారం ఈ మేరకు రెండు దర్యాప్తు సంస్థలకు లిఖితపూర్వక ఫిర్యాదు ప్రతులను అందజేశారు. క్రికెట్ అభివృద్ధి కోసం గత పదేళ్లలో బీసీసీఐ నుంచి హెచ్‌సీఏకు అందిన రూ.600 కోట్ల నిధుల్లో సింహభాగం దుర్వినియోగం అయ్యాయని, దీనిపైనా విచారణ జరపాలని ఆ ఫిర్యాదులో కోరారు. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఎన్నికయిన వెంటనే జగన్ మోహన్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. తన విజయం వెనుక కవిత, కేటీఆర్ ఉన్నారని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ.. అందుకు ఆధారాలుగా మీడియా క్లిప్పింగ్‌లను ఫిర్యాదుకు జత చేశారు. జగన్ మోహన్‌రావు అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత ఐపీఎల్ టికెట్ల అమ్మకాల కాంట్రాక్టును కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు చెందిన ఈవెంట్స్‌నౌ డాట్ కామ్, మేరా ఈవెంట్ డాట్ కామ్‌కు

మిగతా 11వ పేజీలో...


మల్లేశ్ (ఫైల్)

కులోన్మాద హత్య

ప్రేమించిన పాపానికి దళిత యువకుడు బలి

జగిత్యాల జిల్లా కిషన్‌రావుపేటలో దారుణం

యువతి తండ్రి, బాబాయి దాడిలో ప్రాణాలు కోల్పోయిన మల్లేశ్ 14



నటి రన్యారావుకు ఏడాది జైలు

శిక్షా కాలంలో బెయిల్‌కు అవకాశం లేదు

బంగారం స్మగ్లింగ్ కేసులో 'కొఫెపోసా' అడ్వైజరీ బోర్డు తీర్పు 2



ఫడణవీస్‌తో ఉద్ధవ్ భేటీ

అధికార పక్షం వైపు రావాలని ఆహ్వానించిన మరుసటి రోజే సమావేశం

బీజేపీతో శివసేన (యూబీటీ) మళ్లీ దోస్తీ?

మహారాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చ

ముంబై, జూలై 17: మహారాష్ట్రలో రాజకీయ సమీకరణాలు మారిపోతున్నాయా? ఉద్ధవ్ ఠాక్రే మళ్లీ బీజేపీతో కలవనున్నారా? అంటే తాజా పరిణామాలు అవుననే అనిపిస్తున్నాయి. శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే గురువారం మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో భేటీ అయ్యారు. విధాన మండలి చైర్మన్ రామ్ శిందే కార్యాలయంలో

మిగతా 2వ పేజీలో...

ఓఆర్ఆర్ లోపల కల్లు అమ్మకాలు బంద్?



- కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కల్లు దుకాణాల ఎత్తివేత దిశగా ప్రభుత్వ ఆలోచన
- కల్తీ కల్లును అరికట్టాలంటే ఇదొక్కటే మార్గమని సూచించిన ఆబ్కారీ శాఖ అధికారులు
- ఓఆర్ఆర్ లోపల ప్రస్తుతం 454 కల్లు దుకాణాలు
- కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో మరో మహిళ మృతి

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో కల్లు దుకాణాలు మూతపడనున్నాయా? కల్తీ కల్లును అరికట్టాలంటే.. అసలు కల్లు దుకాణాలే లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందా? తాటి, ఈత చెట్లు లేని చోట పెద్ద ఎత్తున కల్లు ఎక్కడి నుంచి వస్తుందన్న అంశంపై దృష్టి సారించిందా? కూకట్‌పల్లి ప్రాంతంలో కల్తీ కల్లు సేవించి 10 మంది మృతి చెందిన ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని కల్లు దుకాణాల అనుమతులు రద్దు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఓఆర్ఆర్ లోపల కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో మొత్తం 454 కల్లు దుకాణాలు ఉన్నాయి. 2004లో కల్తీ కల్లు ఘటన జరిగినప్పుడు అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చెట్లు లేని చోట కల్లు విక్రయాలు ఎలా చేస్తారనే కారణంతో నగరానికి 50 కి.మీ వరకు కల్లు విక్రయాలకు అవకాశం లేకుండా ఉత్తర్వులు ఇచ్చారు. 2014లో తెలంగాణ ఏర్పాటయ్యాక రాజధాని

మిగతా 3వ పేజీలో...



యూ సీటింగ్!

- తరగతి గదుల్లో కొత్త తరహాలో బెంచీల ఏర్పాటు
- మలయాళం సినిమా స్ఫూర్తితో హైదరాబాద్‌లోని ప్రభుత్వ, రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలల్లో..
- అధికారులకు కలెక్టర్ హరిచందన ఆదేశాలు
- ఇప్పటికే కేరళ, ఒడిసాల్లో పూర్తిస్థాయిలో అమలు
- పంజాబ్, తమిళనాడులో కొన్నిచోట్ల..
- బ్యాక్ బెంచ్ స్టూడెంట్లు, అల్లరి పిల్లలు అన్న భావనకు దీంతో చెల్లు
- విద్యార్థుల్లో పెరగనున్న ఆత్మవిశ్వాసం.. అభ్యసన సామర్థ్యాలూ మెరుగు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో విద్యార్థులు ఒకరి వెనుక మరొకరు.. వరుసగా ఉన్న బెంచీల మీద కూర్చుంటారు. మొదటి, రెండు, మూడు వరుసల్లోని విద్యార్థులు తెలివైన పిల్లలని.. బ్యాక్ బెంచీల్లోని వారు అల్లరి పిల్లలని, పాఠాలు సరిగా వినరనే అభిప్రాయాలు చాలామందిలో పాతుకుపోయాయి! ఉపాధ్యాయులు కూడా

మిగతా 14వ పేజీలో...

ఆ 12 గ్రామాలు మావే..!

తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలపై మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి ప్రకటన

తెలంగాణలోనే కొనసాగించాలని సరిహద్దు గ్రామాల ప్రజల ఆందోళన 14

ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఎయిర్‌పోర్టుకు పక్షి పోటు!

శంషాబాద్ విమానాశ్రయ పరిధిలో 5 నెలల వ్యవధిలో.. పక్షులు 'ఢీ'కొన్న ఘటనలు 49

సాంకేతిక సమస్యలతో 5 సార్లు 'మే'డే 2

15 వేల ఎన్‌కౌంటర్లు.. 238 మంది హతం

» 2017 నుంచి యూపీలో బుల్లెట్ రాజ్..!

» శాంతిభద్రతలు నియంత్రణలో ఉన్నాయంటున్న డీజీపీ

లఖ్‌నవూ, జూలై 17: శాంతిభద్రతలు గాడితప్పుతూ.. గూండారాజ్ కొనసాగుతున్న ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితులను 'బుల్లెట్ రాజ్'తో అదుపులోకి తీసుకువచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. 2017లో యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాటినుంచి ఇప్పటి వరకు మొత్తం 14,973 ఎన్‌కౌంటర్లు జరగ్గా.. 238 మంది మృతిచెందారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లలో 9,467 మంది నేరగాళ్లకు గాయాలవ్వగా.. 30,694 మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ అరెస్టయ్యారు. ఈ గణాంకాలపై ఉత్తరప్రదేశ్ డీజీపీ రాజీవ్ కృష్ణ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2017 నుంచి తీసుకున్న కఠిన చర్యలతో ఇప్పుడు దేశంలోనే యూపీ అత్యంత సురక్షిత రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందన్నారు.

డిజిటల్ అరెస్టు భయంతో కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య

» బెదిరించి రూ.11 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఆగడాలకు విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగి కె.కుమార్(48) బలయ్యాడు. కర్ణాటకలోని రామనగర్ జిల్లా చెన్నపట్టణ తాలూకా మళూరు హోబళి కలగేరి గ్రామానికి చెందిన కె.కుమార్ బెంగళూరు హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన గ్రూపు-డి ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల కుమార్ మొబైల్‌కు ఓ వ్యక్తి కాల్ చేశాడు. విక్రమ్ గోస్వామిగా పరిచయం చేసుకుని, ఓ కేసులో అరెస్టు వారెంట్ జారీ అయిందని చెప్పాడు. ఆ కేసు నుంచి పేరు తొలగించాలంటే తన ఖాతాలో రూ.1.95 లక్షలు జమ చేయాలని సూచించాడు. కేసు అనగానే భయపడిన కుమార్, డబ్బులు సమకూర్చుకుని సైబర్ నేరగాడి ఖాతాలో జమచేశాడు. అంతటితో ఆగని సైబర్ నేరగాళ్లు.. వెంటనే రూ.2.75 లక్షలు సమకూర్చాలని, లేకుంటే మరో రోజులోనే అరెస్టు చేస్తామని బెదిరించారు. ఇలా పలుమార్లు బెదిరింపు కాల్స్ రావడంతో కుమార్ దాచుకున్న సొమ్ముతోపాటు పలువురి వద్ద అప్పు చేసి సైబర్ నేరగాళ్లకు రూ.11 లక్షల దాకా ఇచ్చాడు. అయినా వేధింపులు ఆగలేదు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన స్వగ్రామానికి వెళుతున్నాని భార్యకు చెప్పి బెంగళూరు నుంచి వెళ్లిపోయాడు. మరుసటి రోజు స్వగ్రామంలోని సొంత పొలంలోనే చెట్టుకు ఉరివేసుకున్నట్టు గుర్తించారు. మృతుడి జేబులో సూసైడ్ నోట్ లభించింది. సీబీఐ పేరుతో వేధిస్తున్నారని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని అందులో పేర్కొన్నాడు.

రాబర్ట్ వాద్రా ఆస్తులు ఈడీ స్వాధీనం

» రూ.37 కోట్లు విలువ చేసే 43 ఆస్తుల అటాచ్

న్యూఢిల్లీ, జూలై 17: కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా(56)కు చెందిన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్వాధీనం చేసుకొంది. ఆయన వ్యక్తిగత, కంపెనీలకు చెందిన రూ.37.64 కోట్లు విలువ చేసే 43 ఆస్తులను అటాచ్ చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. హరియాణాలోని షికోహ్‌పూర్ గ్రామంలో జరిగిన ఆస్తి అమ్మకంలో నగదు అక్రమ చలామణికి పాల్పడినట్టు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ క్రిమినల్ కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా ఆస్తులను స్వాధీనం చేసుకొని ఆయనపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేసింది.

దుబాయ్‌లో 10 రోజుల 'వివాహ సెలవు'

» మంజూరు చేసిన పాలకుడు

దుబాయ్, జూలై 17: దుబాయ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పది రోజుల పాటు 'వివాహ సెలవు'ను మంజూరు చేస్తున్నట్టు దేశ పాలకుడు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రధాని, ఉపాధ్యక్షుడు అయిన షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తౌమ్ ప్రకటించారు. ఈ పది రోజుల పాటు పూర్తి వేతనం చెల్లిస్తారని తెలిపారు. ఈ సెలవులను కేవలం వివాహ సమయంలో మాత్రమే కాకుండా ఏడాదిలో ఎప్పుడైనా ఉపయోగించుకోవచ్చు. ప్రత్యేక పరిస్థితిల్లో మరుసటి సంవత్సరం కూడా వినియోగించుకునే వీలుంది. ప్రొబేషనరీ కాలాన్ని పూర్తి చేసుకున్న ఉద్యోగులు యూఏఈ పరిధిలోని వ్యక్తులను తగిన అనుమతులతో వివాహం చేసుకున్నప్పుడు మాత్రమే ఈ సెలవులు వర్తిస్తాయి.

బలూచ్ తిరుగుబాటుదారుల దాడుల్లో

39 మంది పాక్ సైనికుల హతం

ఇస్లామాబాద్, జూలై 17: బలూచిస్తాన్ తిరుగుబాటుదారుల వరుస దాడులతో పాకిస్థాన్ సైన్యం ఉక్కిరిబిక్కిరవుతోంది. బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ), బలూచ్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) బుధవారం జరిపిన వేర్వేరు దాడుల్లో 39 మంది పాకిస్థాన్ సైనికులు మృతి చెందినట్లు తెలుస్తోంది. బీఎల్ఏకు చెందిన ఫతే స్క్వాడ్.. కరాచీ నుంచి క్వెట్టా వెళ్తున్న సైనిక బస్సును లక్ష్యంగా చేసుకుని ఐఈడీతో పేల్చివేసింది. ఈ ఘటనలో 29 మంది సైనికులు మరణించగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే కలాత్, జహూ, హజర్‌గంజ్ ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో 10 మంది సైనికులను హతమార్చినట్లు బీఎల్ఎఫ్ ప్రకటించింది.

ఇరాక్‌లోని షాపింగ్ మాల్‌లో భారీ అగ్ని ప్రమాదం

» 60 మందికిపైగా దుర్మరణం

బాగ్దాద్, జూలై 17: ఇరాక్‌లో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. తూర్పు ఇరాక్‌లో ఇటీవలే ప్రారంభించిన కొత్త షాపింగ్ మాల్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో 60 మందికిపైగా దుర్మరణం చెందారు. వీరిలో చిన్నారులు కూడా ఉన్నారని గురువారం అధికారులు తెలిపారు. కుట్ నగరంలో బుధవారం రాత్రి ఈ అగ్ని ప్రమాదం జరిగింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. రంగంలోకి దిగిన పౌర రక్షణ సిబ్బంది మాల్‌లో చిక్కుకుపోయిన 45 మంది పైగా ప్రజలను కాపాడారు. మరికొంత మంది ఆచూకీ లభ్యం కాలేదని ఇరాకీ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.

విమాన ప్రమాదం.. సీనియర్ పైలట్‌దే తప్పా?

» వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం.. ఖండించిన పైలట్ సంఘాలు

న్యూఢిల్లీ, జూలై 17: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాదంలో మానవ తప్పిదం ఉందా? ఆ విమాన సీనియర్ పైలట్ సుమిత్ సబర్వాల్ ఉద్దేశపూర్వకంగా ఇంధన నియంత్రణ మీటను ఆపారా? ఈ ప్రశ్నలకు అవునని బదులిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక ఓ కథనాన్ని ప్రచురించింది. బ్లాక్‌బాక్స్ వాయిస్ రికార్డింగ్‌లో కూడా తోటి పైలట్(ఫస్ట్ ఆఫీసర్) సుమిత్‌ను 'ఇంధనాన్ని ఎందుకు ఆపేశావు?' అని అడిగినట్లు ఆ కథనం పేర్కొంది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) ప్రాథమిక నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోందని తెలిపింది. బ్లాక్‌బాక్స్ రికార్డు ప్రకారం.. ఇంజన్లకు ఇంధనాన్ని నిలిపివేయడం ఉద్దేశపూర్వకమేనని పేర్కొంది. రామ్ ఎయిర్ టర్బైన్‌కు సంబంధించి సీసీటీవీ ఫుటేజీ కూడా ఇదే విషయాన్ని చెబుతోందని వెల్లడించింది. అమెరికాకు చెందిన విమాన ప్రమాదాల దర్యాప్తు సంస్థ అధికారుల మూల్యాంకనం ఆధారంగా ఈ కథనాన్ని ప్రచురించినట్లు తెలిపింది. అయితే.. భారత ప్రభుత్వం, పైలట్ సంఘాలు ఈ కథనాన్ని ఖండిస్తున్నాయి. దీనిపై ఇంకా అధ్యయనం జరగాల్సి ఉందని స్పష్టంచేశాయి. కాగా.. విమాన ప్రమాదంపై తుది నివేదిక ఇచ్చేవరకు ఊహాగానాలకు దూరంగా ఉండాలని ఏఏఐబీ మీడియాకు గురువారం సూచించింది.

బ్రిటన్‌లో 16 ఏళ్లకే ఓటు హక్కు

» కల్పించేందుకు ప్రభుత్వ యోచన

లండన్, జూలై 17: బ్రిటన్‌లో వచ్చే సాధారణ ఎన్నికల నుంచి ఓటు హక్కు వయసును 16 ఏళ్లకు తగ్గించేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ ప్రతిపాదన పార్లమెంట్ ఆమోదం పొందాల్సి ఉందని, దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలిచిపోతుందని ప్రభుత్వం పేర్కొంది. దేశంలో ఇప్పటికే 16, 17 ఏళ్ల యువత శ్రామికశక్తిలో, సైన్యంలో భాగం పంచుకుంటోందని, వారికి మరింత న్యాయం చేయడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదనను తీసుకొచ్చామని తెలిపింది.

బిహార్‌లో ఉచిత విద్యుత్ పథకం

» అసెంబ్లీ ఎన్నికల వేళ పార్టీల పోటాపోటీ హామీలు

పట్నా, జూలై 17: అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. రాష్ట్ర ప్రజలకు బిహార్ సీఎం నితీశ్ కుమార్ ఉచిత విద్యుత్ పథకం ప్రకటించారు. గృహ వినియోగదారులందరికి ప్రతినెల 125 యూనిట్ల విద్యుత్ ఉచితంగా పంపిణీ చేస్తామని గురువారం సోషల్ మీడియా వేదికగా తెలిపారు. దీనివల్ల 1.67 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఉచిత విద్యుత్ పథకం ఆగస్టు నుంచే అమల్లోకి రానున్నదని కూడా ఆయన తెలిపారు. అంటే జూలై నుంచే 125 యూనిట్ల విద్యుత్ వాడకంపై బిల్లు వసూలు చేయరు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు చౌకగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని నితీశ్ కుమార్ వెల్లడించారు. వచ్చే మూడేళ్లలో 'కుటీర్ జ్యోతి యోజన' పథకం కింద రాష్ట్రంలో 10 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కాగా, గృహ వినియోగదారులకు 125 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం వల్ల.. ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.16 వేల కోట్ల భారం పడుతుందని డిప్యూటీ సీఎం-బీజేపీ నేత సామ్రాట్ చౌదరి మీడియాకు చెప్పారు. మరోవైపు, ఇండియా కూటమికి సారథ్యం వహిస్తున్న ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్.. తమకు అధికారమిస్తే గృహ వినియోగదారులకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా పంపిణీ చేస్తామని ఇంతకు ముందే ప్రకటించడం గమనార్హం.

నాడు నోట్ల రద్దు.. నేడు ఓట్ల రద్దు

» బిహార్‌లో భారీ ఎత్తున ఓట్ల తొలగింపు ద్వారా రిగ్గింగ్‌కు కుట్ర: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 17: ఓటర్ల నుంచి ఓటు హక్కును లాక్కోవటం ద్వారా బిహార్ ఎన్నికల్లో భారీ ఎత్తున రిగ్గింగ్ చేయటానికి కుట్ర జరుగుతోందని, దాంట్లో భాగంగానే ఎన్నికల సంఘం (ఈసీ) ఆ రాష్ట్రంలో 'ఓటర్ల జాబితా సవరణ' (సర్)ను చేపట్టిందని కాంగ్రెస్ ఆరోపించింది. గతంలో నోట్లరద్దు చేసిన ప్రధాని మోదీ ఇప్పుడు బిహార్‌లో ఓట్లరద్దుకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తింది. గురువారం ఈ అంశంపై ఆ పార్టీ నేతలు పలువురు ఎక్స్‌లో పోస్టులు పెట్టారు. 'సర్ పేరుతో ఓట్లను దొంగిలిస్తూ ఈసీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. చేసేదేమో దొంగతనం.. పేరు మాత్రం సర్. దీనిని బట్టబయలు చేసిన వారి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు' అంటూ రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు.

లోకం తీరు



ఫడణవీస్‌తో ఉద్ధవ్ భేటీ

(మొదటిపేజీ తరువాయి)

వీరిద్దరూ సమావేశం అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు ఈ భేటీ జరిగింది. ఈ సమావేశం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార పక్షం వైపు రావాలంటూ ఉద్ధవ్‌ను ఫడణవీస్ ఆహ్వానించిన మరుసటి రోజే వీరిద్దరూ భేటీ కావడం గమనార్హం. బుధవారం మహారాష్ట్ర అసెంబ్లీలో సీఎం ఫడణవీస్ మాట్లాడుతూ.. "2029 వరకు మేం ప్రతిపక్షంలోకి వెళ్లే అవకాశం లేదు. కాబట్టి ఉద్ధవ్ జీ అధికార పక్షం వైపు వచ్చే అవకాశాన్ని పరిశీలించాలి" అని అన్నారు. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన స్నేహం 2014 వరకు అప్రతిహతంగా సాగింది. 25 ఏళ్ల పాటు కలిసి సాగిన ఈ రెండు పార్టీల మధ్య 2014 అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సందర్భంగా విభేదాలు వచ్చాయి. అనంతరం 2019 ఎన్నికల్లో గెలిచాక బీజేపీకి ఝలక్ ఇచ్చిన ఉద్ధవ్.. కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. అయితే, రెండున్నరేళ్ల తర్వాత ఫడణవీస్.. ఉద్ధవ్‌పై ప్రతీకారం తీర్చుకున్నారు. 2022లో ఏక్‌నాథ్ శిందేతో తిరుగుబాటు చేయించి, శివసేనను చీల్చి.. కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. శిందే రెండేళ్లకు పైగా మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, శివసేన (శిందే) కూటమి రికార్డు స్థాయి విజయాన్ని నమోదు చేయడంతో ఫడణవీస్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలు విషయంలో కూటమి సర్కారుపై ఉద్ధవ్ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఫడణవీస్.. ఉద్ధవ్‌ను అధికార పక్షం వైపు రావాలని ఆహ్వానించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

వీసా.. గోస!

వ్యవస్థీకృతంగా మారిపోయిన వీసా మోసాలు

» త్వరగా ప్రక్రియ పూర్తి చేస్తామంటూ అమాయకుల నుంచి లక్షల్లో వసూళ్లు

» నకిలీ, ఫోర్జరీ పత్రాలతో విదేశాలకు..

» అక్కడ పట్టుబడి కేసులు, జైళ్ల పాలవుతున్న బాధితులు

» గత ఐదేళ్లలో 5 వేలకుపైగా నకిలీ వీసాలు తయారు చేసిన ఓ ఢిల్లీ ముఠా

» డబ్బులూ పోయి, విదేశాల్లో ఉద్యోగం ఆశలూ ఆవిరై కుంగిపోతున్న బాధితులు



పెరిగిపోతున్న వీసా మోసాలు

న్యూఢిల్లీ, జూలై 17: ఉన్న ఊరిలో ఉపాధి లేక.. ఉన్నా సంపాదన సరిపోక.. ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారు ఎందరో. వారి ఆశలను సొమ్ము చేసుకుని, నకిలీ వీసాలతో వారి కలలను కల్లలు చేస్తున్న ముఠాలు పెరిగిపోయాయి. లక్షలకు లక్షలు వసూలు చేసి తప్పుడు, ఫోర్జరీ పత్రాలు, నకిలీ వీసాలతో విదేశాలకు పంపుతున్నాయి. ఉద్యోగాలపై ఆశతో వెళ్లినవారు అసలు విషయం తెలిసి గుండెలు బాదుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా వ్యవస్థీకృతంగా సాగుతున్నట్టు ఇటీవల బయటపడిన నకిలీ వీసా రాకెట్ బాగోతాల్లో వెలుగు చేసింది. మన దేశంలో హైదరాబాద్‌తోపాటు ముంబై, బెంగళూరు, సూరత్, గాంధీనగర్, ఢిల్లీలలో పలు ముఠాలు అధికారులకు పట్టుబడ్డాయి. ఈ ముఠాలు రూ.23 లక్షల నుంచి రూ.67 లక్షల వరకు వసూలు చేసి.. నకిలీ వీసాలు, స్పాన్సర్ ఐడీ, ఇతర అనుమతి పత్రాలను ఫోర్జరీ చేసి వందలాది మందిని గల్ఫ్, యూరప్ దేశాలకు పంపినట్టు వెల్లడైంది.

ఈ ఏడాది మొదట్లో నకిలీ షెంజెన్ వీసా (29 యూరప్ దేశాల ఉమ్మడి వీసా)తో దుబాయ్ వెళుతున్న ఏడుగురిని ముంబై విమానాశ్రయంలో అరెస్టు చేశారు. కర్ణాటకలోని మంగళూరులో 'హైర్‌గ్లో ఎలిగాంట్ ఓవర్సీస్ ఇంటర్నేషనల్' అనే సంస్థ 300 మందిని ఫోర్జరీ స్పాన్సర్‌షిప్ పత్రాలతో మోసం చేసిన విషయం బయటికి వచ్చింది. ఢిల్లీలోని ఓ ముఠా గత ఐదేళ్లలో 5 వేలకుపైగా నకిలీ వీసాలు, ఫోర్జరీ పత్రాలతో రూ.300 కోట్ల మోసానికి పాల్పడినట్టు గుర్తించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి తప్పుడు వీసాలతో వందలాది మందిని గల్ఫ్ దేశాలకు పంపిన సంగతి గతంలోనే బయటపడింది. కొన్ని ట్రావెల్ ఏజెన్సీలు, కొందరు ఏజెంట్లపై అమెరికా విదేశాంగ శాఖ నిషేధం విధించిందంటే.. ఈ ముఠాలు అంతర్జాతీయంగా ఎంత వ్యవస్థీకృతంగా విస్తరించాయో అర్థం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

రకరకాలుగా మభ్యపెట్టి..

సాధారణంగా ఉద్యోగ వీసాల కోసం చాలా తతంగం ఉంటుంది. విదేశాల్లోని సంస్థలు, వ్యక్తులు సదరు వ్యక్తికి తాము ఉద్యోగమిస్తామని స్పాన్సర్‌షిప్ పత్రాలు ఇవ్వాలి. ఆ తర్వాత వీసా కోసం దరఖాస్తు, విద్యార్హత, ఆరోగ్య ధ్రువీకరణ వంటి అవసరమైన పత్రాల సమర్పణ, సంబంధిత దేశ రాయబార కార్యాలయంలో ఇంటర్వ్యూ.. ఇలా ఎన్నో ఉంటాయి. ఇందుకోసం సమయం పడుతుంది. అయితే నకిలీ వీసా ముఠాలు.. తాము త్వరగా స్పాన్సర్‌షిప్ పత్రాలు, వీసాలు ఇప్పిస్తామంటూ గాలం వేస్తున్నాయి. వీటిలో చాలా వరకు ఎలాంటి లైసెన్స్ లేనివే. విదేశాలకు ఉద్యోగం, ఉపాధి కోసం వెళ్లాలనుకునేవారిని.. స్థానికంగా ఉండే మధ్యవర్తులు, ఏజెంట్ల సాయంతో గుర్తిస్తున్నాయి. ఫోర్జరీ స్పాన్సర్‌షిప్ పత్రాలతో పర్యాటక వీసాలపై విదేశాలకు పంపుతున్నాయి. అధికారులు కూడా క్షుణ్నంగా పరిశీలిస్తే తప్ప గుర్తించలేని స్థాయిలో ఈ నకిలీ పత్రాలు ఉంటుండటం గమనార్హం. కొన్నిసార్లు ఇక్కడే విమానం ఎక్కే ముందే నకిలీ, ఫోర్జరీ విషయం బయటపడుతోంది. ఇలాంటివారు లక్షలకు లక్షలు డబ్బులు పోగొట్టుకుని, పైగా ఉద్యోగం ఆశలు ఆవిరై ఆందోళనలో పడుతున్నారు.

విదేశాల్లో కష్టాలు పడుతూ..

నకిలీ వీసాలు, ఇతర పత్రాలతో వెళ్లినవారు విదేశాల్లో అధికారుల తనిఖీల్లో పట్టుబడి కష్టాల పాలవుతున్నారు. కేసులు, జైళ్ల పాలవుతున్నారు. కొన్నిసార్లు స్వదేశాలకు తిప్పిపంపేస్తున్నా.. మళ్లీ ఆ దేశంలోకి రాకుండా నిషేధం ఎదుర్కొంటున్నారు. ఇలా నకిలీ వీసాలు, పత్రాలతో విదేశాలకు పంపుతున్న ట్రావెల్ ఏజెన్సీలు, ఏజెంట్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా... మోసాలు మరింతగా పెరిగిపోతూనే ఉండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. విదేశాంగ శాఖ నుంచి లైసెన్సు పొందిన సంస్థలు, ఏజెంట్ల ద్వారా వెళితే మోసపోకుండా ఉండవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయా దేశాలకు చెందిన అధికారిక వెబ్‌సైట్లలో వీసా ప్రక్రియ, స్పాన్సర్‌షిప్ విధానం, ఇతర అంశాలను పరిశీలించాలని సూచించింది. మోసపోయినట్టు గుర్తిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేసింది.

నటి రన్యారావుకు ఏడాది జైలు

» ఈ కాలంలో బెయిల్‌కు నో చాన్స్

» బంగారం స్మగ్లింగ్ కేసులో 'కొఫెపోసా' అడ్వైజరీ బోర్డు తీర్పు



బెంగళూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): కన్నడ నటి రన్యారావు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తరలిస్తూ పట్టుబడ్డ కేసులో కఠినమైన కొఫెపోసా చట్టం కింద ఆమెకు ఏడాది జైలుశిక్ష పడింది. ఈ మేరకు విదేశీ మారక ద్రవ్య పరిరక్షణ, స్మగ్లింగ్ కార్యకలాపాల నివారణ చట్టం (కొఫెపోసా) అడ్వైజరీ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్బంధ కాలంలో ఆమెకు బెయిల్ మంజూరు ఉండబోదని తాజాగా తీర్పునిచ్చింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చట్టబద్ధంగా నిర్దేశించిన కాలపరిమితిలో చార్జిషీట్ దాఖలు చేయడంలో విఫలం కావడంతో.. సహ నిందితుడు తరుణ్ రాజుతో పాటు రన్యారావుకు సిటీ కోర్టు మే 20న డిఫాల్ట్ బెయిల్ ఇచ్చింది. రూ.2 లక్షల బాండ్, ష్యూరిటీ షరతులపై బెయిల్ మంజూరైనప్పటికీ.. కొఫెపోసా కింద ముందస్తు నిర్బంధం ఉత్తర్వుల కారణంగా ఇద్దరూ కస్టడీలోనే కొనసాగారు. అక్రమ రవాణా కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే అనుమానంపై, అధికారిక అభియోగాలు లేకుండానే ఏడాది పాటు నిర్బంధంలో ఉంచేందుకు ఇది వీలు కల్పిస్తుంది. రన్యారావు ఈ ఏడాది మార్చిలో దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో పట్టుబడిన విషయం తెలిసిందే. రన్యారావు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లను స్థానిక కోర్టులు రెండు సార్లు, ఆ తర్వాత కర్ణాటక హైకోర్టు తిరస్కరించింది.

నివాస ప్రాంతాల్లో ఉమ్మడి ప్రార్థనా సమావేశాలు వద్దు

» మద్రాసు హైకోర్టు

చెన్నై, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ఏ మతానికి చెందిన వారైనా నివాస ప్రాంతాల్లో ఉమ్మడి ప్రార్థనా సమావేశాలు నిర్వహించరాదని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. చెంగల్పట్టు జిల్లా క్రోంపేట రాధానగర్ కృష్ణమాచారి వీధిలో నివసిస్తున్న సుబ్రమణియన్, తన ఇంట్లో 'గాడ్' అనే పేరుతో అంతర్జాతీయ అతీంద్రియ శక్తుల సంస్థ ఆధ్వర్యంలో నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఆ ప్రాంతంలో నివసిస్తున్న వారికి ఇబ్బందిగా ఉందని పేర్కొంటూ, అదే ప్రాంతానికి చెందిన ప్రకాష్ రామచంద్రన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును గురువారం విచారించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.ఆనంద్ వెంకటేష్.. కన్నియాకుమారి జిల్లాలోని ఓ నివాస ప్రాంతంలో క్రైస్తవులు ప్రార్థనలు జరపడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన కేసులో కలెక్టర్ అనుమతి లేకుండా అలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని గతంలో హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ ఉత్తర్వులు ఈ కార్యక్రమానికి కూడా వర్తిస్తాయన్నారు. చట్టం అందరికీ సమానమని, కలెక్టర్ అనుమతి లేకుండా నివాస ప్రాంతాల్లో మతపరమైన ప్రార్థనలు, సభలు నిర్వహించరాదని, అలాగే నివాస ప్రాంతాల్లో నామ సంకీర్తన కార్యక్రమాలు కూడా నిర్వహించరాదని న్యాయమూర్తి పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టుకు పక్షి పోటు!

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ పరిధిలో 5 నెలల వ్యవధిలో పక్షులు 'ఢీ' కొన్న ఘటనలు 49 సాంకేతిక సమస్యలతో ఐదు సార్లు 'మే'డే కాల్స్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)


మేటి విమానాశ్రయాల్లో ఒకటిగా పేరొందిన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పక్షుల బెడద పట్టి పీడిస్తోంది! ఈ ఏడాది జనవరి నుంచి మే నెలాఖరు వరకూ.. అంటే 5 నెలల వ్యవధిలో టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో విమానాలను పక్షులు ఢీ కొన్న ఘటనలు ఈ విమానాశ్రయంలో 49 జరిగినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వెల్లడించింది. అంతేకాదు.. ఈ ఏడాది జనవరి నుంచి మే చివరి దాకా దేశంలో 11మేడే కాల్స్‌ను (ఆకాశంలో విమానం ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నప్పుడు గ్రౌండ్‌కు ఇచ్చే సంకేతం. ఇటీవల అహ్మదాబాద్‌లో విమానం కూలిపోయే ముందు కూడా పైలట్లు ఇలా మేడే కాల్ ఇచ్చారు) డీజీసీఏ నిర్ధారించగా.. వాటిలో ఐదు మన హైదరాబాద్ గగనతలంలో ఉన్న విమానాల నుంచి వచ్చినవి కావడం గమనార్హం. విమానాశ్రయాల్లో ల్యాండింగ్, టేకాఫ్ సమయాల్లో పక్షులు/జంతువులు ఢీకొన్న సంఘటనలు ఏటా దేశవ్యాప్తంగా 2వేలదాకా నమోదవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. గణాంకాల ప్రకారం.. ఢిల్లీ, అహ్మదాబాద్ విమానాశ్రయాల్లో పక్షుల బెడద ఎక్కువగా ఉంది. విమానాలను పక్షులు ఢీకొన్న ఘటనలు.. ఢిల్లీలో ఏటా సగటున 400 దాకా నమోదవుతున్నాయి. అక్కడ ఈ ఏడాది జనవరి 1 నుంచి మే నెలాఖరు వరకూ 95 ఘటనలు అలాంటివి నమోదయ్యాయి. శంషాబాద్ విమానాశ్రయ పరిధిలో జనవరినుంచి మే వరకు 49 పక్షులు ఢీకొన్న ఘటనలు జరిగాయి. 2022లో ఇలాంటి ఘటనలు 92 జరగ్గా.. ఆ తరువాత 2023లో 136, 2024లో 143 నమోదయ్యాయి. ఇవి విమానయాన భద్రతపైఆందోళన కలిగిస్తున్నాయి.

ఎన్ని చర్యలు తీసుకున్నా..

పక్షుల బెడద తగ్గించేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ జీఎంఆర్ పలు చర్యలు తీసుకుంటోంది. రన్‌వే సమీపంలో పక్షులను నియంత్రించేందుకు అధిక తరంగదైర్ఘ్యంతో శబ్దాలు చేసే స్పీకర్లను ఏర్పాటు చేశారు. పక్షుల కోసమే తయారు చేసిన ఈ పరికరాలు నిరంతరం పనిచేస్తుంటాయి. అలాగే.. పక్షులను భయపెట్టేందుకు రన్‌వేలకు రెండు వైపులా ప్రతి 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో టపాసులు కాలుస్తున్నారు. ఇందుకోసం నిరంతరం కొందరు పనిచేస్తుంటారు. దీంతో పాటు చుట్టు పక్కల పక్షులు చేరకుండా ఎప్పటికప్పుడు గడ్డి తొలగిస్తుంటారు. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో సాధ్యమైనంత వరకు చెత్త, కుళ్లిన ఆహార పదార్థాలు ఓపెన్ నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఎయిర్ పోర్టు పరిసరాల్లో ముఖ్యంగా కాటేదాన్, జల్‌పల్లి ప్రాంతాల్లో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న పరిశ్రమల వల్ల పక్షుల బెడద పెరుగుతున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతాల్లో కొందరు.. నిబంధనలకు విరుద్ధంగా జంతు కళేబరాలు, ఇతర వ్యర్థ పదార్థాల నుంచి నూనె తీసే పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. వీటి వల్ల పక్షుల బెడద పెరుగుతోంది. అయినా వాటిని మూసివేయించాలని ఫిర్యాదులు అందుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



విడుదలకు సిద్ధం

ప్రవీణ్, వైవా హర్ష ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకత్వంలో లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి నిర్మించారు. తాజాగా, ఈ సినిమాను ఆగస్టు 8న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా ఎస్‌జే శివ మాట్లాడుతూ "హంగర్ కామెడీ కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమాలోని ప్రతీ సన్నివేశం ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచుతుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: మార్తాండ్.కె.వెంకటేశ్, డీఓపీ: బాల సరస్వతి, సంగీతం: వికాస్ బడిస.

ఆయనతో నటించడం నా అదృష్టం

- నిధి అగర్వాల్



'పవన్ కల్యాణ్‌తో కలసి నటించే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. ఎంతో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న పవన్ సినిమా ఎక్కువ మంది ప్రేక్షకులకు చేరువవుతుంది. వేరే వంద సినిమాలు చేసినా ఒకటే...పవన్ కల్యాణ్‌తో ఒక్క సినిమా చేసినా ఒకటే. ఈ ప్రయాణంలో ఆయన నుంచి ఎంతో నేర్చుకున్నా' అని అన్నారు హీరోయిన్ నిధి అగర్వాల్. ఆమె కథానాయికగా నటించిన 'హరి హర వీరమల్లు' సినిమా ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆమె మీడియాతో చిత్ర విశేషాలు పంచుకొన్నారు.

- ఈ సినిమాలో నా పాత్ర పేరు 'పంచమి'. చాలా శక్తిమంతమైన పాత్ర అది. పాత్రకు తగ్గట్టుగా స్టైలిస్ట్ ఐశ్వర్య దుస్తులను, ఆభరణాలను అద్భుతంగా రూపొందించారు. పవన్ కల్యాణ్‌కి, నాకు మధ్య వచ్చే సన్నివేశాలు బాగుంటాయి.
- డైరెక్టర్ క్రిష్ నన్ను 'పంచమి' పాత్రకు ఎంపిక చేశారు. అలాగే జ్యోతి కృష్ణ సరైన సమయానికి దర్శకత్వ బాధ్యతలు తీసుకొని సినిమాని పూర్తి చేశారు.
- ఏ.ఎం.రత్నం గొప్ప నిర్మాత. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా వెనకడుగు వేయలేదు. సినిమాని నమ్మి ఇన్నేళ్ళు బలంగా నిలబడ్డారు. చిత్రాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.
- ట్రైలర్ రాకముందు కొందరు ఈ సినిమా ఎలా ఉంటుందనే అనుమానాలు వ్యక్తం చేశారు. అందరి అనుమానాలను ట్రైలర్ పటాపంచలు చేసింది. ఈ సినిమాలో భరతనాట్యం నేపథ్యంలో ఒక సన్నివేశం ఉంటుంది. ఆ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ఛాలెంజింగ్‌గా అనిపించింది.
- పీరియాడికల్ సినిమాలకు కీరవాణి పెట్టింది పేరు. పైగా ఆస్కార్ విజేత. వీరమల్లుకి అద్భుతమైన సంగీతం అందించారు. ముఖ్యంగా నేపథ్య సంగీతం గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు. 'తార తార', 'కొల్లగొట్టినాదిరో' పాటలు నాకు బాగా నచ్చాయి.

డీజీపీపై కేటీఆర్ పోస్ట్

» ఖండించిన పోలీసు అధికారుల సంఘం

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టు శశిధర్ గౌడ్ అరెస్టు విషయంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో చేసిన పోస్టుపై పోలీసు అధికారుల సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'అధికారంలో ఎవరూ శాశ్వతంగా ఉండరు. మాకూ ఓ రోజు వస్తుంది. అప్పుడు మీ(డీజీపీ జితేందర్) ప్రతీ చర్యను సమీక్షిస్తామని హామీ ఇస్తున్నా" అంటూ కేటీఆర్ హెచ్చరించడాన్ని పోలీసు అధికారుల సంఘం ఖండించింది. తెలంగాణ పోలీసులు చట్ట పరిధిలో పని చేస్తున్నారని, పోలీసులను అగౌరవపరిచే వ్యాఖ్యలు చేయడం కేటీఆర్ మానుకోవాలని పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి ఓ ప్రకటన చేశారు.

ఇలా కుక్కి తీసుకెళితే ఎలా?

» ఆటోలు, స్కూల్ బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థుల తరలింపు

» నామమాత్రంగా రవాణా శాఖ తనిఖీలు

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నలుగురు వెళ్లాల్సిన ఆటోలో 8 నుంచి 10 మంది.. 8 మందిని తీసుకెళ్లాల్సిన మారుతీ ఓమ్ని వ్యాన్‌లో 15 నుంచి 18 మంది.. మినీ బస్సుల్లో అయితే 30 నుంచి 40 మంది.. విద్యార్థులను కుక్కి మరీ తీసుకెళుతున్నారు. ఆ పిల్లల బ్యాగులు, లంచ్‌బాక్సులు అదనం. ఇది రాష్ట్రవ్యాప్తంగా ప్రతిచోటా కనిపిస్తున్న తంతు. పొద్దున బడులకు వెళ్లేప్పుడు, ఇళ్లకు వచ్చేప్పుడు చిన్నారులకు ఈ ప్రమాదకర ప్రయాణం తప్పడం లేదు. ఏదైనా కారణంతో అనుకోని ప్రమాదం జరిగితే ఎలాగన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలా ప్రైవేటు వాహనాలు, ఆటోల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులను తరలిస్తున్నా రవాణా శాఖ నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. 'విద్యార్థులను తరలించే వాహనాలపై నిరంతర తనిఖీలు కొనసాగుతుంటాయి. అధికారులు, సిబ్బంది కొరత కారణంగా నిత్యం, ప్రతి చోటా తనిఖీచేసే వెసులుబాటు ఉండదు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు కూడా కొంత బాధ్యతగా వ్యవహరిస్తే ఈ సమస్యను అరికట్టవచ్చు' అని రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.



గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో విద్యార్థులను కుక్కి తీసుకెళ్తున్న ప్రైవేటు వాహనం

'స్థానిక' ఎన్నికల కోసమే రైతు భరోసా

» ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న హామీ ఏమైంది?

» రైతుల విషయంలో కాంగ్రెస్‌ది మొసలి కన్నీరు

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శ



హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా నిధులు విడుదల చేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్ర రైతాంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తోందని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చాక 19నెలలు రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం ఇప్పుడు వారి శ్రేయస్సు గురించి మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కిసాన్‌మోర్చా రాష్ట్ర పదాధికారుల సమావేశంలో రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న హామీ ఏమైంది? ధరణిని భూభారతిగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మరిన్ని సమస్యలు తెచ్చిపెట్టింది. అనేకమంది రైతులు రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలిచ్చే పరిస్థితి లేదు. రిటైరైన ఉద్యోగులకు ప్రయోజనాలు అందడం లేదు" అని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో మార్కెటింగ్, రుణ సదుపాయాలు కల్పిస్తోందని చెప్పారు. కేంద్రం వైఖరి కారణంగానే యూరియా కొరత ఏర్పడిందంటూ రాష్ట్ర ప్రభుత్వం అవాస్తవాలు ప్రచారం చేస్తోందని విమర్శించారు. గుజరాత్‌లో రైతు ఉద్యమాలు కేంద్రంగా భారతీయ కిసాన్ సంఘ్ పనిచేసి, బీజేపీ గెలుపునకు మూల స్తంభంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలోనూ కిసాన్‌మోర్చా రైతులతో మమేకం కావాలని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను వివరించాలని పిలుపునిచ్చారు.

ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్ల భర్తీకి షెడ్యూల్

రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి గురువారం షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 19 నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుండగా.. ఆగస్టు 10 వరకు సీట్ల భర్తీ చేసుకునే అవకాశం కల్పించింది. అర్హత, ఎంపిక విధానానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేశామని మండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి చెప్పారు. మరిన్ని వివరాల కోసం కళాశాలల అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు. కాగా, ప్రైవేటు కాలేజీల్లో 70శాతం సీట్లను ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తుండగా, మిగతా 30శాతం సీట్లను యాజమాన్య కోటా ద్వారా భర్తీ చేస్తారు.

ఓఆర్ఆర్ లోపల కల్లు అమ్మకాలు బంద్?

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలో కల్లు విక్రయాలు మళ్లీ మొదలయ్యాయి. 2004లో కల్లు దుకాణాలు ఎందుకు మూతపడ్డాయి.. ఏ కారణంతో విక్రయాలను నిలిపేశారు? అనే అంశాలపై ఆబ్కారీ శాఖ కమిషనర్ అధికారులతో చర్చించారు. 2014లో దుకాణాలు తిరిగి ప్రారంభించడానికి ఎలాంటి కారణాలను చూపారనే అంశాల గురించి తెలుసుకున్నారు. ఈ రెండు సందర్భాలలో తీసుకున్న నిర్ణయాలను అధికారులు ప్రభుత్వానికి వివరించినట్లు తెలిసింది. దీంతో ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాన్ని గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేయాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల సరఫరా జరగకుండా కఠినంగా వ్యవహరిస్తోంది. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టే ఏ కార్యక్రమాన్ని సహించేది లేదని, ఈగల్ అనే పేరుతో ప్రత్యేక వ్యవస్థనూ ఏర్పాటు చేసి నిఘాను పటిష్ఠం చేసింది. ఇలాంటి తరుణంలో కల్తీ కల్లు తాగి కూకట్‌పల్లిలో పది మంది మరణించిన ఘటనను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం.. తాటి చెట్లు లేనిచోట కల్లు విక్రయాలను నిలిపేయాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. కల్తీ కల్లు విక్రయాలను నిలువరించాలంటే విక్రయాలను అడ్డుకోవడం ఒక్కటే పరిష్కారమార్గమని ఆబ్కారీ శాఖ అధికారులు కూడా ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. కల్తీ కల్లు ఘటన అనంతరం ఓఆర్ఆర్ లోపల ఎన్ని కల్లు దుకాణాలు ఉన్నాయనే వివరాలను కూడా ప్రభుత్వం తెప్పించుకుంది. ఓఆర్ఆర్ లోపల కల్లు విక్రయాలను నిలిపేస్తే హైదరాబాద్, సికింద్రాబాద్‌తోపాటు రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్ పరిధిలోని మల్కాజిగిరి, మేడ్చల్, షాద్‌నగర్, సరూర్‌నగర్ సూపరింటెండెంట్ల పరిధిలో ఉన్న కల్లు విక్రయ కేంద్రాలన్నీ మూతపడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఔటర్ లోపల కల్లు విక్రయాల పరిస్థితి ఇదీ..

కూకట్‌పల్లి ఘటన అనంతరం లిక్కర్‌తోపాటు కల్లు అమ్మకాలు ఎంత మేరకు జరుగుతున్నాయనే అంశంపై అధికారుల్లో చర్చ జరిగింది. ఓఆర్ఆర్ లోపల లిక్కర్ అమ్మకాలతో సమానంగా కల్లు విక్రయాలు కూడా ఉన్నాయని గుర్తించిన అధికారులు.. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ప్రస్తుతం ఓఆర్ఆర్ లోపల తాటి కోఆపరేటివ్ సొసైటీలు 390 ఉన్నాయి. అందులో హైదరాబాద్ నగరంలో 14 ఉన్నాయి. ఈ సొసైటీల పరిధిలో 53 కల్లు దుకాణాలు ఉన్నాయి. సికింద్రాబాద్ పరిధిలో 31 సంఘాలు ఉంటే వాటి కింద 50 దుకాణాలు, రంగారెడ్డి ఎక్సైజ్ జిల్లా మల్కాజిగిరి పరిధిలో 77 సంఘాలు ఉండగా, వాటి పరిధిలో 79 దుకాణాలు ఉన్నాయి. మేడ్చల్ పరిధిలో 50 సంఘాలు ఉంటే వాటి పరిధిలో 52 దుకాణాలు, సరూర్‌నగర్ పరిధిలో 158 సంఘాలు ఉంటే 158 దుకాణాలు, శంషాబాద్ పరిధిలో 60 సంఘాల కింద 62 దుకాణాలు ఉన్నాయి. మొత్తం 390 సంఘాల పరిధిలో 454 దుకాణాల్లో కల్లు విక్రయాలు జరుగుతున్నాయని ఆబ్కారీ శాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. ఇక హైదరాబాద్, సికింద్రాబాద్ మినహా మేడ్చల్, మల్కాజిగిరి, శంషాబాద్, సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో ఉన్న టీఎఫ్‌టీ (ట్రీ ఫర్ ట్రేడ్) అనుమతులకు సంబంధించి ఔటర్ లోపల ఉన్న కల్లు దుకాణాలు కూడా రద్దయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ కింద 6, సికింద్రాబాద్ 6, రంగారెడ్డి 21 ఎక్సైజ్ స్టేషన్లు కలిపి 33 స్టేషన్ల పరిధిలో కల్లు దుకాణాలన్నీ రద్దు కానున్నట్లు సమాచారం. ఎక్సైజ్, టీజీ న్యాబ్, కొత్తగా ఏర్పాటు చేసిన ఈగల్ నిఘా విభాగం అన్ని కలిసి పటిష్ఠ నిఘా పెడుతున్నా.. కల్తీ కల్లు తయారీకి వినియోగించే అల్ప్రా జోలం, డైజీపాం, హైడ్రోక్లోరైడ్ వంటి మత్తు పదార్థాలను పూర్తి స్థాయిలో అరికట్టలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో ఓఆర్ఆర్ లోపల కల్లు విక్రయాల అనుమతులను రద్దు చేయాలని ప్రభుత్వం ఓ నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటన.. మరో మహిళ మృతి



సునీత (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో కల్తీ కల్లు ఘటనలో మరొకరు మరణించారు. కూకట్‌పల్లి ఇందిరాహిల్స్‌కు చెందిన సునీత(42) అనే మహిళ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించారని కూకట్‌పల్లి ఎస్సై నరసింహ తెలిపారు. జూలై 5న ఇందిరానగర్ కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగిన సునీత.. మరుసటి రోజు తన స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా ఇంద్రకల్‌కు వెళ్లారు. అక్కడ అస్వస్థతకు గురవ్వగా కుటుంబసభ్యులు ఏడో తేదీన నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సునీతను ఈ నెల 15న ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మరణించింది. కాగా, పాల ప్యాకెట్ల తరహాలో గుండ్లపోచంపల్లి అయోధ్యనగర్‌లోని ఓ హోటల్‌లో కల్లు ప్యాకెట్లను విక్రయిస్తున్న వారిని ఎక్సైజ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌వీఎస్ బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్న 270 లీటర్ల కల్లు ప్యాకెట్లను సీజ్ చేశారు. హోటల్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. మరోపక్క, సైదాబాద్ ప్రాంతంలో అనుమతి లేకుండా కల్లు విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు వారి వద్ద 750 లీటర్ల కల్లును స్వాధీనం చేసకున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ ఆకస్మిక సోదాలు

» బీబీనగర్, సదాశివపేట, జడ్చర్లలో తనిఖీలు

» భారీగా అక్రమాల గుర్తింపు.. రూ.97,880 సీజ్

» 32 మంది ప్రైవేటు ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్ల పట్టివేత

» ఎస్ఆర్ఓల కస్టడీలోని 152 డాక్యుమెంట్ల స్వాధీనం

హైదరాబాద్/బీబీనగర్/సంగారెడ్డి క్రైం/సదాశివపేట/జడ్చర్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. గురువారం బీబీనగర్, సదాశివపేట, జడ్చర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక సోదాలు జరిపి భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించారు. వ్యక్తిగత నగదు రిజిస్టర్‌ను సక్రమంగా నిర్వహించట్లేదని నిర్ధారించి.. ఈ మూడు కార్యాలయాల్లోని సిబ్బంది, అధికారుల వద్ద లెక్కల్లో చూపించని రూ.97,880 స్వాధీనం చేసుకున్నారు. అలాగే ప్రైవేటు ఏజెంట్లు, డాక్యుమెంటు రైటర్లు యథేచ్ఛగా తిరుగుతున్నట్లు గుర్తించి.. మొత్తం 32 మందిని అధికారులు పట్టుకున్నారు. ఆయా కార్యాలయాల్లో సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదని తేల్చారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే సంబంధిత వ్యక్తులకు ఇవ్వాల్సిన డాక్యుమెంట్లను ఎస్ఆర్ఓలు తమ కస్టడీలోనే పెట్టుకుంటున్నట్లు గుర్తించారు. ముగ్గురు ఎస్ఆర్ఓల వద్ద మొత్తం 152 డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ డీజీ విజయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బీబీనగర్ ఎస్ఆర్వో కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ జగదీశ్ చంద్ర, జడ్చర్ల ఎస్ఆర్వో ఆఫీసులో ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ, సదాశివపేట ఎస్ఆర్వో కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోదాలు జరిపినట్లు వెల్లడించారు. 'బీబీనగర్ ఎస్ఆర్ఓ ఆఫీసులో లెక్కల్లో చూపని నగదు రూ.61,430, ఎస్ఆర్ఓ కస్టడీలోని 93 రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నాం. 12 మంది ప్రైవేటు ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లను పట్టుకున్నాం. జడ్చర్ల ఎస్ఆర్ఓ కార్యాలయంలో రూ.30,900 నగదుతో పాటు ఎస్ఆర్ఓ కస్టడీలోని 20 డాక్యుమెంట్లు గుర్తించాం. సదాశివపేట ఎస్ఆర్ఓ కార్యాలయంలో రూ.5,550తో పాటు ఎస్ఆర్ఓ కస్టడీలోని 39 డాక్యుమెంట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నాం' అని వివరించారు.

హైకోర్టు ఏసీజేగా జస్టిస్ శ్యాం కోషీ నియామకం

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శ్యాం కోషీని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ (ఏకే సింగ్) శనివారం తెలంగాణ హైకోర్టు సీజేగా ప్రమాణం చేయనున్న నేపథ్యంలో అప్పటి వరకు జస్టిస్ శ్యాం కోషీ. ఏసీజే బాధ్యతలు నిర్వహిస్తారు.

మావోయిస్టు దంపతులు.. సంజీవ్, దీనా లొంగుబాటు

» గద్దర్ సమకాలీకుడు సంజీవ్

» 45 ఏళ్లుగా అజ్ఞాతంలోనే సంజీవ్

» దీనాది 33 సంవత్సరాల అజ్ఞాతం

» మిగతా నక్సలైట్లూ లొంగిపోతే ఆదుకుంటాం : సీపీ సుధీర్‌బాబు



లొంగిపోయిన సంజీవ్, దీనా దంపతులు

కొత్తపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా గాయకుడు గద్దర్ సమకాలీకుడు.. మావోయిస్టు సంజీవ్ జనజీవన స్రవంతిలో కలిశారు. గురువారం ఆయన తన భార్య దీనాతో కలిసి రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు ఎదుట లొంగిపోయారు. వీరిద్దరిపై రూ.20లక్షల చొప్పున రివార్డు ఉంది. సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుధీర్‌బాబు వివరాలను వెల్లడించారు. మాల సంజీవ్ అలియాస్ అశోక్ అలియాస్ లెంగు దాదా(62) సుమారు 45 ఏళ్లపాటు అజ్ఞాతంలో ఉంటూ.. నక్సలిజం, మావోయిజంలో కొనసాగారు. గద్దర్ సమకాలీకుడైన ఆయన.. దండకారణ్య జోనల కమిటీలో.. సెక్రటేరియేట్ సభ్యుడిగా ఉన్నారు. ఆయన భార్య పెరుగుల పార్వతి అలియాస్ బొంతల పార్వతి అలియాస్ దీనా(50) కూడా 33 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉంటూ.. ప్రస్తుతం తెలంగాణ కమిటీ సభ్యురాలిగా మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారు. జనజీవన స్రవంతిలో కలిసేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని సుధీర్‌బాబు చెప్పారు. సంజీవ్, దీనా అనారోగ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

1980లో.. జన నాట్యమండలిలో..

సంజీవ్ స్వస్థలం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యాప్రాల్. గద్దర్ నేతృత్వంలోని జననాట్య మండలి(జేఎన్ఎం).. పీపుల్స్ వార్‌లో సాంస్కృతిక సేవలందించింది. 1980లో పీడబ్ల్యూజీలో భాగమైన జేఎన్ఎంలో చేరిన సంజీవ్.. 16 రాష్ట్రాల్లో డప్పు రమేశ్ దయా, విద్య, దివాకర్‌తో కలిసి.. 1986 వరకు ప్రదర్శనలిస్తూ యువతను పీపుల్స్ వార్ వైపు ఆకర్షించారు. 1982లో కరీంనగర్ జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన పంజాల సరోజను పెళ్లి చేసుకున్నారు. 2001లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కమిటీలో పనిచేశారు. 2002లో జరిగిన ఎదురుకాల్పుల్లో సరోజ మరణించగా సంజీవ్ తప్పించుకున్నారు. 2003లో దండకారణ్య జోన్ కమిటీకి బదిలీ అయ్యారు. చైతన్య నాట్య మంచ్ (సీఎన్ఎం)ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2007లో ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా వంకేశ్వరానికి చెందిన దీనాను పెళ్లిచేసుకున్నారు. వీరిద్దరూ తెలుగు, హిందీ, గిరిజన భాషల్లో పాటలు ఆలపిస్తూ గిరిజనులను నక్సలిజంవైపు ఆకర్షించేవారు. 2005లో బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లోనూ సంజీవ్ తప్పించుకున్నారు.

ఇదీ.. దీనా నేపథ్యం

1992లో పీడబ్ల్యూజీలోకి అడుగుపెట్టిన దీనా.. ఆ తర్వాత జేఎన్ఎంలో సేవలందించారు. 1998లో ఏరియా కమిటీ సభ్యురాలి(ఏసీఎం)గా పదోన్నతి పొందారు. ఏవోబీలోని విశాఖ జిల్లా గాలికొండ ఏసీఎంగా 2004-07 మధ్యకాలం లో పనిచేశారు. అదే ఏడాది ఛత్తీస్‌గఢ్ చేరుకున్నారు. అక్కడ సంజీవ్‌ను పెళ్లిచేసుకుని, సీఎన్ఎం సభ్యురాలిగా చురుగ్గా పాల్గొనేవారు. 2018లో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొందారు.

సీఎం రేవంత్‌కు హైకోర్టులో ఊరట

» ఆయనపై 2016 నాటి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కొట్టివేత

హైదరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2016లో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఆయనపై నమోదైన ఆ కేసును హైకోర్టు గురువారం కొట్టేసింది. ఘటనా స్థలంలో రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా లేరని, ఆయనకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం సెక్షన్లు వర్తించవని స్పష్టం చేసింది. రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ అనంతరం ఈ తీర్పు వెలువరించింది. తీర్పు ఇచ్చే ముందు.. పిటిషన్‌ను మరో హైకోర్టుకు బదిలీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించామని ఫిర్యాదుదారు ఎన్ పెద్దిరాజు తరఫు న్యాయవాది చెప్పడంపై జస్టిస్ మౌషమీ భట్టాచార్య అసహనం వ్యక్తం చేశారు. అయితే ఫిర్యాదుదారు ఇప్పటికీ చట్ట ప్రకారం ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవచ్చని, తమ విధి ప్రకారం తీర్పు ప్రకటించామని స్పష్టం చేసింది. ఈ కేసు వివరాల్లోకి వెళ్తే.. నాడు రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, మరో వ్యక్తి తనను కులం పేరుతో దూషించారని రాజోల్ ఎస్సీ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ఎన్ పెద్దిరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపన్‌పల్లి గ్రామం సర్వే నంబర్ 127లోని సొసైటీకి సంబంధించిన భూమిని ఆక్రమించడంతో పాటు నిర్మాణాలను జేసీబీతో కూల్చేశారంటూ గచ్చిబౌలి పీఎస్‌లో 2016లో కేసు నమోదైంది. ఈ కేసులో ఏ-1గా కొండల్ రెడ్డి, ఏ-2గా ఈ.లక్ష్మయ్య, ఏ-3గా రేవంత్ రెడ్డిని చేర్చారు. ఎల్బీనగర్‌లోని రంగారెడ్డి జిల్లా ఎస్సీ ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టులో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని రేవంత్ రెడ్డి 2020లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌషమీ భట్టాచార్య విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం.. రేవంత్ రెడ్డి ఘటనా స్థలంలో లేరనే విషయాన్ని ఫిర్యాదుదారు సైతం అంగీకరించారని పేర్కొంది. తాను లేను కాబట్టి తనపై కేసు కొట్టేయాలని అడుగుతున్నారని, మిగతా వారిపై కేసుకొట్టేయాలని అడగటం లేదని వ్యాఖ్యానించింది. రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకే దూషించారనే ఆరోపిస్తున్నా ఆధారాలు లేవని తెలిపింది. ఇదే భూమికి సంబంధించి ఇదే ఆరోపణలతో గచ్చిబౌలి పీఎస్‌లో 2014లో సైతం కేసు నమోదైందని, నిందితులు-సొసైటీకి మధ్య సివిల్ వివాదమని తేలడంతో తప్పుడు కేసుగా మూసేశారని గుర్తుచేసింది. దీనిపై ఫిర్యాదుదారు పెద్దిరాజు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించగా.. కోర్టు దాన్ని కొట్టేసిందని, దానిపై క్రిమినల్ రివిజన్ పెండింగ్‌లో ఉందని పేర్కొంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దిద్దుబాట!

భారత విదేశాంగమంత్రి జైశంకర్ చైనాలో కాలూని, దాని అధ్యక్షుడు జిన్‌పింగ్, ఉపాధ్యక్షుడు హాన్‌జెంగ్, విదేశాంగమంత్రి వాంగ్ యీతో భేటీకావడం ఉభయదేశాల సంబంధాల్లో సానుకూల మార్పుకు దోహదం చేస్తుందని ఆశించవచ్చు. షాంఘై సహకార సంస్థ విదేశాంగమంత్రుల సదస్సుకు హాజరైన సందర్భంలో ఈ భేటీలూ చర్చలూ జరిపినప్పటికీ, ఐదేళ్ళ క్రితం గల్వాన్ లోయలో భారత్–చైనా ఘర్షణలు జరిగిన తరువాత జయశంకర్ అక్కడ పర్యటించడం ఇదే మొదటిసారి. ఇటీవలి భారత్–పాక్ ఘర్షణలో పాకిస్థాన్ పక్షాన చైనా నిలబడి దానికి సమస్త సహకారాన్నీ అందించిందని మన సైనికాధికారులు కుండబద్దలు కొట్టిన తరువాత, అటువంటిదేమీ లేదని చైనా దబాయించిన విషయం తెలిసిందే. ఈ చిన్న స్థాయి యుద్ధం తరువాత చైనాకూ మనకూ మానసికంగా మరింత దూరం పెరిగిన నేపథ్యంలో జయశంకర్ పర్యటన కొన్ని దిద్దుబాట్లు, సర్దుబాట్లు చేసుకోవడానికి ఉపకరించవచ్చు.

గత ఏడాది అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంలో భారత ప్రధాని, చైనా అధ్యక్షుల మధ్య భేటీ జరిగింది. సంబంధాలు మెరుగుపరచుకోవాలని, పూర్వస్థితికి తీసుకుపోవాలని అక్కడ నిర్ణయం జరగడంతో ఉభయదేశాల సరిహద్దు స్థితిగతుల్లోనూ మార్పు వచ్చింది. డెమ్‌చోక్, డెప్సాంగ్ ప్రాంతాల్లో సైన్యాలను ఉపసంహరించుకోవడంతో ఉద్రిక్తతలు చల్లారాయి. జాతీయభద్రతా సలహాదారు అజిత్‌దోవల్, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఇత్యాదులు కూడా అనంతరకాలంలో చైనాలో పర్యటనలు చేశారు. నాథూలాపాస్ మీదుగా మానససరోవర్ యాత్ర ఆరేళ్ళ తరువాత ఆరంభం, విమాన సర్వీసులు పునరుద్ధరించాలని, వీసా ప్రక్రియలను సరళీకరించాలని అనుకోవడం వంటి సానుకూల చర్యలు ఒకపక్కన కనిపిస్తున్నా, చైనా వ్యవహారశైలి ఒక పట్టాన ఊహకు అందదు. సంబంధాలు మెరుగుపడుతున్నాయని అనుకోగానే, పూర్తిగా తిరగబడటం కూడా అనుభవంలో ఉన్నదే. విద్యుత్‌వాహనాల తయారీలో అత్యంత కీలకమైన ఖనిజాలు, హైటెక్ యంత్రాల ఎగుమతులపైన ఆంక్షలు విధించి భారత్‌ను ఇబ్బందిపెట్టాలన్న నిర్ణయం ఈ కోవలోనిదే. మన భారీ ప్రాజెక్టులకు ఆటంకాలు కల్పించడానికీ, టెలికాం, ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాలను హద్దుల్లో ఉంచడానికీ ఆంక్షలను ఆయుధంగా వాడుతూ, ప్రపంచ వాణిజ్యసంస్థ ఒడంబడికలను సైతం ఉల్లంఘించడానికి చైనా సందేహించడంలేదు.

షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) ఆవిర్భావ లక్ష్యాల్లో ఉగ్రవాదం, వేర్పాటువాదంపై ఉమ్మడి పోరాటం కూడా ఒకటి. కానీ, పాకిస్థాన్ నొచ్చుకుంటుందన్న ఏకైక కారణంగా మొన్నటి సంయుక్త ప్రకటనలో పహల్గాం దాడి ప్రస్తావనను ఉద్దేశపూర్వకంగా వదిలేసి, బలూచిస్థాన్ రైలు దాడిని చేర్చి మిత్రదేశానికి ఆనందాన్ని చేకూర్చిన విషయం తెలిసిందే. పహల్గాం ఊసులేనందుకు మన రక్షణమంత్రి ఆ ప్రకటనపై సంతకం చేయలేదు. ఆపరేషన్ సిందూర్‌లో పూర్తిగా పాకిస్థాన్ పక్షాన నిలబడి, జె–10సి యుద్ధవిమానాలు, మిసైళ్ళు, డ్రోన్లతోపాటు, కీలకమైన యుద్ధసమాచారాన్ని కూడా చేరవేసిందని మన రక్షణరంగ నిపుణులు నమ్ముతున్నారు. సరిహద్దుల్లో పేరుకు ఉపసంహరణలు జరిగినా, కీలకమైన ఆర్మీ పోస్టుల్లో ఇంకా చైనా సైనికుల అనుమతితోనే మనవారు కాపలా కాయాల్సివస్తున్నదని కాంగ్రెస్ దెప్పిపొడుస్తోంది. నా కోయి గుస్‌గయా అంటూ ఐదేళ్ళక్రితమే ప్రధాని మోదీ మన పార్లమెంటులో దబాయించడంతో, అంతర్జాతీయ వేదికలమీద దీనిని ఆయుధంగా వాడుకోవడానికి చైనాకు అవకాశం దక్కిందని కాంగ్రెస్ వాదన.

గతంలో కొన్ని దశాబ్దాలుగా ఒక్క బుల్లెట్ కూడా పేలని భారత్–చైనా సరిహద్దు, మనం అమెరికాతో రాసుకుపూసుకోవడం హెచ్చిన తరువాత నిత్య ఘర్షణలకు నిలయమైన మాట నిజం. చైనా, భారత్ మధ్య వివిధ రంగాల్లో పోటీ అనివార్యం. కానీ, డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయిన తరువాత భారత్–చైనాలకు అనేక కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. రష్యాతో వాణిజ్యం చేసే దేశాలమీద ఐదురెట్ల సుంకాలు విధిస్తామని అమెరికా–నాటో హెచ్చరికలు చేస్తున్నాయి. భారత్–చైనాకు నష్టకరమైన ఈ తరహా నిర్ణయాలు అనేకం జరుగుతున్నాయి, రాబోయే రోజుల్లో ట్రంప్ నుంచి మరిన్ని ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో భారత్‌ను గుడ్డిగా ద్వేషించడం వల్ల చైనాకు ఒరిగేదేమీ ఉండదు. ఉభయదేశాల ఉమ్మడి ప్రయోజనాలే పునాదిగా దౌత్యసంబంధాలు దృఢ పడాలి.

రాధికను చంపింది తండ్రి మాత్రమేనా!?

ఇటీవల గుర్‌గావ్‌లో తండ్రి చేతిలో మరణించిన కూతురు రాధిక యాదవ్ ఒక రాష్ట్రస్థాయి టెన్నిస్ ప్లేయర్. ఎన్నో టోర్నమెంట్లు ఆడి గెలిచింది, తన లాంటి యువ క్రీడాకారుల్ని ప్రోత్సహించేందుకు ఒక అకాడమీని కూడా ఏర్పాటు చేసింది. చివరకు పాతికేళ్ళకే తండ్రి పేల్చిన రివాల్వర్‌కి హతమైంది. పోలీసుల ముందు ఆ తండ్రి తన నేరాన్ని ఒప్పుకుంటూ– కూతురి సంపాదన మీద ఆధారపడ్డావంటూ తమ ఊళ్ళోవాళ్ళు వెటకారంగా మాట్లాడటంతో తాను ఈ పని చేశానని అన్నాడు. టెన్నిస్ అకాడమీ పని మానేయమని చాలాసార్లు కూతురితో చెప్పాడట. కానీ రాధికా యాదవ్ అందుకు ఒప్పుకోలేదు. ఇదేగాక, కూతురు సోషల్ మీడియాలో ఏక్టివ్‌గా ఉంటూ రీల్సూ, మ్యూజిక్ వీడియోలూ షేర్ చేయటం కూడా ఆ తండ్రికి నచ్చలేదట!

ఈ ఘోరాన్ని జీర్ణించుకునే క్రమంలో కొన్ని ఆందోళనకరమైన అంశాలు మన ముందుకు వస్తాయి. ఒక స్త్రీ తనకంటూ ఒక కొత్త మార్గాన్ని నిర్మించుకుంటున్నప్పుడు చుట్టూ ఉన్న సమాజం ఎంత తీవ్రంగా దాన్ని ప్రతిఘటిస్తుందీ అన్నది ఇందులో ముఖ్యమైన అంశం. ఈ విషాదకర ఘటన మన సమాజంలో మనం ఒప్పుకోవటానికి ఇష్టపడని అంశాలు కొన్నింటిని తేటతెల్లం చేసింది. స్త్రీలు అడ్డుగోడలను బద్దలుకొట్టుకొని ముందుకు పోయినంత మాత్రాన పితృస్వామ్యం మాయమైపోదు. అది కొత్త రూపాల్లోకి పరిణామం చెంది, పునఃప్రవేశానికి కొత్త దారుల్ని వెతుక్కుంటుంది. వెళ్ళిన చోటల్లా సరికొత్త రూపాల్లో ప్రత్యక్షమవుతుంది. దీనికి ఎన్నో ఉదాహరణలు కనిపిస్తున్నాయి. పలు మాధ్యమాల ద్వారా కనపడి/ వినపడే స్త్రీలపై తీవ్రమైన ట్రోలింగ్ చూస్తున్నాం. ఆర్థిక సహకారానికి చట్టబద్ధ వెసులుబాటు కల్పించే మనోవర్తికీ సామాజిక దురాచారమైన వరకట్నానికీ అసంబద్ధంగా ముడిపెట్టి చేసే వాదనలూ వింటున్నాం. స్త్రీల సాధికారతపై విషం గక్కుతూ అంతకంతకూ పెరుగుతున్న 'ఇన్సెల్' సంస్కృతికి ఇవి కొన్ని ఉదాహరణలు.




ఈ విషాదం మనకు గుర్తు చేసే మరో అంశం– పితృస్వామ్యం లాభాలను మగవారు అనుభవిస్తున్నప్పటికీ వారు కూడా పితృస్వామ్యం దాడికి అతీతం కాదు. అది వాళ్లనెప్పుడూ పరిపూర్ణ మానవులుగా ఎదగనివ్వదు. తోటి మానవుల్లో మానవీయతను గుర్తించనివ్వదు. పితృస్వామ్యం నైతికంగా స్త్రీలనే గాక, పురుషులనూ లోతుగా గాయపరుస్తుంది– అంటుంది ఫెమినిస్ట్ మేధావి కరోల్ గిలిగన్. ఎందుకంటే పితృస్వామ్యం ఒత్తిడి కింద నలిగే ఆడవారూ మగవారూ ఇరువురూ 'ఆడతనం', 'మగతనం' అన్న కృతకమైన చట్రాల్లో ఇమడని తమలోని విశిష్ట వ్యక్తిత్వ అంశాలను రద్దు చేసుకుంటారు. హద్దులు దాటితే స్త్రీని శిక్షించే ఈ సమాజమే, పురుషుడి విలువను అతను ప్రదర్శించే ఆధిక్యతను బట్టి, స్త్రీపై అతను చెలాయించే అదుపును బట్టి అంచనా వేస్తుంది. తమకు చెందిన స్త్రీపై ఆధిక్యతను ప్రదర్శించలేని, ఆమెను అదుపు చేయలేని మగవాడిని ఈ సమాజం వెక్కిరిస్తుంది. స్త్రీని అణచివేసినందుకు మగవాడిని మెచ్చుకుని, ఆమెకి స్వేచ్ఛ ఇచ్చినందుకు తప్పుపట్టే ఈ సమాజం ఎంత క్రూరమైనది! దీన్ని ఈ స్థితి దాకా ఎలా దిగజారనిచ్చాం మనం! ఈ సందర్భంలో సమాజం నుంచి వినపడిన వెక్కిరింతలు ఒక బలహీనమైన మగతనాన్ని గాయపరిచాయి. స్త్రీ పురుష హోదాలు తారుమారు అవటాన్ని కూడా సహించలేనంత బలహీనమైన మగతనం అది! రాధికా యాదవ్ తండ్రిని వెక్కిరించిన ఇరుగుపొరుగువాళ్లు ఆ తుపాకీ ట్రిగ్గర్‌ను నొక్కకపోయి ఉండచ్చు, కానీ ఈ హింస వెనుక ఉన్న భావజాలాన్ని ప్రేరేపించింది వారి మాటలే. ఇలా అంటున్నామంటే– ఆ నేరస్థుడిని నింద నుంచి మినహాయిస్తున్నట్టు కాదు. స్త్రీద్వేషం కేవలం వ్యక్తులకు పరిమితం కాదని గుర్తిస్తున్నాం. స్త్రీ ద్వేషం సామూహికమైనది, వ్యవస్థాగతమైనది, పైపెచ్చు మెచ్చుకోలు అందుకునేది!

విజేతలైన స్త్రీలు కూడా స్త్రీ ద్వేషం నుంచి తప్పించుకోలేరని, పైగా ఆ విజయాలు ఆమెపై మరింత వ్యతిరేకతను పెంచుతాయనీ ఈ విషాదం మనకు గుర్తు చేస్తున్నది. ఈ పరిస్థితుల్లో లైంగిక న్యాయం జరగాలంటే స్త్రీలకు సమాన ప్రాతినిధ్యం లభించటం ఒక్కటే సరిపోదు. వ్యవస్థల్లోనూ మన మనసుల్లోనూ గూడు కట్టుకుపోయి ఉన్న పితృస్వామ్యాన్ని కూలదోసే విధంగా సామాజిక రాజకీయ అమరికల్లో విప్లవాత్మకమైన మార్పు సాకారం కావాలి.

• శివాని నాగ్
అంబేడ్కర్ యూనివర్సిటీ, ఢిల్లీ
(ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్)

మోదీ @75: భగవత్ మాటలో మర్మమేమిటి?



'మార్గదర్శక్' లాంటి పాత్రకు పరిమితమయ్యేలా ప్రధాని మోదీని బలవంతం చేయలేమన్న యథార్థాన్ని ఆరెస్సెస్ గ్రహించింది. మోదీ అనంతర బీజేపీకి యువ నాయకత్వాన్ని సమకూర్చేందుకు మరింత సర్వ జనామోద మార్గాన్ని సృష్టించాలని సంఘ్ అభిలషిస్తోంది. 'కౌన్ బనేగా బీజేపీ ప్రెసిడెంట్' అన్న క్లిష్టమైన ప్రశ్నకు లభించే సమాధానం– ఆధిపత్యం కోసం గుట్టుగా జరుగుతున్న అంతర్గత పోరులో సానుకూలతలు ఎవరికి ఉన్నాయో స్పష్టం చేస్తుంది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

'మా కాంగ్రెస్‌లో ముఠా కుమ్ములాటలు బహిరంగంగా జరుగుతాయి. ఎటువంటి దాపరికం ఉండదు. భారతీయ జనతా పార్టీలో కలహాలు, కుమ్ములాటలు అన్నీ మూడోవాడి కంటికి కనిపించకుండా గుట్టుగా సంభవిస్తుంటాయి' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఒకరు వాపోయారు. బహిరంగ ఆరోపణలు, ప్రత్యారోపణలతో స్వీయ లక్ష్యాలు సాధించుకోలేకపోగా ప్రత్యర్థి పార్టీలకు ప్రయోజనాలు చేకూర్చడమనే ప్రవృత్తి కాంగ్రెస్ నేతలలో మెండుగా కనిపిస్తోంది. కేరళలో శశిథరూర్, పీసీసీ నాయకుల మధ్య వాగ్వాదాలు; కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వర్గాల పరస్పర నిందలు అందుకు తాజా నిదర్శనాలు. కాంగ్రెస్‌కు విరుద్ధంగా బీజేపీ, సంఘ్ పరివార్‌లో అధికారానికి, ఆధిపత్యానికి అంతర్గత పోటీలు చాలా చాలా అరుదుగా మాత్రమే ప్రజల దృష్టికి వస్తాయి. కారణమేమిటి? చిన్నపాటి జగడం సైతం మీడియా దృష్టికి వెళ్లకుండా సంఘీయులు, బీజేపీ శ్రేణులు అత్యంత జాగ్రత్త వహించడమేనని చెప్పవచ్చు. ఉత్తరప్రదేశ్ పాలనా వ్యవహారాలలో పెత్తనానికై అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్ మధ్య ఎడతెగని పోటీ, బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికలో నెలల తరబడి జాప్యానికి ఆరెస్సెస్, బీజేపీ పెద్దల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం పతాక శీర్షికలుగా కాదు కదా వార్తలుగా కూడా కనిపించడం అరుదే. అంతర్గతంగా జరుగుతోన్న వాదోపవాదాల గురించి ఏమి మాట్లాడితే ఏమి ముప్పు వాటిల్లుతుందో అన్న భయాందోళనలు సంఘ్, బీజేపీ శ్రేణులను కట్టడి చేయడం పరిపాటి.

ప్రజా జీవితంలో ఉన్నవారు 75 ఏళ్ల వయస్సు రాగానే బాధ్యతల నుంచి వైదొలగాలని, పదవీ విరమణ చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భగవత్ సలహా ఇవ్వడం పలువురిని విస్మయపరిచింది, ఎంతో మందిని దిగ్భ్రాంతిపరిచింది, కొంత మందికి కించిత్ అసంతృప్తి కలిగించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో 75వ పుట్టిన రోజు జరుపుకోనున్నారు. అదే నెలలో మోహన్ భగవత్ సైతం 75వ పుట్టిన రోజు జరుపుకోనున్నారు. సంఘ్ అధినేత వ్యాఖ్యలకు ప్రతిపక్షాలు వెన్వెంటనే ఆనందోత్సాహాలతో ప్రతిస్పందించాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వారసుడు ఎవరో తక్షణమే నిర్ణయించేందుకు సంఘ్ నాయకత్వం ఆరాటపడుతోందని అనేందుకు భగవత్ వ్యాఖ్యలే తార్కాణమని విపక్షాలు గట్టిగా అభిప్రాయపడుతున్నాయి.

'మోదీ తరువాత, ఎవరు?' దశాబ్దాల క్రితం నాటి 'నెహ్రూ తరువాత, ఎవరు?' అన్న చర్చను జ్ఞాపకం చేస్తోంది. మోదీ తరువాత ఎవరు అన్నది చాలా ఆసక్తికరమైన విషయం, సందేహం లేదు. చర్చలు మొదలయ్యాయి, ముమ్మరమయ్యాయి. అయితే వాస్తవాన్ని పరిశీలిస్తే వాద్‌నగర్ నుంచి ప్రభవించిన వ్యక్తి చాలా మంది ఆశిస్తున్నట్టుగా చాలా తొందరగా ఆ ప్రతిష్ఠాత్మక పదవి నుంచి వెళ్లిపోతారా? పోరు, కచ్చితంగా. 2024 సార్వత్రిక ఎన్నికలపై నేను రాసిన పుస్తకంలో పేర్కొన్న ఒక ఆసక్తికరమైన ఉదంతాన్ని ఇక్కడ కూడా ప్రస్తావిస్తాను. ఆరు నూరైనా సరే అధికారంలో కొనసాగడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రగాఢంగా ఆకాంక్షిస్తారనేది ఆ ఉదంతం విశదం చేస్తుంది. నవ యువకుడిగా ఉన్నప్పుడు మోదీ అహ్మదాబాద్‌లో తన బాబాయి టీ స్టాల్‌లో కొంతకాలం పనిచేశారు. వాద్‌నగర్ నుంచి అహ్మదాబాద్‌కు రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థ బస్సులో వెళుతుండేవారు. అదే బస్సులో తిరిగి వాద్‌నగర్‌కు వెళ్లేవారు.. అహ్మదాబాద్ చేరగానే తిరిగి వెళ్లేందుకు సీటు రిజర్వేషన్‌కై తన బ్యాగ్‌ను బస్సులోనే వదిలివేసేవారట! ఈ కథ నుంచి తెలుసుకోవల్సిన విషయమేమిటి? మోదీ ఒకసారి ఒక కుర్చీలో కూర్చుంటే దాన్ని మరెవరూ ఆయన నుంచి లాక్కోలేరు! గుజరాత్ కాంగ్రెస్ నాయకుడు ఒకరు ఈ ఆసక్తికరమైన కథను నాకు చెప్పారు. నిజం కావచ్చు, కాకపోవచ్చు. అయితే దానిలో అంతర్లీనంగా ఉన్న సందేశమిది: అధికారం చెలాయించడం, పెత్తనం చేయడం మోదీ సహజ స్వభావం. తన భవిష్యత్తుపై తనకు పూర్తి నియంత్రణ లేకపోవడమనేది ఆయనకు సుతరామూ నచ్చని విషయం. అటువంటి నాయకులు పదవీ విరమణ చేయడం కాదు కదా అప్రధానంగా ఉండడానికి కూడా ఏ మాత్రం ఇష్టపడరు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులు ఏ విషయం పైన అయినా ఆచితూచి మాట్లాడుతారు. మరి మోహన్ భగవత్ హఠాత్తుగా పదవీ విరమణకు 75 సంవత్సరాల వయస్సు గురించి ఎందుకు ప్రస్తావించారు? సంఘ్‌లో ఒక వర్గంవారు బీజేపీలో తరం మార్పును కోరుకుంటున్నారని అధికార నడవాలలో గుసగుసలు గట్టిగా విన్పిస్తున్నాయి. బీజేపీ, ఆరెస్సెస్ నాయకత్వాల మధ్య గుంజాటన 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంలో బహిర్గతమయింది. ఆరెస్సెస్ మద్దతు తప్పనిసరిగా అవసరమైన నాటి కాలం నుంచి బీజేపీ ఇప్పుడు బాగా ఎదిగిందని, తన వ్యవహారాలను తానే బాగా చక్కదిద్దుకోగల శక్తి సామర్థ్యాలను సంపూర్ణంగా సంతరించుకున్నదని పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఒక జాతీయ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. నడ్డా వ్యాఖ్యలు సంఘ్ పరివార్ నాయకత్వ శ్రేణుల్లో ఆందోళనను రేకెత్తించాయి. మోదీ ఆరాధన కేంద్రంగా పెంపొందిన రాజకీయ పరిస్థితుల పట్ల ఆరెస్సెస్ నాయకత్వంలో నెలకొన్న అసంతృప్తి, చిరాకును ఆ ఆందోళన ప్రతిబింబించింది. పెచ్చరిల్లిపోతున్న మోదీ వ్యక్తిపూజ పట్ల మోహన్ భగవత్ తన ఆవేదనను గత సెప్టెంబర్‌లో వెలువరించిన ఒక ఉపన్యాసంలో ఇలా వ్యక్తం చేశారు: 'ప్రజాహిత కృషి ద్వారా ప్రతి ఒక్కరూ గౌరవాదరాలు పొందవచ్చు. అయితే మనం అటువంటి సమున్నత స్థితికి చేరామా లేదా అన్నది నిర్ణయించవలసింది ఇతరులే కాని మనకు మనమే కాదు. ఎవరైనా సరే తనకు తానుగా భగవంతుడనని ఎట్టి పరిస్థితులలోను ప్రకటించుకోకూడదు'. మోదీని ఉద్దేశించే భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని నిశ్చితంగా చెప్పవచ్చు.

అయితే తమ రాజకీయ, భావజాల ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలంటే మోదీ నాయకత్వం తప్పనిసరి అన్న విషయం ఆరెస్సెస్‌కు బాగా తెలుసు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం సీఎస్‌డీఎస్ నిర్వహించిన ఒక సర్వేలో మోదీకి లభిస్తున్న ప్రజాదరణ బీజేపీకి ఉన్న ప్రజా మద్దతు కంటే అధికంగా ఉన్నదని వెల్లడయింది. ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరు ప్రధానమంత్రి నాయకత్వం కారణంగానే తాము బీజేపీకి ఓటు వేశామని చెప్పారు. మోదీ నాయకత్వం లేకపోతే బీజేపీ దుర్బలమైపోవడం ఖాయమని ఆ సర్వే స్పష్టం చేసింది. బ్రాండ్ హిందుత్వకు రాజకీయ చిహ్నం మోదీ. హిందుత్వ శ్రేణులకు ఆయన సర్వసేనాధిపతి. ప్రజలను హిందుత్వ వైపు ఆకర్షించే ప్రధానశక్తి ఆయనే. ఒక విధంగా మనం 'మోదిత్వ' యుగంలో ఉన్నాం. వ్యక్తిపూజ మెల్లమెల్లగా మతపరమైన మెజారిటేరియనిజంగా పరిణమిస్తున్న శకమిది.


విస్తృత వ్యాప్తి, పెరిగిన పలుకుబడితో సంఘ్ పరివార్‌లో సైతం ప్రభావ శక్తుల నాయకత్వ ధోరణులలో ఒక స్పష్టమైన మార్పు వచ్చింది. తన వంద సంవత్సరాల మనుగడలో ఆరెస్సెస్, సంఘ్ పరివార్ భావజాల గంగోత్రిగా ఉన్నది సంఘ్ మాటే తుది మాట. ఇది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. నరేంద్ర మోదీ జాతీయ స్థాయిలో రంగంలోకి వచ్చిన తరువాత, సంఘ్, బీజేపీల మధ్య సంబంధాలలో మార్పులు అనివార్యమయ్యాయి. అయితే బీజేపీ ఇప్పటికీ తనకు అవసరమైన మద్దతును అట్టడుగు స్థాయిలో సువ్యవస్థితంగా పాదుకుపోయిన సంఘ్ శాఖల నుంచే పొందుతున్నది. అయితే నాయకత్వ స్థాయిలో ఇప్పుడు బీజేపీకి ప్రధాన ఆలంబన ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే, సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ కాదు. భగవత్ సమానుల్లో ప్రథముడు మాత్రమే. వాజపేయి ప్రధానమంత్రిత్వ కాలం నాటికి మోదీ ప్రధానమంత్రిత్వ కాలం నాటికి మధ్య సంభవించిన మార్పు ఇది. నాడు ఇరవైకి పైగా పార్టీలు భాగస్వాములుగా ఉన్న కూటమికి నాయకత్వం వహిస్తున్న వాజపేయిని సంఘ్ ప్రతి రోజూ ఏదో ఒక అంశంపై విమర్శిస్తుండేది. మోదీ సైతం ఆరెస్సెస్ ప్రచారక్ స్థాయి నుంచి జాతీయ స్థాయి రాజకీయవేత్తగా పరిణమించిన అనితరసాధ్యుడు అనేది ఎవరూ విస్మరించరు, విస్మరించలేరు. వాజపేయి హయాంలో ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్‌గా ఉన్న కేఎస్ సుదర్శన్ బహిరంగంగానే ప్రభుత్వాన్ని విమర్శించేవారు. వాజపేయి పాలనా నిర్ణయాలు తీసుకొంటున్న తీరుతెన్నులను ఆయన ఆక్షేపించేవారు. వాజపేయిని బహిరంగంగానే విమర్శించేవారు. సుదర్శన్ వ్యవహరిస్తున్న తీరుకు వాజపేయి చిరాకుపడేవారు. సహనం కోల్పోయిన వాజపేయి ఒకసారి, 'నేను అలసిపోలేదు, పదవీ విరమణ చేయను' అని స్పష్టంగా ప్రకటించారు.

వాజపేయి పట్ల సుదర్శన్ వ్యవహరించినట్టుగా మోదీని తాను నేరుగా ఎదుర్కోలేనన్న విషయం మోహన్ భగవత్‌కు బాగా తెలుసు. ప్రస్తుత సర్ సంఘ్ చాలక్ చేయగలిగిందల్లా ఒక లక్ష్మణ రేఖ గీయడమే. తద్వారా మోదీ–షా ద్వయం నిరంకుశాధికార నాయకత్వానికి పరిమితులు ఉన్నాయని స్పష్టం చేయడం మాత్రమే. 75 ఏళ్ల వయసు వచ్చినవారు పదవుల నుంచి నిష్క్రమించాలని ప్రకటించడం ఒక ప్రారంభ ఎత్తుగడ మాత్రమే. మొదటి ఎత్తుగడే ఆట కట్టిస్తుందా? అసాధ్యమన్న విషయం భగవత్‌కు తెలుసు. 75 ఏళ్ల వయసు పైబడిన ఎల్‌కే అద్వానీ, మురళీమనోహర్ జోషీ లాంటి పార్టీ అతిరథ మహారథులను రంగం నుంచి తొలగించేందుకు మోదీ–షా నాయక ద్వయం 2015లో 'మార్గదర్శక్ మండల్' అనే భావనను ప్రవేశపెట్టడం ద్వారా ఆ ఇరువురు సీనియర్ నాయకులను పూర్తిగా విశ్రాంత జీవితంలోకి పంపించారు. అది పదేళ్ల కిందటి మాట. అయితే ప్రస్తుత దశలో 'మార్గదర్శక్' లాంటి పాత్రకు పరిమితమయ్యేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బలవంతం చేయలేమన్న యథార్థాన్ని ఆరెస్సెస్ గ్రహించింది. మోదీ అనంతర బీజేపీకి యువ నాయకత్వాన్ని సమకూర్చేందుకు మరింత సర్వ జనామోద మార్గాన్ని సృష్టించాలని సంఘ్ అభిలషిస్తోంది. 'కౌన్ బనేగా బీజేపీ ప్రెసిడెంట్' అన్న క్లిష్టమైన ప్రశ్న ఇప్పుడు అటు సంఘ్‌కు ఇటు బీజేపీకి చిరాకు కలిగిస్తోంది. ఈ ప్రశ్నకు లభించే సమాధానం– ఆధిపత్యానికి చాలా గుట్టుగా జరుగుతున్న అంతర్గత పోరులో సానుకూలతలు ఎవరికి ఉన్నాయనేది స్పష్టం చేస్తుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సమరశీల పోరాటయోధుడు

జీవితాంతం ఎర్ర జెండా పోరులో వెలుగై ప్రకాశించిన సమరశీల పోరాటయోధుడు లింగంపల్లి బిక్షపతి. ఆయన పోరాట జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం. మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట గ్రామంలో 1942లో బిక్షపతి జన్మించారు. నాలుగో తరగతి వరకు చదివినా, నాలుగు పదుల వయసులో ఎస్.ఎస్.సి. పరీక్షకు హాజరయ్యారు. రేపిడెక్స్ ఇంగ్లీష్ కోర్స్ ద్వారా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలపై పట్టు సాధించారు. 34 ఏళ్ల వరకు ఆధ్యాత్మిక భావజాలంలో కొనసాగుతూ పౌరాణిక నాటకాలు, కోలాటాలు, జడ కొప్పులు తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలను రంజింపజేశారు. మంగలి కులంలో పుట్టి క్షౌర వృత్తి, ఆయుర్వేద వైద్యం, సంగీతంతో పాటు అభ్యుదయ పద్య గీతాలు రాయడం, పాడడం చేశారు. హార్మోనియం, తబలా, డోలక్ వంటి సంగీత పరికరాలు వాయించడమే కాక ఇతరులకు వాటిని నేర్పించారు.



ఎల్లంపేట దొరల, భూస్వాముల దోపిడీ, పెత్తందారి దళారీల పీడన, వెట్టిచాకిరి చూసి చలించిపోయి తిరుగుబాటుకు దారులు వెతకడం ఆరంభించారు. ఆ ప్రయత్నంలో భాగంగా ఎర్ర జెండాకు ఆకర్షితులై 1976లో సీపీఎం పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తీసుకున్నారు. పుచ్చలపల్లి సుందరయ్య, భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి, ఓంకార్ మార్గదర్శకత్వంలో ఎల్లంపేట పరిసర ప్రాంతాలలో కమ్యూనిస్టు (మార్క్సిస్ట్) పార్టీ నిర్మాణానికి పూనుకున్నారు. భూస్వాముల, దొరల గడీలకు వ్యతిరేకంగా 50 మంది సభ్యులతో గుత్పల సంఘాన్ని ఏర్పాటు చేసి తిరుగుబాటు జెండా ఎగురవేశారు. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా అనేక రకాల ప్రజా పోరాటాలు నిర్వహించారు. 'భూస్వామి వీధి బాగోతం', 'పంజరంలో చిలుక', 'మాయ' వంటి నాటకాలను ప్రదర్శిస్తూ, ప్రజలను చైతన్యం చేశారు. వివిధ సభలలో లెనిన్ వేషధారణతో ప్రజలను ఉద్యమం వైపు ఆకర్షించారు. వ్యూహాత్మకంగా తన పోరాటానికి పదును పెడుతూ దొరల భూస్వాములను హడలెత్తించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా బిక్షపతి పోరాటాన్ని ఆపలేదు. వరంగల్ సెంట్రల్ జైల్లో మూడుసార్లు జైలు జీవితం గడిపారు. ఒక సంవత్సరం పాటు అజ్ఞాతంలో ఉంటూ తన పోరాటాన్ని కొనసాగించారు.

చదువుల ద్వారానే సామాజిక మార్పు సిద్ధిస్తుందని భావించి ఎల్లంపేటలో నేతాజీ ప్రజా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి కార్యదర్శిగా కొనసాగారు. రాత్రి బడి నిర్వహిస్తూ తోటి వారికి విద్యతో పాటు పాటలు నేర్పించారు. ఎల్లంపేట హైస్కూల్ ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. మద్యపానం, ధూమపానం వంటి సాంఘిక దురాచారాలను మాన్పించడానికి ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుర్వేద వైద్య వృత్తితో అనేక మంది ప్రాణాలను కాపాడుతూ మంచి డాక్టర్‌గా కీర్తి గడించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక మార్పు కోసం నిరంతరం పనిచేస్తూ, తన 82వ ఏట జూన్ 29న మరణించారు.

సమాజ మార్పు కోసం నిరంతరం పోరాటాలు చేస్తూనే తన కొడుకు దయానంద్‌ను ఉన్నత చదువులు చదివించి, ప్రజాతంత్ర ఉద్యమాల వైపు నడిపించారు. దయానంద్ జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా ఉన్నారు. వైద్య వృత్తిపై మక్కువతో తన భౌతికకాయాన్ని మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి డొనేట్ చేశారు. బిక్షపతికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. జీవితాంతం ఆచరణాత్మక పోరాటాన్ని కొనసాగించిన బిక్షపతి పోరాట స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం అర్పించే ఘన నివాళి.

○ విశ్వ జంపాల
వ్యవస్థాపకులు, విశ్వసమాజం

వ్యవస్థ దోషాన్ని విద్యార్థులపై నెడతారా?

ప్రతి సంవత్సరం ఏదో ఒక సర్వే ద్వారా– మన రాష్ట్రంలోని విద్యార్థులు తెలుగు చదవలేరని, లెక్కలు చేయలేరని, 75 శాతం మంది తొమ్మిదవ తరగతి విద్యార్థులకు శాతాలు చేయడం తెలియదని, ఆరవ తరగతి పిల్లలకు కూడికలు తీసివేతలు రావట్లేదనీ... ఇలా పత్రికల్లో ప్రధాన శీర్షికలు కనిపిస్తుంటాయి. కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన తాజా సర్వే కూడా ఇలాంటి ఫలితాలనే వెల్లడించింది. తర్వాత ఎప్పటి మాదిరిగానే పరిస్థితిని గాడిలో పెట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కేంద్ర విద్యాశాఖ ప్రకటించింది.

తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులు చదువులో రాణించడం లేదని, జాతీయ స్థాయి సగటు కంటే వెనుకబడి ఉన్నారని ఈ సర్వేలో తేలింది. మూడవ తరగతిలో ప్రైవేటు పాఠశాలకు ప్రభుత్వ పాఠశాలకు పెద్దగా తేడా లేకున్నా 6, 9 తరగతులలో ప్రైవేటు పాఠశాలలు అన్ని సబ్జెక్టులలోనూ సరాసరి 15 పాయింట్ల తేడాతో ముందున్నాయి.

అసలు ఎవరీ చదువులో వెనుకబడుతున్న పిల్లలు అన్న ప్రశ్న వేస్తే సమాధానాలు మరింత నిర్దిష్టంగా లభించవచ్చు. ఈ సర్వేలో వివిధ సామాజిక వర్గాల పిల్లల సామర్థ్యాలను ప్రత్యేకంగా క్రోడీకరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థుల అన్ని సబ్జెక్టుల సామర్థ్యాల సరాసరి కేవలం 40 పాయింట్లతో 60 శాతం మంది వెనుకబడి ఉన్నారు. ఈ పిల్లలు వెళ్ళే పాఠశాలలు ఎలా ఉన్నాయి, బోధన ఎలా ఉంది, అడవి ప్రాంతంలో గిరిజన బిడ్డలు వెళుతున్న బడులు ఎలా ఉన్నాయి, పట్టణ ప్రాంతాలలో బస్తీలలో ఉన్న బడులు ఎలా ఉన్నాయి... ఇవేవీ పరిగణించకుండా పిల్లల విద్యా సామర్థ్యాలను పరీక్షించి విద్యార్థులను దోషులుగా నిలబెట్టడం శోచనీయం.

అన్ని సర్వేలూ పిల్లలకు చదువు రావటం లేదంటూ వారినే దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయే గానీ, ఈ దుస్థితి కారణం వ్యవస్థాపరమైన లోపాలేనని ఏ ఒక్క సర్వే చెప్పడం లేదు. విద్యా హక్కు చట్టం ఆదేశించినట్లుగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా, తగినంత మంది టీచర్లను పాఠశాల స్థాయిలో అందుబాటులో ఉంచకుండా, ఉన్న టీచర్లకు తగిన బోధనా సమయాన్ని కేటాయించకుండా విద్యార్థులకు ఈ మూల్యాంకనం చేయడంలో అర్థం లేదు. ఉపాధ్యాయులు ఉన్నట్లుగానే అనిపించినా వారు మెటర్నిటీ లీవ్, మెడికల్ లీవ్, ఎడ్యుకేషన్ లీవ్‌లో ఉన్న పాఠశాలలు, వీటితో పాటు ఏకోపాధ్యాయ టీచర్లు ఉన్న పాఠశాలలు... ఇలాంటి లోటుపాట్లను వెలికితీయడానికి సర్వేలు నిర్వహించాలి. సెలవులలో వెళ్ళిన టీచర్ల స్థానంలో మరో టీచర్‌ను నియమించే విధానమే లేని వ్యవస్థ మనది. చాలాసార్లు సబ్జెక్ట్ టీచర్లు లేకుండానే విద్యా సంవత్సరాలు గడిచిపోతుంటాయి.

అన్ని సర్వేలూ పిల్లలకు చదువు రావటం లేదంటూ వారినే దోషులుగా నిలబెట్టే ప్రయత్నాలు చేస్తున్నాయే గానీ, ఈ దుస్థితికి కారణం వ్యవస్థాపరమైన లోపాలేనని ఏ ఒక్క సర్వే చెప్పడం లేదు. విద్యా హక్కు చట్టం ఆదేశించినట్లుగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించకుండా, తగినంతమంది టీచర్లను పాఠశాల స్థాయిలో అందుబాటులో ఉంచకుండా, ఉన్న టీచర్లకు తగిన బోధనా సమయాన్ని కేటాయించకుండా విద్యార్థులకు ఈ మూల్యాంకనం చేయడంలో అర్థం లేదు.




రాష్ట్రంలో 5985 ఏకోపాధ్యాయ పాఠశాలలలో దాదాపు 88,429 మంది విద్యార్థులు నమోదు అయినట్లు గణాంకాలు ద్వారా తెలుస్తున్నది. ఏకోపాధ్యాయ పాఠశాలలు అంటే విద్య లేదనే అర్థం చేసుకోవాలి. ఆ ఒక్క టీచరు ఉన్నా లేనట్లే అన్నది అందరికీ తెలిసిన విషయమే. అలాగే రాష్ట్రంలో 70 శాతం స్కూల్స్ (12,760) మూడు కంటే తక్కువ గదులతో ఉన్నాయి. అంటే రెండు మూడు తరగతుల విద్యార్థులను కలిపి కూర్చో పెడుతున్నారు. ఒకే తరగతిలో ఒకే క్లాస్ పిల్లలు కూర్చుంటేనే బోధన చేయడం అంతంత మాత్రం. అలాంటిది ఈ మిశ్రమ తరగతి గదులలో బోధన ఇంకెంత గొప్పగా ఉంటుందో ఊహించటం కష్టం కాదు! విద్యార్థులకు నిర్వహించే మూల్యాంకనం మీద ఈ పరిస్థితి ప్రభావం పడనే పడుతుంది. 25 శాతం స్కూళ్లలో మూత్రశాలలు లేవని నివేదికలు చెపుతున్నాయి. ప్రతి రోజు మీడియా ద్వారా కూడా తెలుస్తూనే ఉంది. ఇలాంటి పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులకు మూల్యాంకనం నిర్వహించి, వీరి సామర్థ్యాలు తక్కువగా ఉన్నాయని వెల్లడించడం హాస్యాస్పదమే. అలాగే ఈ పాఠశాలలన్నీ వెనుకబడిన వర్గాల కుటుంబాలు నివసించే ప్రాంతాలే నన్నది ఇక్కడ గమనార్హం.

పిల్లలందరికీ నాణ్యమైన విద్యా సామర్థ్యాలు అందించడం సమానత్వానికి, సమన్యాయానికి సంబంధించిన విషయం. అందరికీ సమానమైన విద్యను అందించాలనే రాజ్యాంగ మూల సూత్రాలకు సంబంధించిన అంశం. అసమానమైన విద్యా వ్యవస్థలను నెలకొల్పి విద్యార్థులు అందరికీ ఒకే రకమైన మూల్యాంకనయం చేయడం సమన్యాయ సూత్రాలకు విరుద్ధమే!

విద్యార్థులు అందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే వారు వెనుకబాటుతనం నుంచి బయటపడి గౌరవప్రదమైన జీవనం సాగిస్తారు. ఇంత ముఖ్యమైన అంశం ఎప్పుడూ ప్రధాన రాజకీయ చర్చకు రాకపోవడం విచారకరం. రాష్ట్రంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే తరం ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అత్యధిక శాతం పౌరులు చదవడం రాయడం రాని, బడికెళ్లిన నిరక్షరాస్యులుగా, నైపుణ్యాలు లేని కార్మికులుగా మిగిలిపోతారు. ప్రతిసారీ పిల్లల మీద మూల్యాంకనం చేసి వారిని దోషులుగా నిలబట్టే కన్నా విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలు ఈ పరిస్థితికి కారణం అని గమనించి విద్యా వ్యవస్థను పటిష్ఠం చేయవలసిన చట్టబద్ధ బాధ్యత ప్రభుత్వాలకు ఉన్నది.

■ ఆర్. వెంకట్‌రెడ్డి
ఎం.వి. ఫౌండేషన్ జాతీయ కన్వీనర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.



పిల్లల డ్రైవింగ్.. పెద్ద సమస్యే!



వాహనం నడుపుతూ పట్టుబడితే అంతే.. తల్లిదండ్రులు/వాహన యజమానులపై కేసు

- ఏడాది పాటు సస్పెన్షన్‌లో ఆర్‌సీ
- వాహనం నడిపేందుకూ నో చాన్స్
- పునరుద్ధరణ అంత సులువు కాదు
- నగరంలో పెరుగుతున్న మైనర్ డ్రైవింగ్ కేసులు
- ఉల్లంఘనలపై రవాణా, పోలీస్ శాఖల స్పెషల్ డ్రైవ్

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మీ పిల్లలకు (మైనర్లు) వాహనాలు ఇస్తున్నారా? అయితే మీకు తిప్పలు తప్పవు. వాళ్లు పట్టుబడితే వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ) ఏడాదిపాటు సస్పెన్షన్‌లో ఉండడమే కాదు, ఆ సమయంలో వాహన వినియోగానికి కూడా అవకాశముండదు. ఏమౌతుందిలే అని వాహనంతో రోడ్డెక్కితే జరిమానా, కేసుల నమోదుతోపాటు వాహనమూ సీజ్ చేసే అవకాశముంది.

1760లో 90% నగరంలోనే..

మహానగరంలో మైనర్ డ్రైవింగ్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ కేసుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 1760 ఆర్‌సీలు సస్పెండ్ చేయగా, అందులో హైదరాబాద్ జిల్లా పరిధిలోనే 1558 ఉన్నాయి. అంటే 90శాతం ఆర్‌సీలు ఇక్కడే సస్పెండ్ అయ్యాయి. అలాగే రంగారెడ్డిలో 53, మేడ్చల్‌లో 40 ఆర్‌సీలూ సస్పెండ్ చేశారు. మోటారు వెహికిల్ చట్టం 1988లోని సెక్షన్

మిగతా 6వ పేజీలో..

మైనర్ డ్రైవింగ్ కేసుల్లో ఇలా..

రవాణా శాఖ కార్యాలయం	రద్దు చేసిన ఆర్‌సీలు
ఖైరతాబాద్ (సెంట్రల్‌జోన్)	461
మలక్‌పేట (ఈస్ట్ జోన్)	212
సికింద్రాబాద్ (నార్త్‌జోన్)	330
బండ్లగూడ (సౌత్ జోన్)	255
టోలిచౌకి (వెస్ట్ జోన్)	300
మొత్తం	1558
రంగారెడ్డి జిల్లా	53
మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా	40

సచివాలయం వద్ద కళాకారుల సందడి



బోనం.. సంబురం

ఎర్రగడ్డలో బోనంతో మహిళ

నగరంలో బోనాల జాతర వైభవంగా సాగుతోంది. గోల్కొండ, కూకట్‌పల్లి, మూసాపేట తదితర ప్రాంతాల్లో గురువారం ఘనంగా జరిగింది. గ్రామ దేవతలకు ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తమ మొక్కులను చెల్లించుకున్నారు. అలాగే తెలంగాణ సచివాలయంలో తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం, నల్ల పోచమ్మ దేవస్థానం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ధూంధాంగా సాగాయి. మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



మూసాపేటలో బోనంతో మహిళలు



బీటెక్, ఎంఎస్.. ఐదేళ్లలోనే పూర్తి

- స్థానికంగా మూడున్నరేళ్లు, స్వీడన్‌లో ఏడాదిన్నర
- జేఎన్‌టీయూ, స్వీడన్ అవగాహన ఒప్పందం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు నేడు తుదిగడువు
- 23న కౌన్సెలింగ్

6

ఆగిన మెట్రో రైలు

రాయదుర్గం – నాగోల్ కారిడార్‌లో.. సాయంత్రం వేళ చుక్కలు చూసిన ప్రయాణికులు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం సాయంత్రం మెట్రోరైలు ఆగింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కారిడార్-3లోని నాగోల్-రాయదుర్గం కారిడార్‌లో సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో ఓ రైలు సాంకేతికలోపంతో ఆగిపోయింది. స్టేషన్‌లో రైలుకోసం ప్రయాణికులు ఎదురుచూడాల్సి వచ్చింది. సుమారు 15 నిమిషాలకు పైగా రైలు ప్లాట్‌ఫారంపైకి రాకపోవడంతో అసహనానికి లోనయ్యారు. ఎల్‌అండ్‌టీ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా సాయంత్రం వర్షం కురిసిన సమయంలో కొండాపూర్, గచ్చిబౌలి ప్రాంతంలో ఉద్యోగాలు చేసే వారు మెట్రోద్వారా ఇళ్లకు వెళ్లేందుకు రాయదుర్గం స్టేషన్‌కు అధిక సంఖ్యలో వచ్చారు.



సికింద్రాబాద్‌లోని ఓ కాలనీలో నిలిచిన వర్షం నీరు



కూకట్‌పల్లిలో భారీ ట్రాఫిక్ జాం



భారీ వర్షం

- ఉప్పల్‌లో 8.5 సెంటిమీటర్లు నమోదు
- పలు ప్రాంతాల్లో నీటమునిగిన రహదారులు
- హైడ్రా, జీహెచ్ఎంసీ సహాయక చర్యలు
- నెలన్నర తర్వాత పలకరించిన వరుణుడు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం 5 తర్వాత ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. ఉరుములు, మెరుపులు లేకుండానే భారీ వర్షం కురవడంతో రోడ్లపై వెళ్లే వాహనదారులు తడిసి ముద్దయ్యారు.

ఉప్పల్‌లో 8.5 సెం.మీ నమోదు


సికింద్రాబాద్, ఉప్పల్, నాచారం, అల్వాల్, మచ్చబొల్లారం, శేరిలింగంపల్లి, మియాపూర్, మూసాపేట్, మారేడ్‌పల్లి, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, గండిమైసమ్మ, ముషీరాబాద్, కూకట్‌పల్లి, ప్రగతినగర్, వివేకానందనగర్,

మిగతా 6వ పేజీలో..

విద్యుత్ శాఖ ఎమర్జెన్సీ నంబర్లు

హైదరాబాద్ (సెంట్రల్)	8712469862
హైదరాబాద్ (దక్షిణ)	8712470596
సికింద్రాబాద్	8712470535
బంజారాహిల్స్	8712468948
సైబర్‌సిటీ	8712469534
రాజేంద్రనగర్	8712470075
సరూర్‌నగర్	8712472315
హబ్సిగూడ	8712471466
మేడ్చల్	8712472559

కరెంటుతో జాగ్రత్త.. 6



మంటలను ఆర్పుతున్న రోబో

పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం

- బూడిదైన పేపర్‌ప్లేట్ పరిశ్రమ
- రూ.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం
- మంటలను ఆర్పేందుకు రోబో టెక్నాలజీ

కూకట్‌పల్లి/బేగంపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): బాలానగర్ పారిశ్రామిక వాడలో ఉన్న పేపర్ ప్లేట్ (డ్యూరేన్) కంపెనీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రూ.50 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. డీఎఫ్‌వో శ్రీదాస్, ఏడీఎఫ్‌వో ప్రసాద్, సనత్‌నగర్ ఫైర్ ఆఫీసర్ పూర్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్ డివిజన్ పరిధి సనతానగర్‌లో ఉన్న పేపర్‌ప్లేట్ కంపెనీలో గురువారం ఉదయం 3.30 గంటలకు మంటలు ఎగసిపడడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. అదే కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు పక్కనే ఉన్న మరో భవనంలో ఉంటున్నారు. వారు వెంటనే యజమానికి సమాచారం అందించారు. యజమాని ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. కుత్బుల్లాపూర్, జీడిమెట్ల, కూకట్‌పల్లి, సనత్‌నగర్, మాదాపూర్, సికింద్రాబాద్ ఏరియాలో ఉన్న 8 ఫైర్ ఇంజన్లతో సిబ్బంది 10 నిమిషాల్లోనే అక్కడకు చేరుకున్నారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు

మిగతా 6వ పేజీలో..

ఆర్టీసీ ప్రయాణం అసౌకర్యమే!

ఓ అధ్యయనంలో 52% మంది మహిళల వెల్లడి.. బస్టాండ్లలో మెరుగైన మూత్రశాలలు ఏర్పాటు చేయాలి

- మహిళల కోసమే ప్రత్యేకంగా బస్సులు నడపాలి
- బస్సుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- అధ్యయనం వివరాలు వెల్లడించిన విద్యార్థులు



అధ్యయనం చేసిన విద్యార్థులు, ప్రొఫెసర్లు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆర్‌టీసీ ప్రయాణం అసౌకర్యంగా ఉందని 52% మంది మహిళలు ఓ అధ్యయనంలో వెల్లడించారు. పీక్ హవర్స్‌లో రద్దీ ఎక్కువగా ఉండటం, క్యూఆర్ కోడ్‌తో ఫిర్యాదులు చేసే అవకాశం లేకపోవడం అందుకు కారణాలుగా పేర్కొన్నారు. ఆర్టీసీలో ప్రయాణంపై తాము అధ్యయనం చేసిన వివరాలను ఈథేమ్స్ విద్యార్థులు గురువారం వెల్లడించారు. హైదరాబాద్‌లో 43 రోజుల పాటు పలు మార్గాల్లో 480 మంది మహిళల నుంచి పలు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టారు. వారి అభిప్రాయాలను క్రోడీకరించి తమ అధ్యయన ఫలితాలను పంజాగుట్టలోని సంస్థ ఆవరణలో ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. బృంద సభ్యులు దివ్య, మిషిక, దృష్టి, అలీ సయాం వెల్లడించిన అధ్యయనం వివరాలు ఇలా ఉన్నాయి. ఉచిత బస్సులు నడపటం మంచిదే అయినా, మహిళలు తగిన గౌరవాన్ని కోరుకుంటున్నారు. మౌలిక సదుపాయాలను పెంచాల్సిన ఆవశ్యకత కూడా ఉందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో విద్య, ఉద్యోగం, ఆరోగ్య రంగాల్లో పనిచేసే మహిళలు స్వతంత్రంగా రవాణా సదుపాయాన్ని పొందుతున్నారు.

ఆర్టీసీకి కొన్ని సూచనలు

ఈథేమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నాగలక్ష్మి కుందేటి,

మిగతా 6వ పేజీలో..

25 నుంచి సారథి సేవలు?

- ఖైరతాబాద్ కార్యాలయంలో ప్రారంభం
- ఇప్పటికే తిరుమలగిరిలో అందుబాటులోకి

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సారథి సేవలు విస్తరించేందుకు రవాణా శాఖ రంగం సిద్ధం చేస్తోంది. సికింద్రాబాద్ తిరుమలగిరి రవాణా శాఖ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన సేవలు సత్ఫలితాలను ఇస్తుండడంతో ఇతర ఆఫీసుల్లోనూ ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో వచ్చే వారం ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నెల 25న ప్రారంభించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు ఓ అధికారి తెలిపారు. ఈ సేవలు అందుబాటులోకి వస్తే స్లాట్ బుక్ చేసుకొని కూర్చున్న చోటు నుంచే ఆన్‌లైన్‌లో లెర్నర్స్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్‌ఎల్‌ఆర్) టెస్ట్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. డ్రైవింగ్ లైసెన్స్‌లో చిరునామా మార్పు, పునరుద్ధరణ, ఇతరత్రా సేవలూ సులువుగా పొందే అవకాశముంటుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు చెందిన పరివాహన్ సేవా పోర్టల్‌తో రాష్ట్ర రవాణా శాఖ వివరాలు అనుసంధానం చేస్తున్నారు. విడతల వారీగా నగరంలోని అన్ని ఆర్‌టీఏ కార్యాలయాల్లో సారథి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు.





ఏటీఎం చోరీ కేసులో

ముగ్గురి అరెస్టు

- రూ. 17 లక్షల నగదు, రూ. 3లక్షల సొత్తు స్వాధీనం
- హర్యానాలో నాలుగు రోజుల పాటు వేట
- ప్రధాన సూత్రధారి యాసిర్ 30 కేసుల్లో నిందితుడు

6

ఉరేసుకొని బిల్డర్ ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణమని సూసైడ్ నోట్



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

ఆకట్టుకున్న మాక్ డ్రిల్



హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు స్పందించాల్సిన విధానాలపై గురువారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఈ కార్యక్రమం చేపట్టారు. మాదాపూర్ అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారుల బృందం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో మంటలను ఆర్పే విధానాన్ని కళ్లకు కట్టినట్లు చూపించింది. డ్రిల్‌ను మాదాపూర్ ఫైర్ స్టేషన్ అధికారి ఆంజనేయులు దొడ్ల పర్యవేక్షించారు. రకరకాల నివారణ పరికరాలతో మంటలను ఆర్పి అబ్బురపరిచారు. ఇక అధునాతనమైన బ్రొంటో స్కై లిఫ్ట్.. ఉపయోగించి 5-6 అంతస్తులకు పైబడి ఉన్న భవనాల్లో చిక్కుకున్న వారిని రక్షించేది ప్రత్యక్షంగా చూపించడం ఆకట్టుకుంది. ఇటువంటి కసరత్తులు విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచుతాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. జాయింట్ సీపీ (ట్రాఫిక్) డాక్టర్ గజారావు భూపాల్‌లతో పాటు ట్రాఫిక్, సైబర్ క్రైం, షీ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్, ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లకు చెందిన అధికారులు, సిబ్బంది ఫైర్ మాక్ డ్రిల్‌లో పాల్గొ

ఓయూకు ప్రతిష్ఠాత్మక ఏసీఈ అవార్డు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ సర్క్యులర్ ఎకానమీ (ఐసీఈఎఫ్) ద్వారా ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మక ఏసీఈ అవార్డు-2025కు ఎంపికైంది. ఉన్నత విద్యలో సర్క్యులర్ ఎకానమీ సూత్రాలను పొందుపరచడంలో, స్థిరమైన భవిష్యత్ కోసం విద్యార్థులను సిద్ధం చేయడంలో, పాఠ్యాంశాల రూపకల్పన, ఇంటర్ డిసిప్లీనరీ పరిశోధన, సమగ్ర వృత్తాకార జ్ఞానవ్యాప్తిలో ఓయూ ఆలోచించే విధానాన్ని ఐసీఈఎఫ్ ప్రశంసించింది. ఏసీఈ అవార్డు 2025ను అందుకోవడం చాలా గౌరవంగా ఉందని ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగురం అన్నారు. ఈ అవార్డు వేడుక జూలై 31న గురుగ్రాంలోని హోటల్ రాడిసన్‌లో జరగనుంది.





ఇంకుడుగుంతలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంటికో ఇంకుడు గుంత!

90 రోజుల స్పెషల్ డ్రైవ్

- ఇప్పటికే 12 వేల నిర్మాణం పూర్తి
- మరో 16వేల మందికి నోటీసులు
- 300చ.గజాలు దాటితే ఇంకుడు గుంత ఉండాల్సిందే: ఎండీ

హైదరాబాద్ సిటీ, జూలై16 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచేందుకు వాటర్‌బోర్డు సన్నద్ధమైంది. మహా నగరంతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో ఇంటికో ఇంకుడు గుంత నిర్మించుకునేలా అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతోంది. 300 చ.గజాలపైన గల ప్రతీ ప్రాంగణంలో ఇంకుడు గుంత నిర్మించుకునేలా స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైంది. ఔటర్ పరిధిలో మహానగరం 2వేల చదరపు కిలోమీటర్లు ఉండగా, ఇందులో కనీసం ఐదుశాతం కూడా ఇంకుడు గుంతలు లేవని ది రెయిన్ వాటర్ ప్రాజెక్టు ప్రతినిధులు వాపోతున్నారు. వాల్టా చట్టం ప్రకారం భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ అనుమతులు ఇచ్చే సందర్భంలోనే ఇంకుడు గుంత నిర్మించాలని

మిగతా 6వ పేజీలో..

వేర్వేరు ప్రాంతాలకు 16 వీక్లీ ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి 16 ప్రత్యేక వీక్లీ రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి ఆగస్టు 15 వరకు (ప్రతి శుక్రవారం) ఎర్నాకుళం-పాట్నా(06085) మార్గంలో నాలుగు రైళ్లు, ఈనెల 28నుంచి ఆగస్టు 18 వరకు(ప్రతి సోమవారం) పాట్నా-ఎర్నాకుళం (06086) మధ్యలో నాలుగు రైళ్లు నడుస్తాయని తెలిపారు. ఆగస్టు 3 నుంచి 24వరకు (ప్రతి ఆదివారం) తిరుపతి - చర్లపల్లి (07481) మార్గంలో నాలుగు రైళ్లు, ఆగస్టు 4నుంచి 25వరకు (ప్రతి సోమవారం) చర్లపల్లి - తిరుపతి (07482) మార్గంలో నడుస్తాయని పేర్కొన్నారు.

రైల్వే మ్యానుఫాక్చరింగ్ యూనిట్ పనులను పరిశీలించిన జీఎం

కాజీపేటలో నూతనంగా చేపట్టిన రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులను దక్షిణమధ్య రైల్వే జనరల్‌మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ గురువారం పరిశీలించారు. పనుల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ నుండి కాజీపేట సెక్షన్ వరకు సంజయ్ కుమార్ రైల్వే డివిజన్ మేనేజర్ భరతేష్‌కుమార్ జైన్‌తో కలిసి రియర్ విండో తనిఖీలు నిర్వహించారు.

తుపాకుల సరఫరా ఆరోపణలున్న వ్యక్తికి ముందస్తు బెయిల్

గచ్చిబౌలి ప్రిజం పబ్ కాల్పుల కేసులో అరెస్టయిన బత్తుల ప్రభాకర్‌కు తుపాకులు సరఫరా చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బిహార్‌కు చెందిన రామేంద్ర కుమార్ రవికి హైకోర్టు ముందుస్తు బెయిల్ మంజూరు చేసింది. ప్రభాకర్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌మేరకు రవిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు అరెస్టు చేసే అవకాశం ఉండటంతో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ నిందితుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు, వ్యాపార సముదాయాలను గురువారం షేక్‌పేట రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 14లోని నందినగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమంగా షెడ్ల నిర్మాణాలు చేశారు. వ్యాపార సముదాయాలుగా మార్చి అద్దె కూడా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. షాపులు తొలగించాలని గతంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తూ పాక్షికంగా వాటిని కూల్చారు. అయినా కబ్జాదారులు షాపులను యథావిధిగా నిర్వహిస్తుండటంతో గురువారం రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతానికి వచ్చి బుల్‌డోజర్‌తో కూల్చివేతలు చేపట్టారు. శిథిలాలను సైతం తొలగించారు.


బుల్ డోజర్‌లతో కూల్చివేతలు నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

నాలా వెడల్పునకు అడ్డంకులను తొలగించాలి

బంజారాహిల్స్ నాలా వెడల్పునకు ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. గురువారం ఆయన బంజారాహిల్స్ నాలాను పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదుతో రోడ్డు నంబరు 3, 14లలో తలెత్తుతున్న వరద సమస్యకు గల కారణాలను క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నారు. కేబీఆర్ పార్కు, నందినగర్ మీదుగా బంజారాహిల్స్ నుంచి జలగం వెంగళరావు పార్కులోని చెరువులోకి చేరే వరద కాలువను పరిశీలించారు. 4 మీటర్ల వెడల్పుతో ఉన్న బాక్సు డ్రైన్ రోడ్డు నంబరు 3కి వచ్చేసరికి 2 మీటర్ల వెడల్పునకు పరిమితమైందని ఆయన గుర్తించారు. అలాగే మీటరు వెడల్పు ఉన్న పైపులైను ఏర్పాటు చేయడంతో వరద పోటెత్తే పరిస్థితి ఏర్పడుతోందని అధికారులు చెప్పారు. బఫర్ లేకుండా చేయడమే కాకుండా నాలాను కూడా ఆక్రమించడంపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పైనుంచి చివరి వరకూ వరద ప్రవాహానికి ఆటంకాలు లేకుండా అడ్డంకులను తొలగించాలని అధికారులను ఆదేశించారు.


బంజారాహిల్స్‌లో నాలాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

సింగరేణి పీఆర్ఓ శ్రీకాంత్‌కు జర్నలిజంలో డాక్టరేట్

హైదరాబాద్‌సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి హైదరాబాద్ కార్యాలయంలో ప్రజాసంబంధాల అధికారి (పీఆర్‌ఓ)గా పనిచేస్తున్న శ్రీరాముల శ్రీకాంత్ జర్నలిజంలో డాక్టరేట్ పొందారు. ఈ మేరకు బుధవారం నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన రెండో స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ స్వీకరించారు. జర్నలిజంలో పీహెచ్‌డీ సాధించిన శ్రీకాంత్‌ను సింగరేణి ఎండీ ఎన్. బలరాం అభినందించారు. అలాగే ఈడీ(కోల్ మూమెంట్) ఎస్‌డీఎం సుభానీ, జీఎం(మార్కెటింగ్) శ్రీనివాస్, సింగరేణిభవన్ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



ముక్తేవి భారతికి విద్వత్ సమర్చన పురస్కారం

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి ముక్తేవి భారతికి ఆచార్య శలాక రఘునాథశర్మ దంపతుల విద్వత్ సమర్చన పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం శలాక లలిత ప్రశంసాపత్రం సమర్పించారు. సికింద్రాబాద్‌లోని రచయిత్రి గృహంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ రచయితగా, అధ్యాపకులుగా, సాహిత్య పరిశోధకులుగా ముక్తేవి భారతి తెలుగు భాషా సాహిత్యాలకు ఎంతో సేవ చేశారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ భాషాసాహిత్యవేత్త ఆచార్య ఏల్చూరి మురళీధరరావు, రాష్ట్ర ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి, ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


పురస్కారం అందుకుంటున్న భారతి

కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షను విజయవంతం చేయాలి

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 13 సెంటర్లలో ఈనెల 20న జరుగనున్న యూపీఎస్సీ కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పరీక్షను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పరీక్షల నిర్వహణపై ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ.. పరీక్ష మొదటి సెషన్ ఉదయం 9:30 నుంచి 11.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి కంటే 30 నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలని, ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతి ఉండదని తెలిపారు.

పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

మాదాపూర్ అగ్నిమాపక దళ సిబ్బంది రోబోలను ఉపయోగించారు. పేపర్‌ప్లేట్ కంపెనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.50లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అధికారులకు యజమాని తెలిపారు. ప్రమాదం సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని సనత్‌నగర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

ఆయిల్‌పామ్ ఉత్పత్తి పెంపుపై ప్రభుత్వం దృష్టి

బోరబండ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఆయిల్ పామ్ ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని రాష్ట్ర ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ వి.సరోజినిదేవి తెలిపారు. 'తెలంగాణలో సస్టయినబుల్ పామాయిల్‌పై భాగస్వామ్య సంభాషణ' అంశంపై సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ (సీఆర్‌బీ)తో కలిసి యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మే ఆవరణలో గురువారం వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు, ఉత్పత్తిలో పెరుగుదల నమోదైందని చెప్పారు. అయితే తెలంగాణలో ఆధునికీకరణ, వైవిధ్యీకరణ ప్రధాన సమస్య అని అన్నారు. ప్రభుత్వం వరికి ఇచ్చినట్టుగా ఆయిల్ పామ్‌కు కూడా కనీస మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ రంగంపై ఆమె పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ డా. అశుతోష్ ముర్కుటే మాట్లాడుతూ పామాయిల్ ఉత్పత్తి ధరల నియంత్రణకు ఒక యంత్రాంగాన్ని సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమానికి నిమ్స్‌మే స్కూల్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డా. సూర్య ప్రకాష్‌గౌడ్ అధ్యక్షత వహించగా సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ బిజినెస్ (సీఆర్‌బీ) సీఈఓ రజిత్‌సేన్ గుప్తా, రౌండ్‌టేబుల్ ఆన్ సస్టయినబుల్ పామ్‌ఆయిల్ మార్కెట్ ట్రాన్స్‌ఫర్మేషన్ డిప్యూటీ డైరెక్టర్ అశ్విన్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

ఖైదీల ఎస్కార్టుకు సమన్వయం తప్పనిసరి

- ఏడీజీ మహేష్ భగవత్

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కోర్టు విచారణకు ఖైదీల తరలింపు, వారికి భద్రతగా ఉండే ఎస్కార్టు సిబ్బంది విధులకు సంబంధించి అన్ని విభాగాల మధ్య సమన్వయం అవసరమని అదనపు డీజీపీ మహేష్ భగవత్ అన్నారు. ఎస్కార్ట్‌లకు సంబంధించిన నిరంతర సమాచారం కోసం అన్ని విభాగాలు, అధికారులు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఖైదీల ఎస్కార్ట్ వ్యవస్థపై ఉన్నత స్థాయి కమిటీ సమావేశం డీజీపీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏడీజీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని, ఎస్కార్ట్ అభ్యర్థనల కోసం రేడియో సందేశాలను కనీసం వారం ముందుగా పంపాలని సూచించారు. ఆయా విభాగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడానికి, లా అండ్ ఆర్డర్, సీఏఆర్, జైళ్లు, కోర్టు లైజాన్, ఇతర సంబంధిత యూనిట్ అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ రక్షిత కె.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ సుందరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం, కవ్వంపల్లి గ్రామానికి చెందిన పూసల నాగరాజు, జ్యోతి(35)కి 2018లో వివాహం జరిగింది. మూడేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి దూలపల్లిలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై అనుమానంతో ఉన్న నాగరాజు.. కట్నం కింద డబ్బు తీసుకురావాలని భార్యను వేధిస్తున్నాడు. బుధవారం సాయంత్రం నాగరాజు పిల్లలను తీసుకు రావడానికి స్కూల్‌కు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో జ్యోతి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుందరయ్య తెలిపారు.

వర్షాకాలం కరెంటుతో జాగ్రత్త

హైదరాబాద్ సిటీ, జూలై17 (ఆంధ్రజ్యోతి): వర్షాలు పడే సమయంలో ప్రజలు, వినియోగదారులు విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. వర్షాల నేపథ్యంలో ఆయన మంగళవారం చీఫ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్లతో ఆడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ సరఫరా పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో వెంటిలేటర్లు, కిటికీల ద్వారా వర్షపు నీళ్లు ఇండ్లలోకి చేరి స్విచ్ బోర్డులోకి, ప్యానెల్‌లోకి చేరే అవకాశముంటుందని, ఇది ప్రమాదకరమని అన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఉన్నా 1912 లేదా స్థానిక ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీస్‌తో పాటు సర్కిల్/ జిల్లాల కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, రామంతాపూర్, హబ్సిగూడ, ఖైరతాబాద్, లక్డీకపూల్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా ఉప్పల్‌లో 8.5 సెంటీమీటర్లు, నాచారంలో 7.8, న్యూ మెట్టుగూడలో 6.8, మియాపూర్‌లో 5.8, హబ్సిగూడలో 5.7 సెం.మీ. నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు నిలిచిపోయింది. దీంతో హైడ్రా మాన్‌సూన్ ఎమర్జెన్సీ, డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి.

ఆర్టీసీ ప్రయాణం అసౌకర్యమే!

(5వ పేజీ తరువాయి)

సహేరా ఫాతిమా మార్గనిర్దేశకత్వంలో తాము ఈ అధ్యయనం చేశామన్న విద్యార్థులు మహిళల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఆర్టీసీకి పలు సూచనలు చేశారు. మహిళలతో ఎలా నడుచుకోవాలో సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలి. క్యూఆర్ కోడ్ ఆధారిత ఫిర్యాదుల వ్యవస్థను అందుబాటులోకి తేవాలి. కీలక బస్టాపుల్లో మూత్రశాలలు ఏర్పాటు చేయాలి. విద్యుత్ వెలుగులు అధికంగా ఉండేలా చూడాలి. రద్దీ వేళల్లో మహిళల కోసం ప్రత్యేక బస్సులను నడపాలి. బస్సుల్లో సీసీటీవీలను ఏర్పాటు చేయాలి. మఫ్టీలో పోలీసులు బస్సులలో తిరగాల్సి అవసరం ఉంది. ఈ నివేదికను ఎండీ సజ్జనార్‌కు అందజేసినట్లు విద్యార్థులు వివరించారు.

అక్కడలా...

ఫ్రాన్స్‌లో తమ ఇళ్లకు దగ్గరలో ఆపేలా ఆన్ డిమాండ్ నైట్ స్టాప్స్‌ను మహిళలు అభ్యర్థించే అవకాశం ఉందని, అలాగే బ్రెజిల్‌లో రవాణా పోలీస్‌కు నేరుగా ఫిర్యాదు చేసేలా యాప్‌లు లింక్ అయి ఉంటాయని, జపాన్, కొలంబియాలలో మహిళల కోసమే రద్దీ వేళల్లో బస్సులు ఉంటాయని విద్యార్థులు వివరించారు.

ఇంటికో ఇంకుడు గుంత!

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి రాష్ట్రంలోని జీఓ 168 భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల నిబంధనలు చెబుతున్నాయి. ప్లానింగ్‌మ్యాప్‌లో కూడా ఇంకుడు గుంతను చూపించాల్సి ఉంటుంది. అనుమతులు తీసుకొని భవన నిర్మాణం పూర్తయ్యాక అక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసే క్రమంలోనే ఇంకుడు గుంత నిర్మాణం చేశారా? లేదా? అధికారులు పరిశీలించాలి. కానీ ఈ అంశాన్ని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పట్టించుకోకుండా గాలి కొదిలేశారు. ఇక 300 చ.గ. విస్తీర్ణం దాటిన భవనాలకు కూడా ఇంకుడు గుంతలు పరిశీలించకుండానే క్షేత్రస్థాయిలో కొందరూ అధికారులు నల్లా కనెక్షన్ల మంజూరు చేస్తుండడం గమనార్హం.

ట్యాంకర్ల డిమాండ్‌కు చెక్ పెట్టేందుకు

బోరుబావులు వట్టిపోవడంతో వాటర్‌బోర్డు ట్యాంకర్ల మీద ఆధారపడిన వారు 42 వేల నివాసాలను ఉన్నట్లు అధికారులు గుర్తించి, అందులో సగానికి పైగా ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు లేవని, మిగతావారు సరైన స్థితిలో వాటి నిర్వహణ చేయడం లేదని సర్వేలో తేల్చారు. వాటి నిర్వహణ కోసం ఎన్జీఓల సహాయంతో ఇప్పటికే 12 వేల ఇంకుడు గుంతల నిర్మాణం, పునర్నిర్మాణం(మెంటనేన్స్) చేశారు. మరో 16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మాణం కోసం నోటీసులు జారీ చేయడానికి చర్యలు చేపడుతున్నారు.

త్వరలో స్పెషల్ డ్రైవ్

ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 200 గజాల ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించాలని.. అలాగే, 300 గజాల పైన ప్రతీ నివాసంలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించుకునేలా అవగాహన కల్పించడానికి త్వరలో 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌ను వాటర్‌బోర్డు ప్రారంభించనుంది. నల్లా కనెక్షన్ ఇచ్చే సందర్భంలో ఇంకుడు గుంత ఉంటేనే నల్లా కనెక్షన్ మంజూరు చేసేవిధంగా చర్యలు చేపట్టనున్నారు.

ఇదే సరైన సమయం

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో రానున్న మూడు నెలలు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నాం. ఇంకుడు గుంతలు నిర్మాణం చేసుకోడానికి ఈ వర్షాకాలమే సరైన సమయం. ఇప్పుడు నిర్మిస్తే ప్రతీ వర్షపు నీటి చుక్కా భూగర్భంలో ఇంకుతుంది. దీంతో భూగర్భ జలాలు పడిపోవడం, ట్యాంకర్ నీళ్లపై ఆధారపడే పరిస్థితులు భవిష్యత్తులో తలెత్తవు.

- అశోక్‌రెడ్డి, ఎండీ, వాటర్‌బోర్డు

పిల్లల డ్రైవింగ్.. పెద్ద సమస్యే!

(5వ పేజీ తరువాయి)

199ఏ ప్రకారం ఆర్‌సీలు రద్దు చేస్తున్నట్టు ఓ అధికారి తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరంగా పరిగణిస్తోన్న నేపథ్యంలో బాధ్యులైన తల్లిదండ్రులు/వాహన యజమానులపై కేసు నమోదు చేయడంతో పాటు కోర్టుకు పంపాలని పోలీసులు భావిస్తున్నారు.

డీఎల్ సస్పెన్షన్

ట్రాఫిక్ ఉల్లంఘనలు పునరావృతమైతే పోలీసులు చట్ట ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్(డీఎల్)లను సస్పెండ్ చేస్తున్నారు. కోర్టు ఆదేశాలు, ట్రాఫిక్ పోలీసుల సిఫారసుల ఆధారంగా వారం గడువుతో సంబంధిత వ్యక్తులకు షోకాజ్ నోటీసులిస్తోన్న ఆర్‌టీఏ.. వివరణ సహేతుకంగా లేకున్నా.. సమాధానం ఇవ్వకున్నా లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతోంది. 2024-25లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 7,888 డీఎల్‌లు సస్పెండ్ చేయగా.. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 1,190లు డీఎల్ సస్పెండ్ చేశారు.

ఆర్‌సీ సస్పెండ్ చేస్తే..

మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే సదరు వాహనం ఆర్‌సీ యేడాదిపాటు రవాణా శాఖ రద్దు చేస్తుంది. ఆర్‌సీ సస్పెన్షన్‌లో ఉన్న సమయంలో వాహనం రోడ్లపైకి తీసుకురావడం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. బయట తిరుగుతూ వాహనం పట్టుబడితే రిజిస్ట్రేషన్ వాలిడిటీ లేనందున పోలీసులు రూ.2000 వరకు రుసుము విధించే అవకాశం ఉంటుంది. ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ కంపెనీలు వాహనాల మరమ్మతుకు ఎలాంటి చెల్లింపులూ చేయవు. ప్రమాదం లో గాయపడిన, మరణించినా పరిహారం రాదు.

కోర్ ఏరియాలో అధికం...

కొందరు తల్లిదండ్రులకు తెలిసి వాహనాలు నడుపుతుండగా, ఇంకొందరు మాత్రం ఇంట్లో వాళ్లకు తెలియకుండా రోడ్లపైకి వస్తున్నారు. ఇది ఆ పిల్లలకే కాకుండా ఇతర వాహనదారులకూ ప్రమాదకరంగా మారుతోంది. నగరంలో రహదారుల పై వాహనాలతో స్టంట్లు చేసే వారిలో ఎక్కువగా మైనర్లు కనిపిస్తుంటారు. రవాణా శాఖ ఖైరతాబాద్ కార్యాలయం పరిధిలో అత్యధికంగా 461, సికింద్రాబాద్‌లో 330 ఆర్‌సీలు సస్పెండ్ చేశారు. కోర్ ఏరియాలోనే మైనర్ డ్రైవింగ్ కేసులు ఎక్కువగా నమోదు కావడం గమనార్హం.

డీఎల్ సస్పెండ్ చేస్తే...

ఉల్లంఘనను బట్టి డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నుంచి ఆరు నెలలు రద్దు చేస్తారు. ఆ సమయంలో సదరు వ్యక్తి వాహనం నడపకూడదు. గడువు ముగిసిన అనంతరం తిరిగి డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. మరోసారి నిబంధనల ఉల్లంఘనకు పాల్పడనని అండర్ టేకింగ్ ఇవ్వాలి. సస్పెన్షన్ సమయంలో వాహనం నడిపితే.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడుపుతున్నారన్న ఉల్లంఘన కింద జరిమానా విధిస్తారు. ద్విచక్ర వాహనదారులకు రూ.1000, మూడు నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారికి రూ.2000 ఫైన్ వేస్తారు. మూడు, నాలుగు పర్యాయాలు పట్టుబడిన పక్షంలో పూర్తిగా డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకూ సిఫారసు చేసే అవకాశముంది.

వైభవంగా యాదాద్రి ఆల్ ఇండియా డాన్స్ ఫెస్టివల్



కళా ప్రదర్శనలు

రవీంద్రభారతి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఏ కళ అయినా ఆరాధనాభావం, అంకితభావం ఉంటే అది రాణిస్తుందని తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య నిత్యానందరావు అన్నారు. కళాకృతి నృత్యాలం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో రెండు రోజుల పాటు జరిగే యాదాద్రి ఆల్ ఇండియా డాన్స్ ఫెస్టివల్-2025 గురువారం ప్రారంభమైంది. వేడుకల్లో భాగంగా పలు రంగాల్లో నిష్ణాతులైన వారికి యాదాద్రి పురస్కారాలను ప్రదానం చేశారు. ఢిల్లీకి చెందిన ప్రముఖ కథక్ నాట్య గురువు రాజేంద్ర గంగానికి యాదాద్రి ఎక్సలెన్స్ పురస్కారం ప్రదానం చేశారు. దీంతో పాటు చెన్నైకి చెందిన భరతనాట్యం నర్తకి నిశ్రేయ వరలక్ష్మి, పశ్చిమ బెంగాల్ కు చెందిన పరమితి ముఖర్జీలకు యదాద్రి యువ పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా తెలుగు వర్సిటీ వీసీ నిత్యానందరావు హాజరై పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శాస్త్రీయ కళారూపాల్ని చక్కగా ప్రదర్శించారని అన్నారు. యాదాద్రి ఆల్ ఇండియా డాన్స్ ఫెస్టివల్ అద్భుతంగా నిర్వహింపబడడం సంతోషకరమన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా కళలు ప్రోత్సహింపబడుతాయని అన్నారు. శాస్త్రీయ కళలు మన సంస్కృతికి పట్టుకొమ్మలని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ వీ.ఎన్. విష్ణు, ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ మీలా యాగయ్య, నందిని మల్లు, మనకోరుల్లా, డా.బిషజిత్ చౌబే, డా.వేదాంతం రామలింగశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న నర్సోజీ

రవీంద్రభారతి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలంటే సాంకేతిక పరిజ్ఞాన్ని పెంపొందించుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు ఎం.నర్సోజీ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన నర్సోజీ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంట్లో భాగంగా గురువారం నగరంలోని పలు పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రయాన్ 3, శుభం శుక్లా రోదసి ప్రయాణం వంటి వివరాలతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలు శాస్త్రీయ సాంకేతిక రంగంలో ఆసక్తిని పెంచుకోవాలన్నారు. చంద్రయాన్ 3 ప్రయగం జరిగిన విధానం, విజయవంతమైన తీరును ప్రతి విద్యార్థి గమనించాలన్నారు. శుభం శుక్లా వంటి వారిని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడిగా శ్రీధర్



నూతన అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఏడుకొండల్, వేముల రామకృష్ణ తదితరులు

బర్కత్‌పుర, జూలై 17(ఆంధ్రజ్యోతి): జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడుగా వల్లపు శివ, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడిగా వేముల భరత్ నియమితులయ్యారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జాతీయ నాయకులు కుంచాల ఏడుకొండల్, లోకనాథం, బత్తుల లక్ష్మీకాంతయ్య, వల్లపు మొగిలి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణలు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25 నుంచి వడ్డెర సంఘాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేస్తున్నట్టు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వడ్డెరులకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని, దరఖాస్తు చేసుకున్న ప్రతి వడ్డెర విద్యార్థికి గురుకులాల్లో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఇటీవల మృతి చెందిన జాతీయ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేష్‌కు నివాళులర్పించారు.

30న హుసేని ఆలం కళాశాలలో సింపోజియం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ బాలభాస్కర్, తదితరులు

మదీన, జూలై 17(ఆంధ్రజ్యోతి): హుసేనిఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 30న రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సమకాలీన భారతదేశంలో సబాల్టర్న్ రాజకీయాలు, క్రియాశీలత సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై ఒకరోజు సింపోజియం జరగడం సంతోషకరమని వక్తలు పేర్కొన్నారు. సింపోజియానికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం కళాశాలలో ఆవిష్కరించారు. సింపోజియంలో సామాజిక న్యాయం, సమానత్వం, మానవ హక్కులపై విమర్శనాత్మక, అత్యంత మేథోపరమైన చర్చలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలేజ్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.బాలభాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియ చిన్నమ్మ, రాజనీతి శాస్త్రవిభాగం అధిపతి డాక్టర్ మహ్మద్ గౌస్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫార్మసిస్టుగా వందన



మునగపాటి వందనకు అవార్డును అందజేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర రావు, డాక్టర్ విజయ పూర్ణిమ

రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): హసన్‌నగర్ అర్బన్ ప్రైమరీ సెంటర్ ఫార్మసిస్టుగా పనిచేస్తున్న మునగపాటి వందన ఉత్తమ ఫార్మసిస్టు అవార్డును అందుకున్నారు. ప్రపంచ జనాభ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కామినేని ఆస్పత్రిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో వందనకు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఉప వైద్య శాఖాధికారిణి విజయ పూర్ణిమల చేతులమీదుగా ఈ అవార్డును బహూకరించారు.

హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

అఫ్జల్‌గంజ్, జూలై 17(ఆంధ్రజ్యోతి): హత్యకేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు పడిన సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జియాగూడ ప్రాంతానికి చెందిన సంపత్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, 2020లో ఓ హత్య కేసులో ఆయనపై నేరం మోపడం జరిగింది. ఈక్రమంలో కుల్సుంపురా పోలీసులు విచారణ జరిపి హత్యకు సంబంధించిన ఆధారాలను కోర్టుకు సమర్పించారు. ఈమేరకు నాంపల్లి కోర్టు న్యాయమూర్తి సురేష్‌కుమార్ పూర్తి స్థాయి విచారణ జరిపి నిందితుడు సంపత్‌కుమార్‌కు జీవిత ఖైదు విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించారు. ఆయనకు రూ. 5000 జరిమానా విధించారు.

బోనాలకు ఆహ్వానం



ముక్కెర బస్తీ నల్లపోచమ్మ బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌ని కలిసి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎడ్ల పండరీనాథ్ తదితరులు
- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)



ఈనెల 20, 21 తేదీలలో జరిగే భాగ్యనగర బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును కలిసి ఆహ్వానం అందజేస్తున్న ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ అధ్యక్షుడు భాస్కర్‌రాజ్, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షుడు సుమన్‌కుమార్ తదితరులు



గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భారత మాత బోనాల ఉత్సవాలకు హాజరు కావాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మని కైలాస్ గంగపుత్ర, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆనంద్‌రావు, సలహాదారు కె.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు బీవై శ్రీకాంత్ - చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)



ఉప్పుగూడ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ డాక్టర్ సౌమ్య మిశ్రాను సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్
- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)



వివిధ రకాల పుష్పాలు, గాజుల అలంకరణలో మాతేశ్వరిబేలా ముత్యాలమ్మ అమ్మవారు



సప్త మాతృకులకు సప్త బంగారు బోనంలో భాగంగా భాగ్యనగర్ మహంకాళి బోనాల జాతర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జోగిని అవికా దేవి ఊరేగింపుగా వెళ్లి లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారికి చివరి బంగారు బోనం, పట్టువస్త్రాలు సమర్పించారు.
- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)

బోనాల సంబరం

- ఘనంగా అమ్మవారి ఫలహారం బండ్లు, ఘటాలు, తొట్టెల ఊరేగింపు



గౌలిగూడ మణికంఠ హోటల్ వద్ద అమ్మవారి ఘటానికి పూజలు చేస్తున్న జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, నిర్వాహకులు



చాక్నావాడిలో అమ్మవారి ఘటం, ఫలహారం బండికి స్వాగతం పలుకుతున్న ఆర్యన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటి శైలేష్ కురుమ, తదితరులు

గోషామహల్/మంగళ్‌హాట్/అఫ్జల్‌గంజ్/హిమాయత్‌నగర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గోషామహల్, మహరాజ్‌గంజ్, ఉస్మాన్‌గంజ్ ప్రాంతాల్లోని పలు చారిత్రక అ్మవారి ఆయాల్లో బోనాల ఉత్సవాలు కనులపండువగా కొనసాగాయి. గురువారం గోషామహల్, చక్నావాడి, చందన్‌వాడీ, మహరాజ్ గంజ్, కిషన్‌గంజ్ తదితర ప్రాంతాల్లో ఆలయ నిర్వాహకులు అమ్మవారి ఘటాలు, మేకపోతులతో ఫలహార బండ్లు, తొట్టెల ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. పలు బస్తీల్లో స్వాగత వేదికలు ఏర్పాటు చేసి అమ్మవారి ఘటాలు, తొట్టెలు, ఫలహార బండ్ల పైన నిర్వాహకులు పూలవర్షం కురిపించారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య ఘటాలు, ఫలహార బండ్ల ఊరేగింపు ప్రశాంతంగా ముగిసింది.



శాకాంబరి దేవీ అలంకరణలో ఉప్పుగూడ ముక్కెర బస్తీ నల్లపోచమ్మ అమ్మవారు
- చాంద్రాయణగుట్ట, (ఆంధ్రజ్యోతి)



ఢిల్లీ మిఠాయి వాటిక ఆధ్వర్యంలో లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారికి 56 రకాల మిఠాయిలతో నైవేద్యం సమర్పించిన భక్తులు



దుర్గామాత ఆలయంలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.పాండు ముదిరాజ్, సాంబశివరామ్ తదితరులు



కిషన్‌గంజ్ నాలా వద్ద జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే టి.రాజాసింగ్, శివశక్తి సేవా మండల్ అధ్యక్షుడు రమేశ్ యాదవ్, పి.నరేందర్ యాదవ్, పి.అనిల్ యాదవ్ తదితరులు



చందన్‌వాడిలో అమ్మవారి ఘటాలకు స్వాగతం పలుకుతున్న పాండు ముదిరాజ్, టీడీపీ రాష్ట్ర నాయకులు రామ్ నారాయణ యాదవ్, కేడి దినేశ్, సాంబశివరామ్



మహరాజ్‌గంజ్‌లో అమ్మవారి ఘటాల ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న తెలంగాణ ఫిషరీస్ కార్పొరేటర్ చైర్మన్ మెట్టు సాయికుమార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్, నరేందర్ యాదవ్

గోల్కొండ కోటలో 7వ బోనం

కార్వాన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి అమ్మవారి 7వ బోనా ల ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. శివసత్తుల శివాసలు, పోతురాజుల నృత్యాలు, తొట్టెల ఊరేగింపు, భక్తులతో గోల్కొండ కిటకిటలాడింది. ఆలయ చైర్మన్ చంటిబాబు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఓ పక్క పోతరాజుల నృత్యాలు, బోనాల ఊరేగింపు లు, యువత తీన్మార్ ఆటలతో గోల్కొండ కోటలో సందడి నెలకొంది. 7వ బోనం కావడంతో భక్తులు పెద్దఎత్తున కోటకు చేరుకొని అమ్మవారిని దర్శించుకొని బోనాలు, తొట్టెలను సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు క్యూలో వచ్చేందుకు భారి కేడ్లను ఏర్పాటు చేశారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బోనాల ఉత్సవాల్లో ఈవో చిదెళ్ల వసంత, ఆలయ పూజారి సర్వేశ్, ఆకుల చంద్రశేఖర్, జి.సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు

రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయం ముందు రూ.7.5లక్షలతో వేయనున్న సీసీ రోడ్డు పనులను గురువారం రాజేంద్రనగర్ ఇంజనీరింగ్ విభాగం డీఈ రామచంద్రరాజు, ఏఈ వేణుగోపాల్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వై.శ్రీధర్, ఇ.వేణుగోపాల్‌తో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ మైలార్‌దేవుపల్లి అధ్యక్షుడిగా నిహాల్



రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మైలార్‌దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడిగా కోయిలకొండ నిహాల్ నియమితులయ్యారు. ఈ మేరకు సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆయనకు గురువారం నియామక పత్రం అందజేశారు. కోయిలకొండ నిహాల్ కొన్ని సంవత్సరాలుగా మైలార్‌దేవుపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్ సహకారంతో నిహాల్‌కు ఈ పదవి దక్కింది. ఈసందర్భంగా నిహాల్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

వేధింపులు ఆపకపోతే గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిపివేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

బర్కత్‌పుర, జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్యాస్ ఏజెన్సీలు, గ్యాస్ డీలర్ల వేధింపులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల సరఫరాను నిలిపివేస్తామని తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నకిరెకంటి శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. కుకింగ్ గ్యాస్ డెలివరీ కార్మికులను నిత్యం వేధింపులకు గురిచేస్తున్నారని కార్మిక శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 30 వేల మంది గ్యాస్ డెలివరీ వర్కర్స్ పనిచేస్తున్నారని, ఏ ఒక్క గ్యాస్ ట్రేడర్ కూడా కార్మిక శాఖ నిబంధనలు పాటించకుండా డెలివరీ వర్కర్స్‌ను వేధిస్తున్నారని, సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. గౌరవ సలహదారులు కే.వీ. గౌడ్, చామకూర రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో కార్మిక శాఖ అధికారులు పూర్తి నిద్రావస్థలో ఉన్నారని, త్వరలో డెలివరీ వర్కర్స్‌తో కలిసి కార్మికశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి బుర్ర చంద్రయ్యగౌడ్, నాయకులు నర్సింగ్‌రావు, అజయ్ రెడ్డి, శ్రీకాంత్, రాజశేఖర్, అశోక్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

19న ఉచిత జాబ్‌మేళా

బర్కత్‌పుర, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భారత సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉచిత జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి తెలిపారు. పంజాగుట్టలోని ద్వారకపూరి కాలనీలోని రాజేశ్వరి టవర్స్ మూడవ అంతస్తులో గల భారత సేవా కేంద్రం కార్యాలయంలో ఉదయం 11నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ అర్హత గల అభ్యర్థులు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు చేయడానికి ఈ జాబ్‌మేళాకు అర్హులని తెలిపారు. ఫీమేల్ టెలికాలర్లు, ఎడ్యుకేషన్ కౌన్సిలర్లు, రిషపనిస్టులు, మార్కెటింగ్ మేనేజర్స్, సెల్స్ ఎగ్జిక్యూటీవ్స్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటీవ్స్ అన్ని జిల్లా కేంద్రాలలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ పోస్టుల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను వాట్సప్ నెంబర్ 8179955744కు నేరుగా పంపించవచ్చని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన తెలిపారు.

'జలమండలిలో ఓటీ కంపెన్సేషన్ నిలుపుదల చేయలేదు'

బర్కత్‌పుర, జూలై 17(ఆంధ్రజ్యోతి): జలమండలిలో ఓటీ కంపెన్సేషన్ నిలుపుదల చేయలేదని, ఓటీ చేస్తే తప్పకుండా కంపెన్సేషన్ వస్తుందని జలమండలి కంగర్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి స్పష్టం చేశారు. బీఆర్‌టీయూ నేత రాంబాబుయాదవ్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, దీనిని మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రేటర్ పరిధిలోని శివారు మున్సిపాలిటీలలో తాగు, మురుగు శుద్ధి పనులు చేస్తున్న కిందిస్థాయి ఉద్యోగులు ఓటీ కంపెన్సేషన్ నిలుపుదల విషయంపై ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. సెలవు దినాల్లో ఓటీ చేస్తున్న తప్పకుండా కంపెన్సేషన్ వస్తుందన్నారు. రాంబాబు చేసే దుష్ప్రచారంపై త్వరలో పీఎస్‌లో ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/h1yCzA7లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

వ్యక్తి అదృశ్యం



మల్లారెడ్డి (ఫైల్)

నార్సింగ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. నార్సింగ్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మల్లారెడ్డి(44) ఉదయం వాకింగ్ కోసం బయటకువెళ్లాడు. ఎంత సేపటికీ మల్లారెడ్డి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు నార్సింగ్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. మల్లారెడ్డి మానసిక స్థితి సరిగా లేదని ఫిర్యాదులో తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

6వ అంతస్థు నుంచి పడి కార్మికుడి మృతి



మహ్మద్ నవాజ్

రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సెంట్రింగ్ పనులు చేస్తూ 6వ అంతస్థు నుంచి కింద పడి చార్మినార్ అచ్చిరెడ్డినగర్‌కు చెందిన మహ్మద్ నవాజ్(28) అనే కార్మికుడు గురువారం దుర్మరణం చెందాడని పోలీసులు తెలిపారు. రాజేంద్రనగర్ శాస్త్రీపురం కాలనీలో నిర్మాణంలో ఉన్న మహ్మద్ జాఫర్‌కు చెందిన ఆరు అంతస్థుల భవనంపై నవాజ్ సెంట్రింగ్ పనులు చేస్తున్నాడని, ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడని పోలీసులు పేర్కొన్నారు. ఈప్రమాదంలో నవాజ్ అక్కడికక్కడే మృతి చెందాడని, ఈయనకు నలుగురు సంతానం ఉన్నారని తెలిపారు. మృతుడి సోదరుడు మహ్మద్ యూనుస్ ఫిర్యాదు మేరకు మైలార్‌దేవుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టమాట లారీ బోల్తా



రోడ్డుపై చెల్లా చెదురుగా పడిన టమాటలు

రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం వైపు టమాట లోడ్‌తో వెళ్తున్న డీసీఎం లారీ గురువారం ఉదయం అదుపు తప్పి రాజేంద్రనగర్ పీడీపీ చౌరాస్తా వద్ద బోల్తా పడడంతో లారీలో ఉన్న టమాటలన్నీ రోడ్డుపై పడ్డాయి. దీంతో ట్రాఫిక్ తీవ్రంగా స్తంభించి పోయింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి... ప్రశాంత్ అనే వ్యక్తికి చెందిన డీసీఎంలో గంగాధర్ అనే డ్రైవర్ టమాట లోడ్ నింపుకొని ఆరాంఘర్ నుంచి మెహిదీపట్నం గుడి మల్కాపూర్ మార్కెట్‌కు వెళ్తున్నాడు. అతని వాహనం పీడీపీ చౌరస్తా వద్దకు రాగానే ముందుగా ఒక బైక్ నడుపుతున్న వ్యక్తి అడ్డు వచ్చాడు. అతడిని తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో (ఏపీ39 యూఏ 8577)వాహనం రోడ్డుపై బోల్తా పడింది. దీంతో టమాటలన్నీ రోడ్డుపై చెల్లా చెదరుగా పడ్డాయి. అదే సమయంలో రాజేంద్రనగర్ పారిశుధ్య విభాగం ఆ టమాటలన్నీ బాక్సుల్లో నింపి వేరే లారీలోకి మార్చారు. దీంతో చాలాసేపు ట్రాఫిక్ స్థంబించిపోయింది. రాజేంద్రనగర్ ఎస్ఐ కిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్లలోనే బీటెక్, ఎంఎస్ పూర్తి



- స్థానికంగా మూడున్నరేళ్లు, స్వీడన్‌లో ఏడాదిన్నర
- బీటీహెచ్‌తో జేఎన్‌టీయూ ఒప్పందం
- నాలుగు కోర్సుల్లో 80 సీట్లకు 146 దరఖాస్తులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు నేడు తుదిగడువు
- 23న కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకే బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ (బీటెక్) తో పాటు మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్) కూడా పూర్తి చేసే అవకాశాన్ని జేఎన్‌టీయూ కల్పిస్తోంది. స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్)తో చేసుకున్న అవగాహన ఒప్పందం (ఎంఓయూ) మేరకు ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్ (ఐడీడీఎంపీ)ను జేఎన్‌టీయూ నిర్వహిస్తోంది. ఈనెల 3న నోటిఫికేషన్ జారీ కాగా, ఇప్పటికే 146 దరఖాస్తులు అందినట్లు అడ్మిషన్ల విభాగం అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు శుక్రవారంతో గడువు ముగియనుంది. చివరి రోజు దరఖాస్తులు సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాగా, ఐదేళ్ల ఐడీడీఎంపీ కోర్సులో చేరే విద్యార్థులు మూడున్నరేళ్ల పాటు జేఎన్‌టీయూలో, ఏడాదిన్నర పాటు స్వీడన్‌లోని బీటీహెచ్ యూనివర్సిటీలో చదువుకోవాల్సి ఉంటుంది. అతితక్కువ వ్యయంతో స్వీడన్‌లో ఎంఎస్‌ను పూర్తిచేసే అవకాశం కావడంతో ఐడీడీఎంపీ కోర్సులకు డిమాండ్ ఏర్పడింది. ఐడీడీఎంపీ కోర్సు పూర్తిచేసిన వారికి స్వీడన్‌లో ఉద్యోగం చేసేందుకు వీలుగా బీటీహెచ్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్ సర్టిఫికెట్ ఇస్తుండగా, ఇండియాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి జేఎన్టీయూ బీటెక్‌తో పాటు ఎంటెక్ సర్టిఫికేట్ కూడా అందిస్తుండడం విశేషం.

కోర్సులు.. ఫీజులు

ఐడీడీఎంపీ(బీటెక్‌తో పాటు ఎంఎస్) ప్రోగ్రామ్‌లో మొత్తం 4 కోర్సులు.. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్), సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ఈసీఈ)కోర్సులున్నాయి. ప్రతి కోర్సులోనూ 20 సీట్ల చొప్పున మొత్తం 80 సీట్లుండగా, ఆయా కోర్సుల్లో 30శాతం సీట్లను జేఈఈ మెయిన్స్ ర్యాంకర్లకు, 70 శాతం సీట్లను టీజీఎప్‌సెట్ ర్యాంకర్లకు కేటాయించారు. అభ్యర్థులకు 12వతరగతి/ఇంటర్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఐడీడీఎంపీ కోర్సు చదివేందుకు జేఎన్‌టీయూలో సెమిస్టర్‌కు రూ.1.25లక్షల చొప్పున ఏడు సెమిస్టర్లకు రూ.8.75లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, స్వీడన్‌లో మూడు సెమిస్టర్ల చదవాల్సి ఉండగా, ఒక్కో సెమిస్టర్‌కు 52,500 స్వీడన్ డాలర్లు (సుమారు రూ.4.15లక్షలు) చొప్పున మూడు సెమిస్టర్ల పాటు ఫీజు చెల్లించాలి. ఐడీడీఎంపీ పూర్తిచేస్తే స్వీడన్‌లోని ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులకు ఈ నెల 23న ఉదయం 10.30 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తాం. జేఎన్‌టీయూ నిర్వహిస్తున్న స్వీడన్ తరహా ఎంఓయూ కోర్సులకు తెలంగాణతో పాటు ఏ రాష్ట్రానికి చెందిన వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

- బాలు నాయక్ అడ్మిషన్ల విభాగం డైరెక్టర్

సిటీసెంట్రల్ లైబ్రరీ వద్ద పోలీసు పహారా

చిక్కడపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్ కోరుతూ నిరుద్యోగ విద్యార్థులు ర్యాలీకి సిద్ధమవుతుండగా పోలీసులు పహారాను మోహరించారు. చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ నుంచి సమీపంలోని వివేక్‌నగర్ శ్రీ హనుమాన్‌దేవాలయం వరకు ర్యాలీ తీసేందుకు గురువారం ఉదయం 11 గంటలకు వారు సమాయత్తమయ్యారు. విషయం తెలుసుకున్న చిక్కడపల్లి పోలీసులు ఇన్‌స్పెక్టర్ బి రాజునాయక్ ఎస్ఐలు మౌనిక, శివప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో లైబ్రరీ వద్ద పెద్దఎత్తున మోహరించారు. ర్యాలీకి పర్మిషన్ లేదంటూ పోలీసులు తెలిపారు. దీంతో లైబ్రరీలోనే ప్లకార్డులు పట్టుకుని ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎల్ రాజుగౌడ్ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఆందోళనలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

కొలిక్కిరాని చందు నాయక్ హత్య కేసు దర్యాప్తు

చాదర్‌ఘాట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సీపీఐ నేత చందు నాయక్ హత్య కేసులో ప్రధాన నిందితుల జాడ ఇంకా పోలీసులకు అంతుచిక్కడం లేదు. హత్య జరిగి మూడు రోజులవుతున్నా కేసు కొలిక్కి రావడంలేదు. ప్రధాన నిందితులైన మాజీ నక్సలైట్ రాజేష్ అలియాస్ రాజన్న, ఏడుకొండలు కోసం పోలీసుల ముమ్మరంగా గాలిస్తున్నారు. చందు నాయక్‌పై హత్యకు ముందే రాజేష్ తన మొబైల్ ఫోన్‌ను భార్య వద్ద వదిలి బయటకు వచ్చినట్లు సమాచారం. దీన్ని స్వాధీనం చేసుకొని కాల్ రికార్డులను పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. మరో కీలక నిందితుడు ఏడుకొండలు ఆచూకీ కోసం జల్లెడ పడుతున్నారు. ఈ ఇద్దరితో పాటు మిగతా 8 మందిని పట్టుకోడానికి పది పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

సీనియర్ ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులను భర్తీ చేయాలి



నల్లకుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలలో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులను భర్తీ చేయాలని, జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్‌గా ప్రమోషన్ ఇవ్వాలని తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నగరంలోని సంఘం కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నేతలు మాట్లాడారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు ఫార్మసీ ఆఫీసర్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పల్లె, బస్తీ దవాఖానాలలో ఫార్మసీ ఆఫీసర్స్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా పరీక్షలు రాసిన ఫార్మసీ ఆఫీసర్ల ప్రొవిజనల్ మెరిట్ లిస్టు ప్రకటించి వెంటనే పోస్టింగ్స్, జీవో ఎంఎస్ నంబర్ 399, 447 ప్రకారం సీనియర్ ఫార్మసీ ఆఫీసర్లకు జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్‌గా ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఉదయ్‌ప్రసాద్, ఎం.ఎల్.నాయక్, రాజశేఖర్ నాయక్, రవికుమార్, శ్రీహరి, వి.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రత్యేక రవాణా కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్

కుషాయిగూడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి, వారి రక్షణకు గానూ ప్రత్యేక రవాణా కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం చర్లపల్లిలోని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)కు చెందిన కార్మికులు, డ్రైవర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా హిట్ అండ్ రన్ కేసుల్లో న్యాయం జరగాలని, కనీస వేతనం రూ.26వేలు, నైపుణ్య కార్మికులకు రూ.36వేలకు పెంచాలని భాస్కర్ డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, విద్యా సౌకర్యాలు కల్పించాలని డిఅండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జె.చంద్రశేఖర్, జి.శ్రీనివాసులు, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా బాధ్యుడు బంగారు నర్సింగరావు పాల్గొన్నారు. కాగా, నూతనంగా ఎన్నికైన చర్లపల్లి బీపీసీఎల్ కమిటీ అధ్యక్షుడు పి.గణేష్‌తో కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

నిండు ప్రాణాన్ని బలిగొన్న ఆర్థిక ఇబ్బందులు

- ఉరేసుకొని బిల్డర్ ఆత్మహత్య

వనస్థలిపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో రియల్ ఎస్టేట్ వ్యాపారి, బిల్డర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ ప్రశాంత్‌హిల్స్ కాలనీలో చెందిన మర్రి వెంకటేశ్వర్లు(47) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. కొంతకాలంగా అతను రియల్ ఎస్టేట్‌తో పాటు బిల్డర్‌గానూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇటీవల ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులతో అతను ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంజాపూర్‌లోని సాయిప్రియ కాలనీలో ఉన్న ఫ్లాట్‌లోని గదిలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విగతజీవిగా యజమాని కనబడటం చూసిన వెంకటేశ్వర్లు సూపర్‌వైజర్ బి.రాజు పోలీసులతో పాటు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు.. స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది. తాను ఆర్థిక ఇబ్బందులతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడు సూసైడ్ నోట్‌లో రాసినట్లు పోలీసులు తెలిపారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న శిశువిహార్ ఆయాలు

పెండింగ్ వేతనాలివ్వండి

- నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

పంజాగుట్ట, జూలై 17(ఆంధ్రజ్యోతి): యూసుఫ్ గూడ ప్రధాన రహదారి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న శిశువిహార్ లో పనిచేస్తున్న ఆయాలకు ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని శిశు విహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) డిమాండ్ చేసింది. గురువారం ఆయాలు శిశు విహార్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఆయాలు నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 5 నెలల వేతనాలు ఇవ్వలేదన్నారు. జీతాలు ఇవ్వకపోతే సమ్మెకు పిలుపునిస్తామన్నారు.

దాశరథి చిరస్మరణీయుడు

అఫ్జల్‌గంజ్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దాశరథి కృష్ణమాచారి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో విప్లవ కవి వీరుడిలా పోరాడారని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు కేవీ రమణాచారి కీర్తించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన దాశరధి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ, నా తెలంగాణ.. కోటి రతనాల వీణ అన్న దాశరథి నినాదం తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తినివ్వడమే కాకుండా రాష్ట్ర సాధన సంభవించిందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, నిజాం కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, దాశరథి కుమార్తె పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనను విమర్శిస్తూ హోర్డింగ్

- వెంటనే తొలగించిన అధికారులు



వాజ్‌పాయ్ పార్క్ వద్ద వెలిసిన హోర్డింగ్ ఇదే

మారేడుపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పాలనలో ఏ టు జెడ్ వరకు అవినీతి జరుగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో ఆయన కుటుంబానికి, బంధువర్గానికే కాంట్రాక్టులు కేటాయిస్తూ, వాటిపై కమీషన్లు దండుకుంటున్నారని వెలిసిన హోర్డింగ్ కలకలం సృష్టించింది. అర్ధరాత్రి పూట వెలిసిన ఈ హోర్డింగ్ గురించి సమాచారం తెలిసిన వెంటనే అధికారులు రంగప్రవేశం చేసి, వాటిని తొలగించారు. సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ సమీపంలోని వాజ్‌పేయి పార్కు వద్ద హోర్డింగ్ వెలిసింది. గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి, వాటిని ఏర్పాటు చేసినట్టు సమాచారం. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని మారేడుపల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపారు.



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నుంచి అవార్డులు అందుకుంటున్న శాస్త్రవేత్తలు

ఐఐఆర్ఆర్ శాస్త్రవేత్తలకు అవార్డుల ప్రదానం

రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి) : భారత వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) కు చెందిన పలువురు శాస్త్రవేత్తలు అవార్డులను అందుకున్నారు. న్యూఢిల్లీలోని భారత రత్న సుబ్రమణ్యం ఆడిటోరియంలో ఈ నెల 16న జరిగిన 97వ అఖిల భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఫౌండేషన్ డే వేడుకలలో కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేతుల మీదుగా శాస్త్రవేత్తలు అవార్డులు అందుకున్నారు.

అందరి కృషితోనే జీహెచ్ఎంసీకి స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారం

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యం, పారిశుద్ధ్య కార్మికుల కృషితోనే జీహెచ్ఎంసీకి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు వచ్చిందని గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతేడాది గ్రేటర్ హైదరాబాద్ 9వ ర్యాంకుతో 5స్టార్ హోదా పొందిందని, ఈ సంవత్సరం మరింత మెరుగైన పనితీరుతో ఉత్తమ ప్రతిభ కనబరిచి 6వ ర్యాంకుతో 7 స్టార్ రేటింగ్ పొందడంపై హర్షం వ్యక్తం చేశారు. కాగా, అవార్డు వచ్చేందుకు కీలకపాత్ర పోషించిన కమిషనర్, అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు వారు అభినందనలు తెలిపారు.

'విచారణ జరిపించాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పాలేరు జేఎన్‌టీయూ కళాశాల టెండర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ విద్యార్థి సంఘాల ప్రతినిధులు కొందరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్‌కు గురువారం ఫిర్యాదు రాశారు. వైస్‌చాన్సలర్ కిషన్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు విదేశీ పర్యటనలో ఉన్నందున ఫిర్యాదు ప్రతులను డిస్పాచ్ సెక్షన్‌లో అందజేసినట్లు విద్యార్థి సంఘాల ప్రతినిధులు తేజ, దిలీప్ వెల్లడించారు. ఇదిలా ఉంటే, వర్సిటీలో ఎలాంటి అవకతవకలు జరగకున్నా కొందరు దుష్ప్రచారం చేస్తుండడాన్ని వర్సిటీ బోధనేతర సంఘాలు గురువారం ఒక ప్రకటనలో ఖండించాయి.

యూట్యూబర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఒక యూట్యూబర్‌పై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిలింనగర్‌కు చెందిన రాజా దోరపనేని ఇటీవల వర్జిన్ బాయ్స్ అనే సినిమా నిర్మించాడు. సినిమా ప్రమోషన్ కోసం యూట్యూబర్ నవీన్ అలియాస్ పూల చొక్కాను యూనిట్ సభ్యులు సంప్రదించారు. ఇందుకు రూ.35 వేలు ఖర్చు అవుతుందన్నాడు. దీంతో ఒప్పందం కుదరలేదు. ఇటీవల సినిమా విడుదలైన తర్వాత రివ్యూను పోస్ట్ చేశారు. సినిమాలో నటించిన మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశాడు. నిర్మాత ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

8 గంటలు.. 17 మందికి కీళ్ల మార్పిడి



హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): కేవలం ఎనిమిది గంటల వ్యవధిలోనే 17 మందికి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స చేసినట్లు డాక్టర్ సంజీబ్ కుమార్ బెహెరా తెలిపారు. ఒకే రోజు, ఒకే వేదికపై ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ ఆపరేషన్లు నిర్వహించినట్లు చెప్పారు. ఇది సంఖ్యల కోసం పోటీ కాదని, ఆస్పత్రిలో బలమైన వ్యవస్థ, అనుభవజ్ఞులైన వైద్య బృందం మద్దతుతో, అధిక వాల్యూమ్‌ను సైతం నాణ్యతతో నిర్వహించగలమన్నది లక్ష్యమన్నారు. ఆస్పత్రి జోనల్ సీఓఓ బిజు నాయర్ మాట్లాడుతూ వైద్య బృందాలు వేగవంతమైన సేవ, నాణ్యమైన ఫలితాల కోసం కృషి చేస్తున్నాయని తెలిపారు. బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి అరుదైన రికార్డును సొంతం చేసుకుందన్నారు.

'ది కాకేషియన్ చాక్ సర్కిల్' నాటక ప్రదర్శన



హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): థియేటర్ కానపీ ఆధ్వర్యంలో 'ది కాకేషియన్ చాక్ సర్కిల్' బహుభాషా నాటకం ఈ నెల 18, 20 తేదీల్లో రాత్రి 7.30గంటలకు గచ్చిబౌలిలోని రంగభూమి వేదికగా ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నాటకానికి విఘ్నేష్ జయకృష్ణన్ దర్శకత్వం వహిస్తుండగా, విశాల్ సంగీతాన్ని సమకూర్చనున్నట్లు పేర్కొన్నారు.

మ్యాన్‌హోల్ మూతలను తెరవద్దు

- వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి):నగర ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడి విజ్ఞప్తి చేశారు. నగరంలో భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు (ఈఆర్టీ), ఎస్పీటీ వాహనాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు 24 గంటలు క్షేత్ర స్థాయిలో సిబ్బందితో పర్యవేక్షించుకోవాలని సూచించారు.



శానిటేషన్ సిబ్బందితో కలెక్టర్ హరిచందన దాసరి

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్ హరిచందన

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో పనిచేసే శానిటేషన్ వర్కర్లు, సిబ్బంది వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం రెడ్‌హిల్స్‌లోని లక్ష్మీనగర్ మునిసిపల్ కమ్యూనిటీహాల్‌లో వైద్యారోగ్యశాఖ, రోటరీక్లబ్, ఫౌండేషన్ ఆధ్వర్యంలో బల్దియా శానిటేషన్ వర్కర్లకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ వర్కర్ల పాత్ర అభినందనీయమని హరిచందన అన్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలకుండా ముందు నుంచే జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రభుత్వం అందజేసిన కిట్లను వినియోగించుకోవాలన్నారు.

● ఉద్యాన వర్సిటీకి అవార్డు

కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఓపెన్ సోర్స్ సాఫ్ట్‌వేర్ ఫర్ ఎడ్యుకేషన్ ప్రాజెక్టుకు గాను ఉత్తమ విశ్వవిద్యాలయం అవార్డు ప్రకటించగా వైస్ చాన్సలర్ డాక్టర్ దండ రాజిరెడ్డి అందుకున్నారు. గురువారం ముంబయి ఐఐటీలో నిర్వహించిన ఓపెన్ సోర్స్ జీఐఎస్ దినోత్సవ వేడుకలు, నేషనల్ జియో స్పేషియల్ అవార్డు -2025ను తీసుకున్నారు. జియో స్పేషియల్, క్రియాశీల భాగస్వామ్యం గురించి అవగాహన కల్పించామని దీంతో అవార్డు వరించిందని రాజిరెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి) :



ఏటీఎం చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

- రూ. 17 లక్షల నగదు, రూ. 3 లక్షల సొత్తు స్వాధీనం
- ప్రధాన సూత్రధారి యాసిర్ హుస్సేన్ 30 కేసుల్లో నిందితుడు
- వివరాలు వెల్లడించిన డీసీపీ సురేష్ కుమార్



నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పీఎస్ పరిధిలో సంచలనం రేపిన ఏటీఎం చోరీ కేసును ఐదు రోజుల్లో సైబరాబాద్ పోలీసులు ఛేదించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద రూ.17 లక్షల నగదు, రూ.3లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఒకరు పరారీలో ఉన్నారు. గురువారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ డీసీపీ కె.సురేష్ కుమార్ వివరాలను వెల్లడించారు. గాజులరామారం మెయిన్ రోడ్డు మీద ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు చెందిన రెండు ఏటీఎం మిషన్లు ఉన్నాయి. ఈనెల 9న తెల్లవారుజాము 2.35 గంటల నుంచి 3.30 గంటల మధ్యలో చోరీ జరిగింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంలను కట్ చేసి, రూ.34.71లక్షలను దోచుకెళ్లారు. ఈ కేసును పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రత్యేక బృందాలను నియమించి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులు హర్యానాకు చెందిన యాసిర్ హుస్సేన్ అలియాస్ ఆసిఫ్ హారున్ ఖాన్ (28), ఎండీ అబేద్ (31), హైదరాబాద్ నివాసి అమీర్ అన్సారీ (24)లు గా గుర్తించారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్‌ల పరిధిలో 30 కేసులు నమోదై ఉన్నాయి.

500 సీసీ కెమెరాల పరిశీలన

సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), బాలానగర్, జీడిమెట్ల పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాలు 500లకు పైగా సీసీ కెమెరాలను పరిశీలించాయి. ఏటీఎం చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న వారి సమాచారాన్ని సేకరించారు. గతంలో శంషాబాద్ పరిధిలో జరిగిన ఏటీఎం చోరీ ఘటనలో, ఇప్పుడు జరిగిన ఈ ఉదంతంలో నిందితులు హర్యానాకు చెందిన వారుగా గుర్తించి ఈ ప్రాంతానికి వెళ్లారు. నాలుగు రోజుల పాటు ఇక్కడే ఉండి నిందితుల కదలికపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టి నిర్ధారణ అయిన తర్వాత అదుపులోకి తీసుకొని నగరానికి తీసుకువచ్చారని డీసీపీ తెలిపారు.

● జైలులో పరిచయం

హర్యానాకు చెందిన ముగ్గురు నిందితులతో హైదరాబాద్‌కు చెందిన అమీర్ అన్సారీకి మధ్యప్రదేశ్‌లోని శివపురి జైలులో పరిచయం ఏర్పడింది. స్నేహితులుగా మారిన వీరు, జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాలను చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రకాష్‌నగర్‌లో ఉంటున్న అమీర్ వద్ద ఉంటూ నగరంలో ఏటీఎంను చోరీ చేసేందుకు కొన్ని రోజులు రెక్కీ నిర్వహించారు.

పరారీ ఇలా..

గాజుల రామారంలోని ఏటీఎంలో చోరీ చేసి వెళ్తూ జీడిమెట్ల ప్రాంతంలోనూ మోటార్ సైకిల్ దొంగలించి గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో దాన్ని వదిలిపెట్టారు. ఇదే ముఠా కామారెడ్డిలో మరో ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి ఆదిలాబాద్‌కు ప్రయాణించి ఇక్కడ కూడా దానిని వదిలిపెట్టారు. ఈ ప్రాంతంలోనే రెండు బృందాలుగా విడిపోయి స్వస్థలాలకు చేరుకున్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయని డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు. 7 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. డీసీపీ క్రైం ఎ.ముత్యం రెడ్డి, డీసీపీ సీసీఎస్ క్రైం రామ్‌కుమార్, అడిషనల్ డీసీపీ పి.సత్యనారాయణ, ఏసీపీలు పి.నరేష్‌రెడ్డి, వై.నాగేశ్వర్‌రావు, పి.దాలి నాయుడు సీసీఎస్ మేడ్చల్ ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ బాలానగర్ బృందం,శంషాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.పవన్, జీడిమెట్ల ఎస్‌హెచ్ఓ జి.మల్లేష్, డీఐ కనకయ్య, బాలానగర్ పీఎస్ డీఐ నాగిరెడ్డిలతో పాటు ఇతర సిబ్బంది కేసు దర్యాప్తును వేగంగా పూర్తి చేసి నిందితులను అరెస్టు చేయడంతో పాటు సొత్తును స్వాధీనం చేసుకున్నారని డీసీపీ సురేష్ కుమార్ తెలిపారు. వీరికి మంచి రివార్డులు ఇస్తామన్నారు.

చింతన

అంతటా ఆయనే!

ఏ సుఖశాంతుల కోసం అన్వేషిస్తున్నామో అవి తమలోనే ఉన్నాయనే విషయం చాలామందికి తరచుగా అర్థం కాదు. శాంతిని పొందాలంటే ప్రత్యేకంగా ఏదో చెయ్యాలనుకుంటారు. అందువల్లనే నా దగ్గరకు వచ్చేవారిలో చాలామంది "మమ్మల్ని ఆశీర్వదించండి" అని అడుగుతూ ఉంటారు. కానీ సమస్త సృష్టిని రచించిన ఆ దివ్యశక్తి హస్తం తమపై ఉందని వారు గుర్తించడం లేదు. నక్షత్రాలను, సూర్య చంద్రులను, ఈ భూమిని సృష్టించినవాడి ఆశీర్వాదం అందరి వెంటా ఉంది. మీలోనికి శ్వాస వస్తూ, పోతున్నంతకాలం ఆయన చెయ్యి మీ తలపై ఉన్నట్టే! కాబట్టి ఏ ఇతర ఆశీర్వాదం మీకు అవసరం లేదు. అన్నీ మీ సమక్షంలోనే ఉన్నాయి. కానీ మీ లోపలి నేత్రాలను తెరిచినప్పుడు మాత్రమే సత్యమేమిటో మీకు గోచరిస్తుంది. ఏదో చేయడం వల్ల శాంతి చేకూరదు. చాలామందికి ఈ విషయంలో ఎన్నో అపోహలు ఉంటాయి. ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది బయట ఎక్కడో లేదనీ, మీలోనే ఉందనే విషయాన్ని హృదయంతో మీరు గ్రహించలేనప్పుడు... మీకు అన్నీ ఉన్నప్పటికీ ఏదీ సాధించలేరు.

తప్పు అక్కడే ఉంది...

నేను మీకొక చిన్న కథ చెబుతాను. పూర్వం ఒక వ్యక్తి ఒక కొండమీద చిన్న పూరి గుడిసెలో ఉండేవాడు. పొద్దున్నే పక్షుల కిలకిలరావాలను విని నిద్రలేచి, తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఒక రోజు అతను లేచేసరికి ఏదీ కనిపించడం లేదు. 'సూర్యుడు ఇంకా ఉదయించడం లేదు' అనుకున్నాడు. అంతా చీకటిగా ఉందని అగ్గిపుల్ల వెలిగించాడు. కానీ ఆ వెలుగు కూడా కనిపించలేదు. బయటకు వెళ్ళాక ఎండ తగిలింది, కానీ సూర్యుడు కనిపించలేదు. 'ఈ రోజు సూర్యుడు ఎందుకో వెలుగు ఇవ్వడం లేదు' అనుకున్నాడు. ఇంతలో ఒక సాధువు అటువైపు వెళ్తూ... ఇతన్ని పలకరించాడు. ఆయనకు తన సమస్యను ఈ వ్యక్తి చెప్పుకున్నాడు. "సూర్యుడి వెలుగు లేకపోవడం కాదు, నీ కళ్ళలో ఏదో లోపం ఉంది" అన్నాడు ఆ సాధువు. అప్పుడు తప్పు ఎక్కడ ఉందో ఆ వ్యక్తికి తెలిసింది. అతనికి కళ్ళు సరిగ్గా కనిపించకపోవడం వల్లనే సూర్యుడి వెలుగు కనిపించలేదు. అంతా చీకటిగా అనిపించింది.



ఆ సంగతి మరువకండి...

మనలో చాలామంది ఏదో ఒక సందర్భంలో భగవంతుడితో "నువ్వంటూ ఉంటే నా ముందుకు రా!" అని సవాలు చేసే ఉంటారు. కానీ కష్టనష్టాలు ఎదురైనప్పుడు మాత్రమే మనం భగవంతుడివైపు చూస్తాం. అంతకుముందు మన దైనందిన కార్యకలాపాలలో లీనమై ఉంటాం. ఈ ప్రపంచంలో భగవంతుడు లేని చోటంటూ ఏదైనా ఉందేమో చెప్పగలరా? ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. మీరు అంతర్ముఖంగా చూస్తే... అక్కడ మీకు ఆయన కనిపిస్తాడు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్నప్పుడు... ఆయన సదా మనతోనే ఉన్నప్పటికీ ఆయనను మనం ఎప్పుడూ చూడలేదని, అందుకే ఈ ప్రాపంచిక జంజాటాలనే భారాన్ని మోస్తున్నామని మనకు బోధపడుతుంది. ఆయనను గుర్తించలేకపోతే... ఉత్త చేతులతో వచ్చిన మనం ఉత్త చేతులతోనే మిగిలిపోతాం. ఈ ప్రపంచంలో 'జీవితం' అనే పువ్వు నుంచి మకరందాన్ని సేకరించే మార్గాన్ని మనం తెలుసుకోవాలి. అది తెలియకపోతే ఇలాగే ఉండిపోయి ఆకలితో అలమటిస్తాం. మీ జీవితంలో ఏది జరిగినప్పటికీ... మీరు ఎంతో సౌభాగ్యశీలులు అనే విషయం మాత్రం ఎన్నటికీ మరువకండి.



ప్రేమ్‌రావత్
9246275220



ఆలయ దర్శనం

యోగఫలాలు అందించే అగస్త్యేశ్వరుడు

త్రికాలవేదిగా ఖ్యాతిగాంచిన అగస్త్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. ఆయన త్రేతాయుగంలో ప్రతిష్ఠించినవిగా పేరుపొందిన అయిదు ఆలయాలు... పంచ అగస్త్యేశ్వర ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. అవి పూర్వ తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తాపేశ్వరం, ఆర్తమూరు, మండపేట, వల్లూరు, చెల్లూరులలో ఉన్నాయి. తాపేశ్వరంలో (ప్రస్తుత కోనసీమ జిల్లా) పశ్చిమాభిముఖంగా ఉన్న శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామివారి ఆలయాన్ని దర్శించినవారికి అద్భుతమైన యోగ ఫలితాలు లభిస్తాయని ప్రతీతి. ఈ ఆలయానికి ఉత్తరదిశగా తుల్యభాగ నది ప్రవహిస్తున్నందున... దీన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.



వాతాపి జీర్ణం...

స్థల పురాణం ప్రకారం... త్రేతాయుగంలో వాతాపి, ఇల్వలుడు అనే ఇద్దరు రాక్షసులు ఉండేవారు. వారు కామరూపులు. వాతాపిని ఇల్వలుడు గొర్రెగా మార్చి, ఆహారం వండి, తమ ఇంట పితృకార్యం పేరుతో బాటసారులకు భోజనాలు పెట్టేవాడు. వారు తిన్న తరువాత... "వాతాపీ బయటకు రా" అని ఇల్వలుడు పిలవగానే... భోజనాలు చేసినవారి ఉదరాలను చీల్చుకుంటూ వాతాపి వచ్చేవాడు. అలా మరణించినవారిని ఇల్వలుడు, వాతాపి రాక్షస రూపాల్లోకి మారి ఆరగించేవారు. ఈ విషయం తెలిసిన అగస్త్యుడు వారి వద్దకు వెళ్ళి, భోజనం చేసిన తరువాత "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు. అగస్త్యుడి ఉదరంలో కామరూపంలో ఉన్న వాతాపి పూర్తిగా జీర్ణమైపోయాడు. అందుకనే ఇప్పటికీ ఇళ్ళల్లో పిల్లలకు ఉగ్గు పట్టిన తరువాత పెద్దలు "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అంటారు. ఆ తరువాత ఇల్వలుణ్ణి కూడా తన తపశ్శక్తితో అగస్త్యుడు సంహరించాడు. వారిలో బ్రాహ్మణత్వం ఉండడం వల్ల అగస్త్యుడికి బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంది. ఆయన శివుణ్ణి ప్రార్థించి, స్వామి అనుగ్రహంతో ఇక్కడ శ్రీ ఉమా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామిని ప్రతిష్ఠించడంతో... ఆయనకు చుట్టుకున్న బ్రహ్మహత్యాపాతకం నశించింది. ఈ ఊరి పేరు పూర్వం 'వాతాపిపురం' కాగా... కాలక్రమేణా తాపేశ్వరంగా మారింది.

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయాన్ని సందర్శిస్తే కాశీలోని విశ్వేశ్వరుని దర్శించిన ఫలాన్ని పొందుతారనేది భక్తుల నమ్మకం.

అత్యంత పురాతనం

ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీఅగస్త్యేశ్వర స్వామితో పాటు సంతోషిమాత, శ్రీరాముడు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు కూడా ఉన్నాయి. అగస్త్యేశ్వర స్వామి కళ్యాణాన్ని ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి రోజున వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఆలయం అత్యంత పురాతనమైనదని, ఈ ఆవరణలో ఉన్న రెండు నాగమల్లి చెట్లకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉందని డెబ్బయ్యేళ్ళ నుంచి ఆలయ అర్చకుడిగా ఉన్న శంకరమంచి సుబ్రహ్మణ్య శర్మ చెప్పారు. ఆలయ ప్రాంగణంలోని ప్రాచీనమైన గిలకబావిలోని నీటినే స్వామి అభిషేకాల కోసం నేటికీ వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. కాగా కొన్నేళ్ళ క్రితం ఈ ఆలయాన్ని స్థానిక సురుచి ఫుడ్స్ యజమాని పోలిశెట్టి మల్లిబాబు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పునర్నిర్మించారు. ఇది తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఆయన చెబుతున్నారు. కాకినాడ నుంచి రామచంద్రపురం మీదుగా, రాజమండ్రి నుంచి జొన్నాడ, ఆలమూరు, మండపేట మీదుగా తాపేశ్వరం చేరుకోవచ్చు.

• సి.ఎస్.మూర్తి
8328143489

సందేశం


కష్టాల్లో సహనం

"కష్టం వెనుక నిశ్చయంగా సుఖం ఉంటుంది. ఏ ఒక్కరి మీదా వారు భరించేగలిగేదానికన్నా ఎక్కువ భారాన్నీ, బాధ్యతను అల్లాహ్ మోపడు" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ ఒక సందర్భంలో చెప్పారు. దానికి ఉదాహరణగా పేర్కొనే కథ ఇది. ఒక ఊరిలో ఒక బాలుడు ఉండేవాడు. అతను ఊరి చివర్లో ఉండే పాఠశాలలో చదివేవాడు. అతనికి ప్రకృతి అంటే చాలా ఇష్టం.

ఒక రోజు అతని ఉస్తాద్ (గురువు) పిల్లలకు పాఠం చెబుతూ... "తను సృష్టించిన ప్రతిదానిలో అల్లాహ్ ఒక హిక్మత్ (జ్ఞానం) ఉంచాడు. దాన్ని మనం కచ్చితంగా గమనించాలి" అని బోధించారు. ఈ మాటలు ఆ బాలుడి మనస్సులో బలంగా నాటుకుపోయాయి. ఆ రోజు సాయంత్రం తన ఇంటి దగ్గర ఉన్న తోటలోకి వెళ్ళాడు. అతనికి ఒక పట్టుపురుగు కనిపించింది. ఆ పురుగు తన చుట్టూ ఒక గూడు తయారు చేసుకుంటోంది. ఆ బాలుడికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఈ పురుగు ఇలా ఎందుకు చేస్తోంది? ఆ తరువాత దాని నుంచి బయటకు రావడానికి ఎందుకు అన్ని కష్టాలు పడుతోంది?' అని ఆలోచించాడు.

కొద్ది రోజులకు ఆ పురుగు పెద్దదయింది. రెక్కలు రావడం కోసం శ్రమ పడుతోంది. ఈ దశను గమనించిన ఆ బాలుడి హృదయం చలించిపోయింది. దానికి సాయం చెయ్యాలనుకున్నాడు. దాని చుట్టూ ఉన్న గూడును (కోకూన్) ఒక చిన్న కత్తెరతో మెల్లగా కత్తిరించాడు. అప్పుడు ఆ పురుగు బయటకు వచ్చింది. కానీ రెక్కలు బలహీనంగా ఉండడంతో ఎగరలేకపోయింది. కొద్దిసేపటికే ప్రాణం కోల్పోయింది. ఆ బాలుడు తీవ్రమైన దుఃఖంలో మునిగిపోయాడు. మర్నాడు బడికి వెళ్ళి... తను చేసిన పనిని గురువుకు చెప్పాడు.

అప్పుడు ఆ గురువు "నాయనా! ఇలాంటి ప్రతి శ్రమలో అల్లాహ్ జ్ఞానాన్ని ఉంచాడు. ఆ పురుగు తన శరీరాన్ని ఒత్తిడి చేసి బయటకు రావడం ద్వారా దాని రెక్కలకు బలం వస్తుంది. నువ్వు చేసిన సాయం నీకు దయగా కనిపించవచ్చు. కానీ అది సాయం కాదు. అల్లాహ్ కొన్ని పరీక్షల ద్వారా మనల్ని బలోపేతం చేస్తాడు. ఆ సమయంలో మనం సహనం చూపిస్తే మనం బలంగా రూపుదిద్దుకుంటాం" అని వివరించారు. 'ప్రతి కష్టం మనకోసం అల్లాహ్ పెట్టే ఒక పరీక్ష, ఒక బహుమానం' అనే 'దివ్య ఖుర్‌ఆన్' వాక్యాలను చదివి వినిపించారు.



'కష్టాల్లో సహనం చూపించేవారికి అల్లాహ్ మేలు చేస్తాడు' అనే విషయం ఆ బాలుడికి అర్థమయింది. గురువుకు సలామ్ చేసి ఇంటికి బయలుదేరాడు.

• మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం

సహజయోగ

భక్తే కాదు, విశ్వాసమూ ప్రధానమే

భగవంతుణ్ణి ప్రసన్నం చేసుకోవాలి. ఇది ప్రతి భక్తుడూ కోరుకొనే విషయమే. కానీ ఇది అంత సులభమైనది కాదు. భగవంతుడి ఆశీస్సులు పొందాలంటే... ఆయనపై అనన్యమైన భక్తి, అపరిమితమైన విశ్వాసం ఉండాలి. అంతేకాదు, తమ కోరిక స్వార్థ ప్రయోజనాలకోసం కాకుండా... ప్రజాహితంగా, సమాజహితంగా ఉండాలనేది కూడా భక్తులు గ్రహించాలి. పరమేశ్వరుడిమీద మన నమ్మకం ఎంత కచ్చితంగా, ఎంత నిజాయితీగా ఉండాలో సహజయోగ ప్రదాత శ్రీమాతాజీ నిర్మలాదేవి ఒక కథలో వివరించారు.

దేవుడికి ప్రీతిపాత్రుడైన ఒక భక్తుడు ఆయనను దర్శించుకోవడానికి బయలుదేరాడు. దారిలో ఒక ముని ఎదురుపడ్డాడు. అతను దేనికోసమో ఎదురుచూస్తున్నట్టు కనిపించాడు. "నేను భగవంతుణ్ణి కలుసుకోవడానికి వెళ్తున్నాను. నీకు ఏదైనా కోరిక ఉంటే చెప్పు. ఆయనకు తెలియజేస్తాను" అన్నాడు ఆ భక్తుడు. "అలాగా... సంతోషం. నాకు తినడానికి ఇప్పటివరకూ ఆహారం రాలేదు. కాస్త తొందరగా ఏర్పాటు చేయమని భగవంతుడికి చెప్పండి" అన్నాడు ఆ ముని. అతను తనను ఎగతాళి చేస్తున్నాడనుకున్న ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. మరికొంత దూరంలో మరో ముని తారసపడ్డాడు. అతను తల్లక్రిందులుగా, ఎంతో క్లిష్టతరమైన తపస్సు చేస్తూ నానా తిప్పలూ పడుతున్నాడు. "నేను భగవంతుడి దగ్గరకు వెళ్తున్నాను. నీ గురించి ఏదైనా చెప్పమంటావా?" అని అడిగాడు భక్తుడు. "ఆయన దర్శనం కోసం నేను ఎంతో కాలంగా తపస్సు చేస్తున్నాను. ఇంకా ఎంతకాలం ఎదురుచూడాలో అడుగు" అన్నాడతను. 'సరే'నంటూ ఆ భక్తుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. భగవంతుణ్ణి కలుసుకున్నాడు. భగవంతుడు అతణ్ణి కుశల ప్రశ్నలు అడిగాడు. "ఇంకా ఏదైనా అడగాలా?" అన్నాడు. అప్పుడు ఆ భక్తుడు రెండో ముని సందేహాన్ని చెప్పాడు. "కంగారేమీ లేదు. అతను ఇంకా తపస్సు చేయాల్సిందే" అన్నాడు. ఆ తరువాత మొదటి ముని కోరిక గురించి చెప్పాడు. భగవంతుడు వెంటనే తన సేవకులను పిలిచి... ఆ ముని కోరుకున్న ఆహారాన్ని వెంటనే పంపించాలని ఆజ్ఞాపించాడు. "అదేమిటి స్వామీ! అంత కఠోర తపస్సు చేస్తున్న వ్యక్తిని ఇంకా కొంతకాలం వేచి ఉండాలంటున్నారు. తిండికోసం ఆరాటపడుతున్నవాడికి వరం ప్రసాదించారు. ఎందుకని?" అని అడిగాడు భక్తుడు. "సరేగానీ... ఆ మునులతో నేను భగవంతుణ్ణి కలిసే సమయానికి ఆయన సూది బెజ్జం నుంచి ఒంటెను బయటకు తీస్తున్నాడు" అని చెప్పు. అంతే! అప్పుడు నీకే అర్థమవుతుంది" అన్నాడు దేవుడు.



అది హృదయం లోతుల్లోంచీ రావాలి...

ఆయన దగ్గర సెలవు తీసుకున్న భక్తుడు అక్కడినుంచి బయలుదేరాడు. తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వచ్చాడు. "నువ్వు ఇంకా తపస్సు చేయాల్సి ఉందని దేవుడు చెప్పాడు. అయితే ఆయనను కలుసుకున్నప్పుడు... సూది బెజ్జంలోనుంచి ఒక ఒంటెను తీస్తూ ఉంటే కళ్ళారా చూసి ఆశ్చర్యపోయాను" అన్నాడు. అప్పుడు ఆ ముని "అది అసాధ్యమైన కార్యం. నువ్వు ఆయన దగ్గరకు వెళ్ళలేదు. కేవలం నన్ను నమ్మించడం కోసం ఇలా చెబుతున్నావు" అని కొట్టి పారేశాడు. ఆ తరువాత... తను మొదట కలుసుకున్న ముని దగ్గరకు భక్తుడు వెళ్ళాడు. అప్పటికే ఆ ముని... తనకు దేవుడు పంపిన ఆహారం తిని ఆనందంలో ఉన్నాడు. "భగవంతుడు సూది నుంచి ఒంటెను బయటకు తీయడం చూసి ఆశ్చర్యం కలిగింది. అలాంటి అద్భుతాన్ని ఎప్పుడూ చూడలేదు" అని చెప్పాడు భక్తుడు. అందుకు ఆ ముని "ఇందులో అద్భుతం కానీ, ఆశ్చర్యపడాల్సినది కానీ ఏముంది? ఆయన సర్వేశ్వరుడు. ఆయనకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. ఒంటెను ఏమిటి? సూది బెజ్జంలోంచి విశ్వాలన్నిటినీ తీయగల సమర్థుడు" అని చాలా ధీమాగా చెప్పాడు. భక్తి శ్రద్ధలు మాత్రమే కాదు, భగవంతుడి మీద అచంచలమైన విశ్వాసం తప్పనిసరిగా ఉండాలని చెప్పే అనేక ఉదాహరణలు మన పురాణ గ్రంథాలలో ఉన్నాయి. పైన చెప్పిన కథలో మనం తెలుసుకోవాల్సినది ఏమిటంటే... భగవంతుడి శక్తి మీద భక్తుడికి ప్రగాఢ విశ్వాసం ఉండాలి. ఆ విశ్వాసం హృదయం లోతుల్లోంచీ రావాలి. ఆత్మ ద్వారా వ్యక్తం కావాలి.

అన్నీ సాధ్యమే...

కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొందిన సహజ యోగులకు... వారి ఆత్మ విశ్వాసం ద్వారా ఇది సులభసాధ్యం అవుతుంది. అప్పుడు అది అంధ విశ్వాసం కాదు. ఆత్మ వికాసంతో సాధించుకున్న విశ్వాసం. మనలో నిగూఢంగా, నిద్రాణ స్థితిలో ఉన్న దివ్యశక్తి అయిన కుండలినీ శక్తి... ఒక సద్గురువు సమక్షంలో జాగృతి చెందాలి. ఆత్మసాక్షాత్కారాన్ని అనుభూతిపరంగా మనం స్వయంగా గ్రహించాలి. భగవంతుడి ప్రేమను, అనుగ్రహాన్ని తక్కువగా అంచనా వేసుకోలేం కదా! మరి ఆత్మ సాక్షాత్కారాన్ని ఆయన సునాయాసంగా ప్రసాదిస్తాడనే విషయంలో సందేహం ఎందుకు? అంతా ఆయన ఇష్టప్రకారమే జరుగుతుంది. ఆయనను ప్రశ్నించడానికి, అంచనా వేయడానికి మనమెవరం? మనకు ఉండవలసినది ఆయన మీద, ఆయన శక్తి మీద తిరుగులేని విశ్వాసం మాత్రమే. దాని ద్వారా అన్నీ సాధ్యమేనని నమ్మాలి.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

అత్తాకోడళ్ల కథ

బైబిల్‌లో రూతు కథ ఆసక్తికరంగా ఉంటుంది. అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

బెత్లెహేములో నివసించే నయోమి యూదు మతాన్ని అనుసరించే వ్యక్తి. ఆమెకు ఇద్దరు కుమారులు. భర్త మరణంతో, అనంతరం తమ ప్రాంతంలో కరువు ఏర్పడడంతో... బిడ్డలతో పాటు మోయబ్ ప్రాంతానికి బతుకుతెరువు కోసం నయోమి పయనమైంది. అక్కడే తన పిల్లలకు పెళ్ళిళ్ళు చేసింది. ఆమె కోడళ్ళు ఇద్దరూ యూదులు కాదు. అన్యమతస్థులు. కాగా... కొన్నాళ్ళకు నయోమి కుమారులు ఇద్దరూ మరణించారు. వారికి పిల్లలు లేరు. ఈ పరిస్థితుల్లో... తన సొంత ప్రాంతమైన బెత్లెహేముకు తిరిగి వెళ్ళాలని నయోమి నిర్ణయించుకుంది. కోడళ్ళను పిలిచి... "మీరు ఇక్కడే... మీ తల్లితండ్రుల దగ్గర ఉండిపోండి" అని చెప్పింది. ఒక కోడలు సరేనంది. మరో కోడలైన రూతు "నీవే నాకు తల్లివి, తండ్రివి. వయసు ఉడిగిపోయి, కష్టపడలేని సమయంలో నిన్ను ఇలా విడవడం నాకు భావ్యం కాదు. నిన్ను ఒక్కదాన్నీ విడిచిపెట్టి నేను ఎలా సంతోషంగా ఉండగలను? నీతోనే నా పయనం, నా జీవనం. నీ దేవుడే నా దేవుడు" అని చెప్పింది.

అలా అత్తగారితోనే ఉండిపోయిన రూతు... క్రమంగా అత్త కొలిచే దేవుణ్ణి ఇష్టపడింది. నయోమిని తన తల్లిలా ప్రేమించింది. నయోమి కూడా తన కోడలు గురించి, ఆమె భవిష్యత్తు గురించి ఆలోచించడం మొదలుపెట్టింది.

బెత్లెహేముకు తిరిగి వచ్చిన తరువాత... తన దగ్గర బంధువైన బోయజు అనే పెద్ద భూస్వామి పొలంలో పరిగె ఏరుకోవడానికి రూతును నయోమి పంపింది. రూతు అందం,



అత్తాకోడళ్ళకు సరిపడదనేది లోకంలో స్థిరపడిన సాధారణమైన అభిప్రాయం. అందుకు భిన్నంగా... 'అత్తా కోడళ్ళంటే ఇలా ఉండాలి' అనేలా నయోమి, రూతు దర్శనమిస్తారు. కోడలిలో అత్తకు బాధ్యత కలిగిన కుమార్తె కనిపిస్తే, కోడలికి అత్తలో ప్రేమమయి అయిన తల్లి గొంతు వినిపిస్తుంది.

వినయం, అత్తగారికి చేసే సేవలు చూసి మనసు పడిన బోయజు... ఆమెను తన భార్యగా స్వీకరించాడు. వారికి ఒక కుమారుడు. ఆ రూతు... క్రీస్తు వంశానికి పూర్వీకురాలు. ఆ అత్తాకోడళ్ళ మధ్య ప్రగాఢంగా అల్లుకుపోయిన బంధాలు ప్రతి కుటుంబంలో నెలకొనవలసిన విలువైన ఆదర్శంగా ఎప్పటికీ నిలుస్తాయి.


• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

జెన్ కథ

మూర్ఖ శిఖామణి

జపాన్‌లో ఒక గొప్ప జెన్ గురువు ఉండేవాడు. అతని పేరు ర్యోకాన్. అందరూ 'మూర్ఖ శిఖామణి' అని పిలిచేవారు. ర్యోకాన్ వింత ప్రవర్తనే దానికి కారణం. కానీ అతను సామాన్యమైన గురువు కాదు. ఎందరికో అతీంద్రియానుభవాన్ని కలిగేలా చేసిన మహనీయుడు. ర్యోకాన్ చాలా చిన్న వయసులోనే ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. కొషోజీ ఆలయంలో ఏకాంతంగా గడిపేవాడు.

ఒక రోజు కోకుసెన్ అనే గురువు ఆ ఆలయానికి వచ్చాడు. ఆయనలో ఏదో శక్తి ర్యోకాన్‌ను ఆకర్షించింది. ఆయనకు ఇతను శిష్యుడయ్యాడు. ఆయన వెంట ఎట్సుంజీ మఠానికి వెళ్ళి... అక్కడ ధ్యానంలో గడిపేవాడు. కొన్నేళ్ళకు కోకుసెన్ మరణించాడు. ఆలయంలో పూజారిగా ఉండడం ర్యోకాన్‌కు ఎప్పుడూ ఇష్టం లేదు. కాబట్టి తనకు నచ్చిన విధంగా, నచ్చిన చోట ఉండాలని నిర్ణయించుకొని... తీర్థయాత్రలు చేశాడు. కవితలు రాస్తూ, పిల్లలతో ఆడుతూ, పాడుతూ గడిపేవాడు. జెన్ సన్యాసులు సాధారణంగా మాంసం తినేవారు కాదు. కానీ ఎవరైనా చేపలను వడ్డిస్తే ర్యోకాన్ హాయిగా తినేవాడు. "నేను చేపలను తింటాను. ఈగలకు, దోమలకు నా దేహాన్ని విందు భోజనం కింద ఆనందంగా సమర్పిస్తాను" అంటూ ఉండేవాడు. పండుగల్లో మహిళలు మాత్రమే పాల్గొనే కార్యక్రమాలు కొన్ని ఉండేవి. ర్యోకాన్ స్త్రీ వేషధారణలో వెళ్ళి ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవాడు.



అతని కుటీరానికి ఒక రోజు రాత్రి ఒక దొంగ వచ్చాడు. ఏదీ దొరక్క, అతను వెళ్ళి పోతూ ఉంటే... రోకాన్ అతన్ని ఆపాడు. "ఉత్త చేతులతో నా ఇంటి అతిథి వెళ్ళరాదు. ఇదిగో! నా వస్త్రాన్ని తీసుకువెళ్ళు" అంటూ తాను కట్టుకున్న వస్త్రాన్ని అతనికి ఇచ్చేశాడు. దిగంబరంగా కూర్చొని ఆకాశంలో చంద్రుణ్ణి చూస్తూ పరవశించిపోయాడు. ఎప్పుడూ ఏకాంతంగా నడుస్తూ, హృదయం నుంచి పొంగి పొరలే కవితల్ని వర్షిస్తూ హాయిగా గడిపే ర్యోకాన్‌కు శిష్యులంటూ ఎవరూ ఉండేవారు కాదు. కానీ ఎందరో ఆయననుంచి ప్రేరణ పొంది ధ్యానం చేసేవారు. ధ్యానంలో అత్యున్నత శిఖరాలను అందుకొనేవారు. ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమైన ర్యోకాన్ లౌకిక విషయాలను ఎలాంటి క్రమం లేకుండా అనుసరించేవాడు. చెప్పులను తలమీద పెట్టుకొనేవాడు. వస్త్రం లేకుండా వీధుల్లో నడిచేవాడు. తలపైన ఉండవలసిన టోపీని కాలికి తగిలించుకొనేవాడు. తనలోతాను నవ్వుకొనేవాడు. ఇదంతా గమనించిన ప్రజలు అతణ్ణి 'మూర్ఖ శిఖామణి' అంటూ వ్యవహరించేవారు. ఒక గ్రామంలో ర్యోకాన్‌ని దొంగగా భావించిన ప్రజలు అతణ్ణి సజీవంగా పాతి పెట్టారు. ర్యోకాన్‌తో పరిచయం ఉన్న టైషన్ అనే సన్యాసిని ఈ వివరాలను లోకానికి వెల్లడిస్తూ... ఆయనను జ్ఞాన శిఖామణిగా కీర్తించింది.

• రాచమడుగు శ్రీనివాసులు


A M RATHNAM
PRESENTS
MEGA SURYA PRODUCTION
BATTLE FOR DHARMA
PAWAN KALYAN
IN & AS
హరిహర
వీరమల్లు
PART-1 SWORD vs SPIRIT
STORMING
IN CINEMAS
24TH
JULY
2025
WORLDWIDE
JYOTHI KRISNA · KRISH JAGARLAMUDI
PRODUCED BY A DAYAKAR RAO
AN MM KEERAVAANI MUSICAL
TELUGU · HINDI · TAMIL · KANNADA · MALAYALAM


SK
PICTURES
మై బేబి
DNA
2025
నేడే
విడుదల
359+
SCREENS
PRODUCER
SURESH KONDETI
WRITTEN & DIRECTED BY
NELSON VENKATESAN


RANA DAGGUBATI
PRESENTS
కొత్తపల్లిలో ఒకప్పుడు...
నేడే
విడుదల
DIRECTED BY
PRAVEENA PARUCHURI


ADITYA
MUSIC
నేడే
విడుదల
పోలీస్ వారి హెచ్చరిక
PRODUCER
BELLI JANARDHAN
WRITTEN & DIRECTED BY
BABJI


నేడే విడుదల
SAI SIVANI PRESENTS
Vaaraahi
Chalana Chitram
DSP
KIREETI
JUNIOR
కన్నడ | తెలుగు


ADITYA CHOPRA PRESENTS
AHAAN PANDAY & ANEET PADDA
IN CINEMAS
TODAY
YASH RAJ FILMS
SAIYAARA
DIRECTED BY MOHIT SURI
PRODUCED BY AKSHAYE WIDHANI
WWW.YASHRAJFILMS.COM
WATCH WITH ENGLISH SUBTITLES
a yash raj films worldwide release

కార్మిక రాజ్య బీమా సంస్థ

(కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)

ప్రాంతీయ కార్యాలయం: తెలంగాణ, 5-9-23, హిల్‌ఫోర్ట్ రోడ్, ఆదర్శనగర్, హైదరాబాద్-500 063

ఫోన్: 040-23232357/58/59, ఇ-మెయిల్ ఐడి: ins4.ts@esic.nic.in

ప్రకటన

జారీచేయబడిన C18 అడ్‌హాక్ మరియు D-18 నోటీసులపై ఇవ్వబడిన తేది న వ్యక్తిగత విచారణ కోసం సంబంధిత అధీకృత అధికారి సమక్షంలో అన్ని సంబంధిత డాక్యుమెంట్లు/ రికార్డులతో వ్యక్తిగత విచారణకు హాజరు కావాలని దిగువ పేర్కొన్న యజమానికి ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

క్ర. సం.	యజమాని కోడ్	ఫ్యాక్టరీ/Estt. పేరు & చిరునామా	యజమాని పేరు & చిరునామా	ప్రకటన తేది	ఎగవేత కాలం	కాంట్రిబ్యూషన్‌ల క్లెయిమ్ మొత్తం
1	52000707520001002	ఆదిత్య నరసింహా ఫార్మసి ప్రైవేట్ లిమిటెడ్ :ప్లాట్ నం.7, ప్లాట్ నం.101,సర్వే నెం.90&91, పుప్పాలగూడ, రాజేంద్రనగర్ మండలం, హైదరాబాద్-500089	శ్రీ/శ్రీమతి లీలాకృష్ణ పెనుమెత్స, ప్లాట్ నం.7 పుప్పాలగూడ, రాజేంద్రనగర్ హైదరాబాద్-500089	సి-18 అడ్‌హాక్ తేది:02.05.2023 & Adj. PH లెటర్, తేది 04.12.2024	డిసెంబర్-18 నుండి సెప్టెంబర్-20	రూ.292446/-
2	52000631830000699	కివి ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ 1239/ఎల్/30, ప్లాట్‌నం.30, నాగు నిలయం, లేక్ వ్యూ కాలనీ, హైదరాబాద్, 500072, మొబైల్ నం.9666539111	ఎంవి. శ్రీనివాసరావు ప్లాట్ నం.30, నాగు నిలయం, లేక్ వ్యూ కాలనీ,హైదర్‌నగర్, హైదరాబాద్, 500072.	సి-18 అడ్‌హాక్ తేది:16.04.2020	డిసెంబర్-18 నుండి జూన్-20	రూ.1,07,993/-
3	52000622780001015	మెస్సర్ వెస్ట్ వ్యూ మ్యాక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్లాట్ నం.104,1వ అంతస్తు, ప్లాట్ నం. 3,3ఎ,4&5, గాయత్రి హైట్స్, జూబ్లీ ఎన్‌క్లేవ్ హైటెక్‌సిటీ, హైదరాబాద్, 500081, మొబైల్ నం. 8328059539	శ్రీ/శ్రీమతి సురేఖ వేమూరి ఇ.నం.8-3-1-43 ప్లాట్ నం.142, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్-500073	సి-18 అడ్‌హాక్ తేది:16.08.2022 Resch 1st PH లెటర్, తేది:04.12.2024	జూన్-17 నుండి మార్చి-22	రూ.3,40,148/-
4	52000632080000606	మెస్సర్స్ ఆర్ఎంఎస్ టెక్నాలజీస్ 5-5-32/267ఎ, ప్రశాంతినగర్, శక్తిపురం, కూకట్‌పల్లి, హైదరాబాద్, 500072.మొబైల్ నం. 9949215612	శ్రీ/శ్రీమతి పి.రవి కిరణ్ 5-5-32/267ఎ, ప్రశాంతినగర్, శక్తిపురం, కూకట్‌పల్లి, హైదరాబాద్, 500072.	సి-18 అడ్‌హాక్ తేది:23.04.2024	ఏప్రిల్-19 నుండి సెప్టెంబర్-23	రూ.2,58,143/-
5	52000547370000699	"మెస్సర్స్ విఫ్లెక్స్ ఇంజనీర్స్ 8-3-166/6&7, ప్లాట్ నం.9, భవ్యశ్రీ ఆర్కేడ్, ఎర్రగడ్డ, హైదరాబాద్-500018, (మొబైల్ నం.9959075584)"	"శ్రీ తిలక్ బాబు నిమ్మలూరి, తండ్రి ధర్మారావు నిమ్మలూరి 13-4-85, వి రామారావునగర్, బాలానగర్,రంగారెడ్డి-500018"	సి-18 అడ్‌హాక్ తేది:27.06.2022	డిసెంబర్-18 నుండి సెప్టెంబర్-21	రూ.35,459/-
6	52000558630001101	మెస్సర్స్ ది గ్రాండ్ ట్రంక్ రోడ్ హాస్పిటాలిటీ, ఎల్ఎల్‌పి, సర్వే నెం.11/16, ప్లాట్ నం.44&45,ఇమేజ్ గార్డెన్ రోడ్, మాదాపూర్, హైదరాబాద్-500081	శ్రీ జతిన్ కన్నా, బ్లాక్ నం. సి-802, ఫార్చ్యూన్ టవర్స్, మాదాపూర్, హైదరాబాద్-500081.	సి-18 అడ్‌హాక్ తేది:27.01.2025	ఏప్రిల్-20 నుండి అక్టోబర్-20	రూ.38,309/-
7	52000548320000606	మెస్సర్స్ థీరిస్ MOS ఇంజనీరింగ్ ప్లాట్ నం.53, రాజీవ్‌గాంధీనగర్, ప్రశాంతినగర్ ఇండస్ట్రియల్ ఎక్స్‌టెన్షన్, ఆంధ్రజ్యోతి సమీపాన కూకట్‌పల్లి,హైదరాబాద్-500072	శ్రీ సోమస్ నారాయణ్, 1-31-853, ప్లాట్ నం.84, కృష్ణ ఎన్‌క్లేవ్, డెయిరీ ఫామ్ రోడ్, బోయిన్‌పల్లి, హైదరాబాద్-500011	సి-18 అడ్‌హాక్ తేది:04.12.2020	ఏప్రిల్-16 నుండి సెప్టెంబర్-20	రూ.3,42,788/-
8	52000549520001000	మెస్సర్స్ ఏ1 ఎంటర్‌ప్రైజెస్ ఇ.నం.3-1-52, జమల బస్తీ, నింబోలిఅడ్డ, కాచిగూడ, హైదరాబాద్, తెలంగాణ-500027 (మొబైల్ నం.8121927840)	శ్రీ మాలే నరేష్ 2-4-628/24/4,సుందర్‌నగర్ కాచిగూడ, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500027 (మొబైల్ నం.8121927840)	సి-18 అడ్‌హాక్ తేది:18.08.2022	మార్చి-19 నుండి సెప్టెంబర్-21	రూ.1,41,709/-
9	52000540830000999	మెస్సర్స్ WILLAEGIS , ఇ.నం.1-5-62/8ఎ శోభన నగర్, వీధి నం.8,హబ్సిగూడ, హైదరాబాద్-500007	శ్రీ నిమ్మ శ్రీనివాస్ 2-8-37, భరత్‌నగర్, ఉప్పల్ హైదరాబాద్-500039	సి-18 అడ్‌హాక్ తేది:31.12.2020	ఆగస్టు-16 నుండి అక్టోబర్-20	రూ.7,82,298/-
10	52000554530000999	మెస్సర్స్ ఇండిటేర్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ప్లాట్ నం.60, ఖానామెట్ ఇజ్జత్‌నగర్, కొండాపూర్, హైదరాబాద్-500084 (మొబైల్ నం.9666499241)	శ్రీమతి బోయలపల్లి కుమారి తండ్రి శ్రీ కుమ్మ సుబ్బయ్య 12/339, సత్యనారాయణపేట, గుంతకల్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్-515801	సి-18 అడ్‌హాక్ తేది:16.08.2022	జనవరి-19 నుండి మార్చి-22	రూ.2,76,507/-
11	52000544810000699	మెస్సర్స్ సేవా టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 8-2-268/ఏ 16-19/102, రోడ్ నం.2, మహాలక్ష్మి నివాస్, వివేకానంద ఎన్‌క్లేవ్, బంజారాహిల్స్, హైదరాబాద్-500034	శ్రీ హర్షవర్ధన్ రెడ్డి పులిమి, తండ్రి వెంకటకృష్ణారెడ్డి పులిమి 14-175, మేదర వీధి, అమ్మికూర్ నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ -524322 (మొబైల్ 9912338511)	సి-18 అడ్‌హాక్ తేది:28.02.2023	నవంబర్-17 నుండి మార్చి-22	రూ.1,81,566/-
12	52000551570000999	మెస్సర్స్ ఆర్ దేవేందర్ & సన్స్ 5-9-707, ఆబిడ్స్, గన్‌ఫౌండ్రి, నాంపల్లి, హైదరాబాద్-500001 (మొబైల్ 9959416985)	శ్రీ రాళ్ళబండి దేవేందర్ తండ్రి శ్రీ రాజమల్లయ్య 5-9-707,ఆబిడ్స్, గన్‌ఫౌండ్రి, నాంపల్లి,హైదరాబాద్-500001 (మొబైల్ 9959416985)	సి-18 అడ్‌హాక్ తేది:04.03.2022	మార్చి-20 నుండి ఫిబ్రవరి-21	రూ.2,59,831/-
13	52000601040001401	మెస్సర్స్ గురురాయ హాస్పిటల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నం.53/GF/FF/SF, సాయిమాలిని కాలనీ, తోకట్ట బోయిన్‌పల్లి హైదరాబాద్-500011 (మొబైల్ 98484 62247)	శ్రీ/శ్రీమతి పద్మ మాలిని హసగోడు ప్లాట్ నం.ఎ-1, అర్జున్ అపార్ట్‌మెంట్స్ మాలిని హౌజింగ్ కాలనీ, చిన్న తోకట్ట సికింద్రాబాద్-500011 (మొబైల్ 98484 62247)	సి-18 అడ్‌హాక్ తేది:01.05.2022	మార్చి-17 నుండి సెప్టెంబర్-21	రూ.6,69,900/-
14	52000551100001401	మెస్సర్స్ శ్రీసాయి హాస్పిటల్ (చిల్డ్రన్ & జనరల్), 17-1-397/బి/213/1, సరస్వతినగర్, సైదాబాద్, హైదరాబాద్-59 (మొబైల్ నం. 9000525530)	డా.యు బుచ్చాచారి, తండ్రి యు.రాములు,5-5-2/207 టెలిఫోన్ కాలనీ,బోడుప్పల్ రంగారెడ్డి జిల్లా-500092	సి-18 అడ్‌హాక్ తేది:29.04.2024	ఫిబ్రవరి-19 నుండి డిసెంబర్-20	రూ.72,419/-
15	52000618370000899	మెస్సర్స్ Asha Signs ఇ.నం.42/736/6, ఎస్పీనగర్, ఆగాహిల్ కాలనీ, మౌలాలి, హైదరాబాద్, రంగారెడ్డి, తెలంగాణ-500040	శ్రీ షెఫివుర్ రెహమాన్, రోడ్ నం.5ఎల్, కృష్ణానగర్‌కాలనీ, మౌలాలి, హైదరాబాద్-500040, మొబైల్ నం.9848036217	సి-18 అడ్‌హాక్ తేది:28.01.2022	మార్చి-17 నుండి సెప్టెంబర్-21	రూ.3,27,685/-
16	52000684980000799	మెస్సర్స్ కాసా అసోసియేట్స్ ఎల్ఎల్‌పి 8-2-472/బి/1, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-500034	శ్రీ/శ్రీమతి శివశంకర్ పాల్లే 3-3-500/1, రంగ్‌గ్రాజ్ బజార్ జైన్ టెంపుల్ ప్రక్కన సికింద్రాబాద్ -500003	సి-18 అడ్‌హాక్ తేది:29.03.2022	మే-19 నుండి సెప్టెంబర్-21	రూ.1,81,682/-
17	52000682600000999	మెస్సర్స్ సన్‌షైన్ పవర్ సొల్యూషన్స్ 11-7-50, సి103, స్నేహ నిలయం, హుడాకాలనీ, సరూర్‌నగర్, ఇ-సేవా ప్రక్కన సరూర్‌నగర్,హైదరాబాద్-500035	శ్రీ గుర్రం గిరీష్ కుమార్, 1-117, కొండాపురం, కొండాపురం-516444	సి-18 అడ్‌హాక్ తేది:28.05.2022	జూలై-18 నుండి సెప్టెంబర్-21	రూ.2,14,830/-
18	52000582330000704	మెస్సర్స్ పి ఎల్ ఎస్ ట్రావెల్స్, ప్లాట్ నం.634, ప్రగతినగర్ రోడ్, జెయన్‌టీయూ రోడ్ ఎదురుగా, కూకట్‌పల్లి, మేడ్చల్-మల్కాజిగిరి, తెలంగాణ-500072	శ్రీ పి.వెంకటేశ్వరరావు, ప్లాట్ నం.634, ప్రగతినగర్ రోడ్, జెయన్‌టీయూ రోడ్ ఎదురుగా, కూకట్‌పల్లి ,మేడ్చల్-మల్కాజిగిరి, తెలంగాణ-500072	సి-18 అడ్‌హాక్ తేది:07.12.2021	ఫిబ్రవరి-17 నుండి మార్చి-21	రూ.3,14,470/-
19	52000619060001302	మెస్సర్స్ వైష్ణవి ఎడ్యుకేషనల్ సొసైటీ పాత ఆర్టీవో ఆఫీస్, నయీంనగర్, హన్మకొండ -506009, మొబైల్ నం.9849763026	శ్రీ ప్రవీణ్ కుమార్, C/o గురుదత్ కాన్సెప్ట్ స్కూల్, ఎల్లాపూర్, హసన్‌పర్తి, వరంగల్-506731	సి-18 అడ్‌హాక్ తేది:04.12.2021	మార్చి-17 నుండి మార్చి-21	రూ.3,07,230/-
20	52000616470001303	మెస్సర్స్ ఓరుగల్లు డిగ్రీ కాలేజ్ మెయిన్ రోడ్, ఎన్‌కూర్, ఖమ్మం-507168 మొబైల్ నం.9247261179	శ్రీ బి సురేంద్ర రెడ్డి మెస్సర్స్ ఓరుగల్లు డిగ్రీ కాలేజ్ మెయిన్ రోడ్, ఎన్‌కూర్, ఖమ్మం-507168 మొబైల్ నం.9247261179	సి-18 అడ్‌హాక్ తేది:28.01.2022	మార్చి-17 నుండి సెప్టెంబర్-21	రూ.3,27,685/-
21	52000698740001019	మెస్సర్స్ జై మా దుర్గ ఎంటర్‌ప్రైజెస్ ఇస్నాపూర్ క్రాస్ రోడ్, పటాన్‌చెరు, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500017	శ్రీ/శ్రీమతి సంజుక్త బెహ్రా ఇస్నాపూర్ క్రాస్ రోడ్,పటాన్‌చెరు, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500017	1.సి-18 అడ్‌హాక్ తేది:01.02.2024 2.సి-18 అడ్‌హాక్ తేది:01.02.2024	1.డిసెంబర్-22 నుండి మార్చి-23 2.సెప్టెంబర్-2020	1.రూ.2,66,677/- 2.రూ.2,57,145/-
22	52000685860000999	మెస్సర్స్ ఆరెజె ఎంటర్‌ప్రైజెస్ ఇ.నం.101, ఇస్నాపూర్, పటాన్‌చెరు, హైదరాబాద్-502319	శ్రీ/శ్రీమతి రాజ్‌కుమార్ షా ఇ.నం.101, ఇస్నాపూర్, పటాన్‌చెరు,హైదరాబాద్ -502319	1.సి-18 అడ్‌హాక్ తేది:22.09.2023 2.సి-18 అడ్‌హాక్ తేది:22.09.2023	1.జూన్-2020 2.సెప్టెంబర్-2021	1.రూ.3,41,880/- 2.రూ.2,39,732/-
23	52000615710001302	మెస్సర్స్ లక్ష్మీరామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఇ.నం.1-6-141/7/3/సి, విద్యానగర్, సూర్యాపేట-508213 మొబైల్ నం.8331839903	శ్రీ కె.సంతోష్ కుమార్ ప్లాట్ నం.101, మారుతీ టవర్ తిరుమలనగర్, సూర్యాపేట-508213. మొబైల్ నం.8331839903	సి-18 అడ్‌హాక్ తేది:13.12.2022	ఆగస్టు-17 నుండి మార్చి-22	రూ.3,25,133/-
24	52000588390000606	మెస్సర్స్ లక్ష్మి కన్‌స్ట్రక్షన్స్, ప్లాట్ నం.371/ఎ బ్లాక్ నం.15, పిహెచ్ 1, జనప్రియ అపార్ట్‌మెంట్స్ మియాపూర్-500049 (మొబైల్ నం. 7330973307)	శ్రీ చదలవాడ వెంకటసుబ్బారావు ప్లాట్ నం.371/ఎ, బ్లాక్ నం.15, పిహెచ్ 1, జనప్రియ అపార్ట్‌మెంట్స్, మియాపూర్ -500049 (మొబైల్ నం.7330973307)	సి-18 అడ్‌హాక్ తేది:12.02.2024	ఏప్రిల్-19 నుండి సెప్టెంబర్-23	రూ.25,815/-
25	52000618940001303	మెస్సర్స్ మదీన డిగ్రీ కాలేజ్, చర్చి రోడ్, కస్బాబజార్, కస్బా కాలనీ, ప్రకాష్‌నగర్ ఖమ్మం, తెలంగాణ-507001	శ్రీ వి.అశోక్ రెడ్డి C/o (మెస్సర్స్ మదీన డిగ్రీ కాలేజ్, చర్చి రోడ్, కస్బాబజార్, కస్బా కాలనీ, ప్రకాష్‌నగర్, ఖమ్మం, తెలంగాణ-507001)	సి-18 అడ్‌హాక్ తేది:24.02.2022	మార్చి-17 నుండి సెప్టెంబర్-21	రూ.4,19,951/-
26	52000592610000999	మెస్సర్స్ శ్రీరామ ఫ్యాబ్రికేషన్స్ వర్క్స్, జీడిమెట్ల, గాజులరామారం, ఇ.నం. 24-1026, ఉషా ముల్లపూడి హాస్పిటల్ దగ్గర, ప్రకాశం పంతులు నగర్, గాజులరామారం, ఐడిఎ, జీడిమెట్ల, రంగారెడ్డి, తెలంగాణ, 500055	శ్రీ బోను రవికుమార్ C/o (మెస్సర్స్ శ్రీరామ ఫ్యాబ్రికేషన్స్ వర్క్స్, జీడిమెట్ల, గాజులరామారం, ఇ.నం. 24-1026, ఉషా ముల్లపూడి హాస్పిటల్ దగ్గర, ప్రకాశం పంతులు నగర్, గాజులరామారం, ఐడిఎ, జీడిమెట్ల రంగారెడ్డి, తెలంగాణ,500055	సి-18 అడ్‌హాక్ తేది:03.08.2022	జూన్-17 నుండి, మార్చి-21	రూ.2,84,708/-
27	52000583230000704	మెస్సర్స్ సన్‌రైజెస్ లాజిస్టిక్స్ 6-6, హెచ్‌ఐజి, భాగ్యలక్ష్మికాలనీ, మణికొండ హైదరాబాద్-500089	శ్రీ బోయిని కిరణ్‌కుమార్ 19-4-96-1,స్టేషన్ రోడ్ కాలనీ బెల్లంపల్లి, ఆదిలాబాద్-504251	సి-18 అడ్‌హాక్ తేది:03.02.2022	ఫిబ్రవరి-17 నుండి మార్చి-21	రూ.3,13,129/-
28	52000607580001303	మెస్సర్స్ సాధన డిగ్రీ కాలేజ్, సర్వే నం.11/12, చేగుంట, చేగుంట బస్టాప్ దగ్గర, చేగుంట-502248, మొబైల్ నం. 9010 87 2864 మెస్సర్స్ సాధన డిగ్రీ కాలేజ్, ఇ.నం.5-88/1,చేగుంట మెయిన్ రోడ్ చేగుంట, మెదక్-502248 మొబైల్ నం. 94409 65990	శ్రీ రావర్ల అశోక్ కుమార్ శంకరంపేట, గ్రా& మండలం సూరారం, మెదక్-502248, మొబైల్ నం. 9010 87 2864	సి-18 అడ్‌హాక్ తేది:13.12.2021	మార్చి-17 నుండి మార్చి-21	రూ.3,07,230/-
29	52000546710000799	మెస్సర్స్ గౌతమ బుద్ధ పర్సనల్ మేనేజ్‌మెంట్ & అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్లాట్ నం.102, ప్లాట్ నం.13,సాయిమారుతీ రెసిడెన్సీ,రోడ్ నం.2, శ్రీనివాసకాలనీ, ఎల్బీనగర్, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా -500074 (మొబైల్ నం.9949484567)	శ్రీ ఎంఎస్ భూక్య ప్లాట్ నం.102, ప్లాట్ నం.13, సాయి మారుతీ ,రెసిడెన్సీ, రోడ్ నం.2, శ్రీనివాస కాలనీ, ఎల్బీనగర్, సరూర్‌నగర్, రంగారెడ్డి జిల్లా -500074 (మొబైల్ నం.9949484567)	సి-18 అడ్‌హాక్ తేది:29.03.2022	జనవరి-17 నుండి సెప్టెంబర్-21	రూ.6,99,930/-
30	52000607780001301	మెస్సర్స్ స్వాతి విద్యానికేతన్ బీరప్పనగర్, జగద్గిరిగుట్ట, హైదరాబాద్ -500037, (మొబైల్ నం.98488 28953)	శ్రీ పి.రామమోహన్‌రావు ఇ.నం.41-257, సంజయ్‌పురి జగద్గిరిగుట్ట, హైదరాబాద్ - 500037, (మొబైల్ నం. 98488 28953)	సి-18 అడ్‌హాక్ తేది:10.05.2022	జూలై-17 నుండి డిసెంబర్-19 & ఫిబ్రవరి-20 నుండి సెప్టెంబర్-21	రూ.3,07,808/-
31	52000609960001017	మెస్సర్స్ పాకెట్ కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈస్ట్ ఎవేన్యూ బిల్డింగ్, 3వ అంతస్తు, అయ్యప్ప సొసైటీ, మాదాపూర్-500081 మెస్సర్స్ పాకెట్ కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్ 4వ అంతస్తు, ఏ బ్లాక్ అప్‌టౌన్,సైబరాబాద్ అయ్యప్ప సొసైటీ, మాదాపూర్,హైదరాబాద్-500081 (మొబైల్ నం.81060 34000)	శ్రీ కొర్ర సంజయ్ C/o మెస్సర్స్ పాకెట్ కామర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈస్ట్ ఎవేన్యూ బిల్డింగ్, 3వ అంతస్తు, అయ్యప్ప సొసైటీ, మాదాపూర్-500081	సి-18 అడ్‌హాక్ తేది:04.12.2021	మార్చి-17 నుండి మార్చి-21	రూ.3,06,988/-
32	52000546710000799	మెస్సర్స్ ఓం శ్రీ స్వప్నసాయి ట్రావెల్స్ డి.నం.2-97/1/101, ప్లాట్ నం.1, ప్రశాంతి నిలయం, చైతన్యపురి, సరూర్‌నగర్ రంగారెడ్డి-500060	శ్రీ అత్ర వెంకటేష్ డి.నం.2-97/1/101, ప్లాట్ నం.1, ప్రశాంతి నిలయం, చైతన్యపురి, సరూర్‌నగర్, రంగారెడ్డి-500060	సి-18 అడ్‌హాక్ తేది:26.05.2021	మార్చి-16 నుండి జనవరి-21	రూ.3,62,652/-
33	52000608190001302	మెస్సర్స్ నవజ్యోతి హైస్కూల్ వాసవినగర్, గజ్వేల్, మెదక్-502278 మొబైల్ నం.9440 08 0581	శ్రీ/శ్రీమతి వి చెర్రిసాబు C/o మెస్సర్స్ నవజ్యోతి హైస్కూల్ వాసవినగర్, గజ్వేల్, మెదక్-502278.మొబైల్ నం. 9440 08 0581	సి-18 అడ్‌హాక్ తేది:13.12.2021	మార్చి-17 నుండి మార్చి-21	రూ.3,07,230/-
34	52000606440001302	మెస్సర్స్ జీనియస్ గ్రామర్ హైస్కూల్ షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్ మండలం, రంగారెడ్డి-509216	శ్రీ/శ్రీమతి కె బాలు ప్లాట్ నం.4, హస్తినాపురం, సాగర్ రోడ్, ఎల్బీనగర్,రంగారెడ్డి 500074	సి-18 అడ్‌హాక్ తేది:10.05.2022	మార్చి-17 నుండి సెప్టెంబర్-21	రూ.3,28,170/-
35	52000652550001019	మెస్సర్స్ కె రవీంద్ర రెడ్డి ఇ.నం.5-1-962,గౌలిగూడ, పుత్లిబౌలి హైదరాబాద్, తెలంగాణ-500012	శ్రీ/శ్రీమతి కె రవీంద్ర రెడ్డి ఇ.నం.5-1-962, గౌలిగూడ, పుత్లిబౌలి,హైదరాబాద్ తెలంగాణ 500012	సి-18 అడ్‌హాక్ తేది:03.02.2022	మే-19 నుండి సెప్టెంబర్-20	రూ.79,268/-
36	52000657540000799	మెస్సర్స్ దేవిదత్ బ్రహ్మాండపల్లి ఇ.నం.1-4-289/1, మార్కెట్ రోడ్ సూర్యపేట-508213	శ్రీ/శ్రీమతి దేవిదత్ బ్రహ్మాండపల్లి ఇ.నం.1-4-289/1, మార్కెట్ రోడ్, సూర్యపేట-508213	సి-18 అడ్‌హాక్ తేది:28.02.2023	డిసెంబర్-17 నుండి సెప్టెంబర్-22	రూ.3,22,823/-
37	52000583090000999	మెస్సర్స్ సింధుస్తాన్ సెక్యూరిటీ పవర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, 32-345, షాపూర్‌నగర్, ఐడిఎ జీడిమెట్ల, హైదరాబాద్ - 500055	శ్రీ/శ్రీమతి ఎ జనార్ధన్ గుప్తా 2-315,షాపూర్‌నగర్, న్యూ శ్రద్ధా స్కూల్ ఎదురుగా, కుత్బుల్లాపూర్-500055	సి-18 అడ్‌హాక్ తేది:10.09.2021	జూలై-20 నుండి సెప్టెంబర్-20 మరియు ఫిబ్రవరి-21 నుండి మార్చి-21	రూ.36036/-
38	52000649030000999	మెస్సర్స్ స్వాతి ఏజెన్సీ ఇ.నం.8-46, శ్రీరాంపూర్, పెద్దపల్లి, కరీంనగర్, తెలంగాణ-505172	శ్రీ/శ్రీమతి ప్రసాద్ సాలిగంటి ఇ.నం.8-46, శ్రీరాంపూర్,పెద్దపల్లి, కరీంనగర్, తెలంగాణ-505172	సి-18 అడ్‌హాక్ తేది:13.12.2022	నవంబర్-2017 నుండి మార్చి-2022	రూ.302610/-
39	52000626690000606	మెస్సర్స్ చరణ్ ఇండస్ట్రీస్ 4-6-137/ఇ/19, సాయినగర్ (తూర్పు), ఆల్విన్ కాలనీ, కూకట్‌పల్లి, రంగారెడ్డి జిల్లా హైదరాబాద్-500072, తెలంగాణ	శ్రీ/శ్రీమతి హెచ్ ప్రైమండ్ 4-6-137/ఇ/19, సాయినగర్ ఆల్విన్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072	సి-18 అడ్‌హాక్ తేది:18.08.2022	జూలై-2017 నుండి మార్చి-2022	రూ.332640/-
40	52000626520001102	మెస్సర్స్ సదానందబాబు క్యాంటీన్ కాంట్రాక్టర్ C/o ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, నాదర్‌గుల్, సరూర్‌నగర్ మండలం, హైదరాబాద్-501510	శ్రీ/శ్రీమతి బి.సదానందబాబు బి-50, ఎన్జీవో కాలనీ, వనస్థలిపురం, హైదరాబాద్-500070	సి-18 అడ్‌హాక్ తేది:13.12.2022	సెప్టెంబర్-2017 నుండి మార్చి-2022	రూ.317625/-
41	52000627070000799	మెస్సర్స్ శ్రీ విఘ్నేశ్వర అసోసియేట్స్ ప్లాట్ నం.106, ఇ.నం.2-2-64/ఎ, మరియు బి, గంగా గోల్డెన్ టవర్స్, 201, అంబర్‌పేట్, హైదరాబాద్-500013	కె బాలక్రిషన్ జీ ఇ.నం.2-2-1073/2, ప్లాట్ నం. అమృతసాయి అపార్ట్‌మెంట్స్ అంబర్‌పేట్, హైదరాబాద్-500013	సి-18 అడ్‌హాక్ తేది:20.11.2023	అక్టోబర్-2018 నుండి మార్చి-2023	రూ.2,75,468/-
42	52000627880000199	మెస్సర్స్ ఎస్ఎంబి రిటైల్ మధ్యప్రదేశ్ పంజాగుట్ట, హైదరాబాద్-500082	శ్రీ/శ్రీమతి సాగర్ జట్వాని 5-9-30/1, చందన్‌భవన్, బషీర్‌బాగ్, హైదరాబాద్ -500029	సి-18 అడ్‌హాక్ తేది:10.10.2022	ఆగస్టు-2017 నుండి మార్చి-2022	రూ.520212/-
43	52000627890001009	మెస్సర్స్ దీపక్ ఇంటీరియల్స్ ప్లాట్ నం.109, డి.నం.6 296,1వ అంతస్తు ఎ2 109, సిల్వర్ స్ప్రింగ్స్ అపార్ట్‌మెంట్స్ వెంకటేశ్వరనగర్,చింతల్, కుత్బుల్లాపూర్ హైదరాబాద్-500055	శ్రీ/శ్రీమతి దీపక్ ఛబ్రేచ ప్లాట్ నం.109, డి.నం.6 296, సిల్వర్ స్ప్రింగ్స్ అపార్ట్‌మెంట్స్ కుత్బుల్లాపూర్ హైదరాబాద్	సి-18 అడ్‌హాక్ తేది:10.10.2022	నవంబర్-2018 నుండి సెప్టెంబర్-2023	రూ.916608/-
44	52000629170000999	మెస్సర్స్ విహాన్ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ఇ.నం.11-034, లెనిన్ నగర్ బాలాపూర్, మీర్‌పేట్, సరూర్‌నగర్ -500097	శ్రీ/శ్రీమతి ఎం వినోద్ కుమార్ ఇ.నం.1-35/1,ఎస్సీ కాలనీ, అడ్డకల్ మండలం,మహబూబ్‌నగర్	సి-18 అడ్‌హాక్ తేది:27.10.2022	ఆగస్టు-2017 నుండి మార్చి-2022	రూ.3,25,133/-
45	52000651730001099	మెస్సర్స్ విద్యా లేబర్ కాంట్రాక్టర్ ఇ.నం.3-2/1, చిట్కూల్, పటాన్‌చెరు, సంగారెడ్డి, తెలంగాణ-502307	శ్రీ/శ్రీమతి ఎం విద్య ఇ.నం.3-2/1, చిట్కూల్, పటాన్‌చెరు,సంగారెడ్డి, తెలంగాణ -502307	సి-18 అడ్‌హాక్ తేది:06.01.2023	నవంబర్-2017 నుండి జూలై-2022	రూ.6,42,180/-
46	52000667030000905	మెస్సర్స్ సాయి పరమేష్ ఎలక్ట్రికల్స్ ఇ.నం.1-6-122, నల్లబావి దగ్గర సూర్యపేట-508213	శ్రీ/శ్రీమతి పరమేశ్ పలవరపు ఇ.నం.1-4-249/101/4/4/10/3 బాలాజీనగర్, వార్డు నం.1, సూర్యపేట-508213	సి-18 అడ్‌హాక్ తేది:21.09.2023	ఆగస్టు-2018 నుండి మార్చి-2023	రూ.2,90,483/-
47	52000651720001099	మెస్సర్స్ మల్టీట్యూడ్ 9 ఎఫ్ఎక్స్ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నం.సి7,రోడ్ నం.8 జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, హైదరాబాద్-500096	శ్రీ/శ్రీమతి అకుల లక్ష్మీకాంత్ ప్లాట్ నం.సి7,రోడ్ నం.8 జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, హైదరాబాద్-500096	సి-18 అడ్‌హాక్ తేది:18.08.2022	సెప్టెంబర్-2017 నుండి మార్చి-2022	రూ.3,43,057/-
1	52000549520000999	మెస్సర్స్ ఏ1 ఎంటర్‌ప్రైజెస్ ఇ.నం.3-1-52,జమల బస్తీ, నింబోలిఅడ్డ కాచిగూడ, హైదరాబాద్, తెలంగాణ-500027 (మొబైల్ నం.8121927840)	శ్రీ మాలే నరేష్ 2-4-628/24/4,సుందర్‌నగర్ కాచిగూడ, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500027 (మొబైల్ నం.8121927840)	సి-18 అడ్‌హాక్ తేది:22.08.2022	మార్చి-16 నుండి నవంబర్-20	రూ.71,009/-

- వ్యక్తిగత విచారణ చివరి తేది వార్తాపత్రికలో ప్రచురణ తేదీ నుండి 30 రోజులలోగా.
- సంబంధిత రికార్డులు/దాఖలుతో వ్యక్తిగత విచారణకు హాజరు కావలసిందిగా యజమానులకు సూచించడమైనది. లేనిచో సెక్షన్ 45-A/85-B మరియు తదుపరి C-19/D-19 క్రింద ఈ కార్యాలయంలో లభించే రికార్డుల ప్రకారం ఎక్స్-పార్టీ ఉత్తర్వు జారీచేయబడుతుంది.

సం/- జాదవ్ సంజయ్, డిప్యూటీ డైరెక్టర్

హెచ్‌సీఏ కుంభకోణంలో కవిత, కేటీఆర్ పాత్ర..!

(మొదటిపేజీ తరువాయి)

కట్టబెట్టారని, ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో ఫుడ్ కాంట్రాక్టును కేటీఆర్, కవితకు బంధువైన సురభి క్యాటరర్స్ సంస్థకు ఇచ్చారని, దీని యజమాని జగన్ మోహన్ రావుకు సమీప బంధువని పేర్కొన్నారు. ట్రావెల్, హోటళ్ల బుకింగ్ కాంట్రాక్టులు సైతం ఈ బ్యాచ్‌కే దక్కాయని వివరించారు. బీసీసీఐ నుంచి అందిన రూ.600 కోట్లలో సింహభాగం దుర్వినియోగం అయ్యాయని పేర్కొంటూ.. అప్పటి అధ్యక్షుడు అజారుద్దీన్, సభ్యులు జాన్ మనోజ్, ఆర్.విజయానంద్, పురుషోత్తం అగర్వాల్, సురేందర్ అగర్వాల్‌పైనా విచారణ చేపట్టాలని కోరారు. తాము అందజేస్తున్న ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టులను.. ఇప్పటి వరకు జరిగిన విచారణకు జత చేసి, లోతుగా దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫోర్జరీపై ప్రశ్నల వర్షం

హెచ్‌సీఏ నిధుల గోల్‌మాల్ కేసుకు సంబంధించి ఇప్పటికే అరెస్టు అయిన జగన్‌మోహన్‌రావు బృందాన్ని సీఐడీ అధికారులు గురువారం కస్టడీకి తీసుకున్నారు. శ్రీచక్ర క్లబ్ సభ్యుడినంటూ జగన్‌మోహన్‌రావు సృష్టించిన ఫోర్జరీ డాక్యుమెంట్లు, బీసీసీఐ నుంచి వచ్చిన నిధుల దుర్వినియోగం తదితర అంశాలకు సంబంధించి జగన్ మోహన్ రావును సీఐడీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఎవరి అండదండలతో మీరు హెచ్‌సీఏ అధ్యక్షుడు అయ్యారు? ఫోర్జరీ స్కెచ్ వెనక ఉన్నదెవరు? మీ వెనక బీఆర్ఎస్ పెద్దలు ఎవరున్నారు? అనే కోణంలో విచారించినట్లు తెలుస్తోంది. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గురవారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐడీ.. ఇప్పటి వరకు జగన్‌మోహన్ రావుతో పాటు శ్రీనివాసరావు, సునీల్ కాంతే, రాజేందర్ యాదవ్, కవితను అరెస్టు చేసిన విషయం తెలిసిందే..! వీరిని పది రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ కోర్టును సీఐడీ కోరగా.. ఆరు రోజుల విచారణకు అనుమతి వచ్చింది. దీంతో.. గురువారం ఉదయం చంచల్‌గూడ జైలు నుంచి ఐదుగురు నిందితులను సీఐడీ అదుపులోకి తీసుకుంది. హెచ్‌సీఏ నిబంధనలకు విరుద్ధంగా.. టెండర్లు లేకుండా రూ.కోటికి పైగా విలువ చేసే క్రికెట్ బంతులను ఎందుకు కొనుగోలు చేశారు? వాటి వివరాలను రిజిస్టర్‌లో ఎందుకు నమోదు చేయలేదు? క్రికెట్ బంతులు అందకుండానే డబ్బులను చెల్లించారా? అని వీరిని సీఐడీ ప్రశ్నించినట్లు తెలిసింది. "హైదరాబాద్ సన్ రైజర్స్ నుంచి వేల టికెట్లు ఎందుకు అడిగారు? వాటని ఎవరి ద్వారా అమ్మించాలని అనుకున్నారు? మీరే స్వయంగా విక్రయిద్దామనుకున్నారా?" అని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. పలు ప్రశ్నలకు జగన్‌మోహన్ రావు మౌనంగా ఉన్నట్లు తెలిసింది. ఒకవేళ మాట్లాడినా.. "లేదు.. తెలియదు.. గుర్తులేదు" అనే సమాధానాలు మాత్రమే ఇచ్చినట్లు సమాచారం.

ఈడీ కేసు నమోదు

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు సహా.. ఐదుగురిపై ఈడీ అధికారులు కేసు నమోదు చేశారు. గతంలో హెచ్‌సీఏకి సంబంధించిన కేసు ఉన్నందున.. ఆ కేసుకే తాజా నిందితుల వివరాలను ఈడీ అధికారులు జోడించి కోర్టుకు వివరాలను అందజేశారు. గతంలో హెచ్‌సీఏలో జరిగిన అక్రమాలపై అజారుద్దీన్ తదితరులపై కేసు నమోదైన విషయం తెలిసిందే..! అప్పట్లో ఈడీ అధికారులు ఇద్దరిని అరెస్టు చేశారు. తాజాగా సీఐడీ కేసు నేపథ్యంలో జగన్‌మోహన్ రావు, శ్రీనివాసరావు, సునీల్ కాంతే, రాజేందర్ యాదవ్, కవిత పేర్లను ఈడీ అధికారులు ఈసీఐఆర్‌లో చేర్చారు. ప్రస్తుతం జగన్‌మోహన్ రావు బృందం సీఐడీ కస్టడీలో ఉన్నారు. ఆ కస్టడీ ముగిసిన వెంటనే.. ఈడీ అధికారులు వీరిని కస్టడీకి తీసుకునేందుకు కోర్టు అనుమతిని కోరనున్నట్లు తెలిసింది. ఈడీ వీరిని మనీలాండరింగ్ కోణంలో విచారించనుంది.

దేవరాజ్ పరారీ.. ఇన్‌స్పెక్టర్‌పై వేటు!!

ఉప్పల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): హైసీఏ కేసులో మరో నిందితుడు, హెచ్‌సీఏ ప్రధాన కార్యదర్శి దేవరాజ్ పరారీలో ఉన్న విషయం తెలిసిందే..! ఆయనను అరెస్టు చేసేందుకు సీఐడీ అధికారులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. అయితే.. ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి ఇచ్చిన సమాచారంతోనే దేవరాజ్ పారిపోయినట్లు సీఐడీ అధికారులు గుర్తించారు. దేవరాజ్ కాల్‌లిస్టు ద్వారా ఈ విషయాన్ని గుర్తించారు. దాంతో.. ఎలక్షన్‌రెడ్డిపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది. అయితే.. ఈ నెల 9న ఉప్పల్ స్టేడియం పక్కనే స్థలం వివాదం విషయంలో కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ ధర్నా నిర్వహించారు. గేట్లు మూసివేస్తూ గోడను నిర్మించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో స్టేడియం తరఫున ఎవరూ రాలేదని పేర్కొంటూ.. హెచ్‌సీఏ కార్యదర్శి దేవరాజ్‌కు ఫోన్ చేసినట్లు ఎలక్షన్‌రెడ్డి పేర్కొంటున్నట్లు సమాచారం. అయితే.. ఇన్‌స్పెక్టర్ ఫోన్‌చేయగానే దేవరాజ్ ఫోన్ స్విచ్ఛాఫ్ అవ్వడం, ఆయన అజ్ఞాతంలోకి వెళ్లడం యాదృచ్ఛికమా? లేక ఉద్దేశపూర్వకమా? అనేది తేలాల్సి ఉంది. అప్పటి వరకు ఎలక్షన్‌రెడ్డిని రాచకొండ సీపీ కార్యాలయానికి అటాచ్ చేశారనే ప్రచారం జరుగుతోంది. అయితే.. రాచకొండ కమిషనర్ కార్యాలయం నుంచి దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు. కాగా.. ఆర్నెల్ల క్రితం ఎస్సై శంకర్‌పై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కూడా ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డిని వారం రోజుల పాటు రిజర్వ్‌లో పెట్టారు.

క్రికెట్‌కు రస్సెల్ గుడ్‌బై



22న ఆసీస్‌తో ఆఖరి టీ20

కింగ్‌స్టన్: వెస్టిండీస్ పవర్ హిట్టింగ్ ఆల్‌రౌండర్ ఆండ్రీ రస్సెల్(37) తన 15 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలకనున్నాడు. ఈ నెల 22న సొంత మైదానం సబీనా పార్క్‌లో ఆస్ట్రేలియాతో రెండో టీ20.. రస్సెల్ కెరీర్‌కు చివరిది కానుంది. పొట్టి క్రికెట్‌లో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొన్న రస్సెల్ 2012, 2016 టీ20 వరల్డ్‌కప్‌లు నెగ్గిన వెస్టిండీస్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. 2019 నుంచి రస్సెల్ కేవలం టీ20ల్లో మాత్రమే కనిపిస్తున్నాడు. ఫ్రీలాన్సర్‌గా ప్రపంచ వ్యాప్తంగా ఫ్రాంచైజీ క్రికెట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాడు. 84 టీ20లు, 56 వన్డేలు, ఒక్క టెస్ట్‌లో విండీస్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌కు రస్సెల్ ఎంపియ్యాడు. కానీ, ఈ నెల 20, 22న జరిగే తొలి రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడాలని నిర్ణయించుకొన్నాడు.

అర్జున్ జోడీ సంచలనం

న్యూఢిల్లీ: స్విస్ ఓపెన్‌లో భారత టెన్నిస్ డబుల్స్ జోడీ అర్జున్ ఖాదీ-విజయ్ సుందర్ ప్రశాంత్ సంచలన విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. స్విట్జర్లాండ్‌లో జరుగుతున్న టోర్నీలో పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో అర్జున్-ప్రశాంత్ ద్వయం 6-3, 7-6(5)తో రెండో సీడ్ జాకబ్ ష్నైటర్-మార్క్ వాల్నర్‌ను ఓడించింది. తొలి సెట్‌లో అర్జున్ జంట జోరు చూపించినా.. రెండో సెట్‌లో జర్మన్ జోడీ నుంచి గట్టి ప్రతిఘటన ఎదురైంది. అయితే, టైబ్రేక్‌లో 0-3తో వెనుకబడినా.. అద్భుతంగా పుంజుకొని మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

బుమ్రా ఆడాల్సిందే!

అర్ష్‌దీప్‌నకు గాయం ఒత్తిడిలో టీమిండియా

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

లార్డ్స్ టెస్టు పరాజయం ఆటగాళ్లతో పాటు అభిమానులను కూడా తీవ్ర వేదనకు గురిచేసింది. ఎన్నడూ గెలవని బర్మింగ్‌హామ్‌లో విజయకేతనం ఎగురవేసిన తర్వాతి మ్యాచ్‌లోనే ఈ పరాజయం ఎదురైంది. దీంతో ఇప్పుడు ఐదు టెస్టుల సిరీస్ అత్యంత ఆసక్తిరంగా మారింది. ఈనెల 23 నుంచి ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరిగే నాలుగో టెస్టు గెలిస్తేనే భారత్ ఆశలు సజీవంగా ఉంటాయి. గురువారం నుంచి గిల్ సేన తమ సన్నాహకాలను కూడా ఆరంభించింది. అయితే తమ ప్రధాన ఆయుధం పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఈ మ్యాచ్‌లో బరిలోకి దించుతారా? లేదా? అనే సందేహం అందరిలో నెలకొంది. బుమ్రా ఈ సిరీస్‌లో మొదటి, మూడో టెస్టులో మాత్రమే ఆడాడు. ఈ రెండింట్లో కలిపి12 వికెట్లు తీశాడు. అయితే పనిఒత్తిడిలో భాగంగా కేవలం మూడు టెస్టులకు మాత్రమే అందుబాటులో ఉంటాడని ఈ పర్యటనకు ముందే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పష్టం చేశాడు. దీంతో చివరిదైన ఐదో టెస్టులో మాత్రమే బుమ్రాను ఆడిస్తారంటూ కథనాలు వెలువడుతున్నాయి. కానీ తాజాగా జట్టు పరిస్థితిని గమనిస్తే ఇబ్బందికరంగా ఉంది. లార్డ్స్ ఓటమి గిల్ సేనను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. ప్రస్తుతం 1-2తో వెనుకబడిన దశలో మాంచెస్టర్ టెస్టును కోల్పోతే సిరీస్ పోయినట్టే. పైగా లెఫ్టామ్ పేసర్ అర్ష్‌దీప్ నెట్ ప్రాక్టీస్‌లో గాయపడ్డాడు. అతడు బౌలింగ్ వేసే చేతికి ప్లాస్టర్‌తో కనిపించాడు. ఇప్పటికే కీపర్ పంత్ చేతి వేలికి గాయం కాగా, నొప్పిని భరిస్తూనే తను మూడో టెస్టులో బ్యాటింగ్ చేశాడు. దీంతో నాలుగో టెస్టుకు పంత్ అందుబాటులో ఉండడం కష్టమే. ఇలాంటి సమస్యలు చుట్టుముట్టిన వేళ.. బుమ్రాకు విశ్రాంతినివ్వడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. అయినా మూడు, నాలుగో టెస్టుకు మధ్య ఎనిమిది రోజుల విశ్రాంతి బుమ్రాకు సరిపోతుందని మాజీ ఆటగాడు దీప్‌దాస్ గుప్తా సూచించాడు.





ఫిట్ అయితే ఆడాలి!



ఓ ఆటగాడు ఫిట్‌గా ఉన్నప్పుడు అన్ని మ్యాచ్‌లు ఆడాల్సిందేనని మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్ తేల్చాడు. తొలి టెస్టు తర్వాత ఎనిమిది రోజులపాటు సమయం లభించినా అతడిని రెండో టెస్టు ఆడించలేదని, ఇది ఏమాత్రం సరికాదని విమర్శించాడు. వ్యక్తిగత ఇష్టాఇష్టాలను బట్టి మ్యాచ్‌లను ఎంపిక చేసుకోవడమేమిటని సూటిగా ప్రశ్నించాడు. అటు మాజీల మాటయినా.. ఇటు అభిమానుల ఆరాటమైనా మాంచెస్టర్ మ్యాచ్‌లో బుమ్రా బరిలోకి దిగడమే.

కరుణ్‌కు కష్టమే..



ఎనిమిదేళ్ల తర్వాత టెస్టుల్లో పునరాగమనం చేసిన కరుణ్ నాయర్ తనకు లభించిన సువర్ణావకాశాన్ని పోగొట్టుకున్నాడు. మూడు టెస్టుల్లో కలిపి 131 పరుగులు మాత్రమే చేయగలిగాడు. జట్టు టాప్-4 బ్యాటర్లలో కనీసం అర్ధసెంచరీ కూడా చేయనిది కరుణ్ మాత్రమే. బ్యాటింగ్‌కు స్వర్గధామంగా నిలిచిన హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్‌లోనూ పేలవ ఆటతీరును కనబర్చాడు. దీంతో కరుణ్ స్థానంలో యువ ఆటగాడు సాయి సుదర్శన్‌ను ఆడించే చాన్సుంది. ఇంగ్లండ్ గడ్డపై అతడికి అవకాశం ఇస్తే జట్టుకు ప్రయోజకరంగా ఉంటుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

బుమ్రా అందుబాటులోనే..

నాలుగో టెస్టుకు బుమ్రా అందుబాటులో ఉంటాడని భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కాటే తెలిపాడు. 'చివరి రెండు టెస్టుల్లో బుమ్రా ఏదో మ్యాచ్‌లో మాత్రమే ఆడతాడు. ఎందులో ఆడించాలనే విషయమై మాంచెస్టర్ టెస్టుకు ముందు ఓ నిర్ణయం తీసుకుంటాం' అని డస్కాటే వివరించాడు. లార్డ్స్ టెస్టు ముగిశాక బుమ్రా నాలుగో మ్యాచ్‌లో ఆడే అంశంపై కెప్టెన్ గిల్ స్పష్టత నివ్వలేదు.

కార్ల్‌సన్‌కు ప్రజ్ఞానంద షాక్..!



- టైటిల్ రేస్ నుంచి మాగ్నస్ అవుట్
- క్వార్టర్స్‌కు ప్రజ్ఞానంద, అర్జున్
- ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్

లాస్‌వెగాస్: ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ చెస్ టూర్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద ఇచ్చిన షాక్‌తో.. వరల్డ్ నెం:1 మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) ఏకంగా టైటిల్ రేసు నుంచే అవుటయ్యాడు. అయితే, రెండో స్థానంలో నిలిచిన ప్రజ్ఞానంద క్వార్టర్స్‌కు దూసుకెళ్లగా.. 9 నుంచి 16 స్థానాల కోసం కార్ల్‌సన్ పోటీపడనున్నాడు. 16 మంది ప్లేయర్ల టోర్నీని రెండు గ్రూప్‌లు వైట్, బ్లాక్‌గా విభజించారు. ప్రతి గ్రూప్‌లోనూ టాప్-4లో నిలిచిన ఆటగాళ్లు నాకౌట్‌కు చేరుకొంటారు. గ్రూప్ దశలో.. వైట్ గ్రూప్‌లో నాలుగో రౌండ్ గేమ్‌లో ప్రజ్ఞానంద కేవలం 39 ఎత్తుల్లోనే కార్ల్‌సన్ ఆట కట్టించాడు. ఆ తర్వాతి రౌండ్‌లో అమెరికా జీఎం వెస్లీ సో చేతిలోనూ కంగుతిన్నాడు. ఇక, అరోనియన్ (అమెరికా) చేతిలో టైబ్రేక్‌లో ఓడడంతో కార్ల్‌సన్ టాప్-4లో నిలిచే అవకాశాన్ని కోల్పోయాడు. క్వాలిఫయర్స్‌లో జరిగిన ఏడు రౌండ్ల నుంచి సిండరోవన్, ప్రజ్ఞానంద, అబ్దుస్సతరోవ్ తలో 4.5 పాయింట్లతో తొలి మూడు స్థానాల్లో నిలవగా.. టైబ్రేక్‌లో కార్ల్‌సన్‌ను ఓడించిన అరోనియన్ నాలుగో స్థానాన్ని పట్టేశాడు. కాగా, గ్రూప్ 'బ్లాక్' నుంచి తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి 4 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి రౌండ్-8కు అర్హత సాధించాడు. క్వార్టర్స్‌లో కరువానాతో ప్రజ్ఞానంద, అబ్దుస్సతరోవ్‌తో అర్జున్ తలపడనున్నారు.

జపాన్ ఓపెన్..మన కథ ముగిసెన్!

సాత్విక్ జంట, లక్ష్యసేన్ ఓటమి

టోక్యో: జపాన్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్ కథ ముగిసింది. బరిలో మిగిలిన సాత్విక్ జోడీ, లక్ష్యసేన్ కూడా రెండో రౌండ్‌లో పరాజయంతో ఇంటిబాట పట్టారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్ 19-21, 11-21తో కొడాయ్ (జపాన్) చేతిలో ఓడిపోయాడు. ఇక సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి జోడీ 22-24, 14-21తో చైనా జంట లియాంగ్ వీ కెంగ్/వాంగ్ చాంగ్ చేతిలో ఓటమి చవి చూసింది. అనుపమా ఉపాధ్యాయ 21-13, 11-21, 12-21తో వాంగ్ ఝి హీ (చైనా) చేతిలో పోరాడి ఓడింది.

పెయింటర్‌గానే ఎక్కువ సంపాదన



ఇంగ్లండ్ మాజీ కీపర్ జాక్ రస్సెల్

లండన్: దాదాపు మూడు దశాబ్దాల క్రితమే క్రికెట్‌కు వీడ్కోలు చెప్పిన ఇంగ్లండ్ మాజీ వికెట్ కీపర్ జాక్ రస్సెల్ ఇప్పుడు కాన్వాస్ పెయింటర్‌గా స్థిరపడ్డాడు. 1988-1998 మధ్య తను 54 టెస్టులు, 40 వన్డేలు ఆడాడు. కళ్లకు నల్లటి గ్లాసులు, తలకు పనామా టోపీ, పొడవాటి మీసాలతో విలక్షణంగా కనిపించే రస్సెల్ 90 దశకంలో క్రికెట్ ఫ్యాన్స్‌ను అమితంగా ఆకట్టుకునేవాడు. క్రికెట్ నుంచి వైదొలిగాక పెయింటింగ్‌లో బిజీ అయ్యానని చెప్పాడు. అంతేకాకుండా క్రికెట్ ఆడే సమయంలోకన్నా ఇప్పుడే ఎక్కువగా సంపాదిస్తున్నట్టు రస్సెల్ తెలిపాడు. అయితే ధన సంపాదన కోసమే పెయింటింగ్స్ వేయడం లేదని, బొమ్మలు గీయడం తనకో వ్యసనమని తేల్చాడు. భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్నందున తాను రంజిత్ సింగ్‌జీ బొమ్మను సైతం చిత్రించినట్టు పేర్కొన్నాడు.

ఈతకొలనులో చైనా చిన్నారి ప్రకంపనలు!



సింగపూర్: యు జిడీ..చైనాకు చెందిన ఈ బాలికకు 12 సంవత్సరాలు. కానీ స్విమ్మింగ్ ప్రపంచం మొత్తం ఈమెవైపు ఆసక్తిగా చూస్తోంది. కారణం..ప్రస్తుతం సింగపూర్‌లో జరుగుతున్న వరల్డ్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో ఆ చిన్నారి ఎన్ని ప్రకంపనలు సృష్టిస్తుందోనని! ఈ పోటీల్లో మహిళల 200 మీ., 400 మీ. వ్యక్తిగత మెడ్లేతోపాటు, 200 మీ. బటర్‌ఫ్లై ఈవెంట్లలో యు బరిలోకి దిగుతోంది. ఈ మూడింటిలో యు జిడీకి స్వర్ణాలు ఖాయమని స్విమ్మింగ్ విశ్లేషకులు బల్లగుద్ది చెబుతున్నారు. ఇప్పటి వరకు ఈ మూడు విభాగాల్లో ఆమె నమోదు చేసిన సమయాలను చూస్తే ఈ చైనీస్ వండర్ సింగపూర్‌లో పసిడి మోత మోగిస్తుందని అంటున్నారు.

స్విమ్మింగ్‌లో రోహిత్ జాతీయ రికార్డు

న్యూఢిల్లీ: భారత టీనేజ్ స్విమ్మర్ రోహిత్ బెనెడిక్టన్ జర్మనీలో జరుగుతున్న ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడల్లో జాతీయ రికార్డును తిరగ రాశాడు. గురువారం జరిగిన పురుషుల 50 మీ. బటర్‌ఫ్లైలో 24 సెకన్లలో గమ్యం చేరిన రోహిత్..వీర్‌ధవల్ ఖడే పేరిట ఏడేళ్ల నుంచి ఉన్న రికార్డు (24.09సె.) బద్దలుగొట్టాడు. ఓవరాల్‌గా 12వ స్థానంలో నిలిచిన రోహిత్ సెమీఫైనల్‌కు అర్హత సాధించాడు. బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో భారత్ 5-0తో మకావును చిత్తు చేసింది.

అందరూ టైబ్రేకర్‌కు..

మహిళల చెస్ వరల్డ్ కప్

బటూమి (జార్జియా): మహిళల చెస్ ప్రపంచ కప్ ప్రీక్వార్టర్ ఫైనల్ రెండో గేమ్‌ను గ్రాండ్‌మాస్టర్లు హంపి, హారిక, వైశాలి డ్రా చేసుకున్నారు. అయితే ఝు జినెర్ చేతిలో దివ్యా దేశ్‌ముఖ్ పరాజయం చవిచూసింది. దాంతో టైబ్రేకర్‌ద్వారా క్వార్టర్‌ఫైనల్ చేరేదెవరో తేలనుంది. గురువారం జరిగిన రౌండ్-16 రెండో గేమ్‌లో..కొస్టెన్యూక్‌తో హంపి, లగ్నోతో హారిక, కమలిదెనోవాతో వైశాలి పాయింట్ పంచుకున్నారు. అయితే ఝు జినెర్‌తో తొలి గేమ్‌లో గెలుపొందిన దివ్య రెండో గేమ్‌లో ఓటమి చవిచూసింది.

అప్పుడే..ఎంత ఎదిగావు తల్లీ !



న్యూఢిల్లీ: కూతురు ఐరా 10వ పుట్టిన రోజును పురస్కరించుకొని టీమిండియా పేసర్ మహ్మద్ షమీ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యాడు. షమి-హసీన్ జంట మనస్పర్థల కారణంగా 2018లో విడిపోయినప్పటినుంచి ఐరా తల్లి వద్ద ఉంటోంది. 'నువ్వు ఇంత త్వరగా ఎదిగావంటే నమ్మలేకపోతున్నా. జీవితంలో నీకు అంతా మంచి జరగాలని కోరుకుంటున్నా. భగవంతుడు నీకు ప్రేమ, ఆనందం, ఆరోగ్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నా' అంటూ ఐరాతో కలిసి ఉన్న ఫొటోలను పంచుకున్నాడు.

హురున్ యువ పారిశ్రామికవేత్తల్లో శశాంక్ గుజ్జుల, అనుపమ్ పెదరాల

అగ్రస్థానంలో జెప్టో వ్యవస్థాపకులు కైవల్య వోహ్రా, అదిత్ పలిచ

» అనంత్ అంబానీ, సాగర్ అదానీలకూ చోటు



న్యూఢిల్లీ: దేశంలో 30 ఏళ్లలోపు యువ పారిశ్రామికవేత్తల జాబితాలో క్విక్ కామర్స్ స్టార్టప్ జెప్టో సహ వ్యవస్థాపకులైన అదిత్ పలిచ, కైవల్య వోహ్రా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. మొత్తం 79 మంది యంగ్ ఆంత్రప్రెన్యూర్ల వివరాలతో కూడిన ఈ జాబితాను అవెండస్ వెల్త్, హురున్ ఇండియా సంయుక్తంగా గురువారం విడుదల చేశాయి. హైదరాబాద్‌కు చెందిన ఎడ్యుటెక్ స్టార్టప్ నెక్స్ట్‌వేవ్ సహ వ్యవస్థాపకులు శశాంక్ రెడ్డి గుజ్జుల, అనుపమ్ పెదరాలకు కూడా ఈ లిస్ట్‌లో స్థానం లభించింది. మిర్యాలగూడకు చెందిన 28 ఏళ్ల శశాంక్ గుజ్జుల, ఏలూరు జిల్లా పెదరాయి గ్రామానికి చెందిన 30 ఏళ్ల అనుపమ్ పెదరాల వరుసగా 29, 30 స్థానాల్లో ఉన్నారు. కాలేజీ విద్యార్థులకు ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య శిక్షణ ఇచ్చే ఉద్దేశంతో వీరు 2020లో నెక్స్ట్‌వేవ్‌ను ప్రారంభించారు. కాగా, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన అనంత్ అంబానీ, రాధిక అంబానీతో పాటు అదానీ గ్రూప్‌నకు చెందిన సాగర్ అదానీ సహా పలువురు రెండో తరం పారిశ్రామికవేత్తలకు సైతం ఈ జాబితాలో చోటు లభించింది.

విప్రో లాభం రూ.3,336 కోట్లు

రూ.22,135 కోట్లకు పెరిగిన ఆదాయం

ఒక్కో షేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: దేశంలో నాలుగో అతిపెద్ద ఐటీ కంపెనీ విప్రో ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 9.8 శాతం వృద్ధితో రూ.3,336.5 కోట్లకు పెరిగింది. కొత్త కాంట్రాక్టులు భారీగా దక్కడం ఇందుకు దోహదపడింది. క్యూ1లో సంస్థ ఆదాయం కూడా వార్షిక ప్రాతిపదికన స్వల్ప పెరుగుదలతో రూ.22,134.6 కోట్లకు చేరుకుంది. ఈ మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే మాత్రం విప్రో లాభం 7 శాతం, ఆదాయం 1.6 శాతం తగ్గాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.5 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు అర్హులైన షేర్‌హోల్డర్లను ఈ నెల 28న రికార్డు చేయనున్న కంపెనీ.. ఆగస్టు 15న డివిడెండ్ చెల్లింపులు చేపట్టనున్నట్లు తెలిపింది. మరిన్ని వివరాలు..

- క్యూ1లో కంపెనీ ఐటీ సేవల విభాగ ఆదాయం అమెరికన్ కరెన్సీలో 258.74 కోట్ల డాలర్లుగా నమోదైంది. మార్చి క్వార్టర్‌తో పోలిస్తే ఈ రెవెన్యూ 0.3 శాతం తగ్గగా.. గత జూన్‌తో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే 1.5 శాతం క్షీణించింది. కాగా, ఈ సెప్టెంబరుతో ముగియనున్న రెండో త్రైమాసికం (క్యూ2)లో ఐటీ సేవల విభాగ ఆదాయం 256.0-261.2 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని కంపెనీ అంచనా వేసింది. అంటే, క్యూ1తో పోలిస్తే ఈ విభాగ ఆదాయ వృద్ధి మైనస్ 1 నుంచి ప్లస్ ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని సంస్థ భావిస్తోంది.
- గడిచిన మూడు నెలల్లో విప్రో మొత్తం 497.1 కోట్ల డాలర్ల ఆర్డర్లు దక్కించుకుంది. అందులో 267 కోట్ల డాలర్ల విలువైన భారీ డీల్స్ కూడా ఉన్నాయని కంపెనీ తెలిపింది.
- మార్చి త్రైమాసికంతో పోలిస్తే జూన్ చివరి నాటికి విప్రో ఉద్యోగుల సంఖ్య 114 మేర తగ్గి 2,33,232గా నమోదైంది. గడిచిన మూడు త్రైమాసికాలుగా కంపెనీ ఉద్యోగుల వలసల రేటు 15 శాతం స్థాయిలో నమోదవుతూ వస్తోంది.
- గురువారం బీఎస్ఈలో కంపెనీ షేరు 0.93 శాతం తగ్గి రూ.260.25 వద్ద ముగిసింది.

10,000 మంది ఫ్రెషర్ల హైరింగ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోవాలనుకుంటున్నట్లు విప్రో చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ సౌరబ్ గోవిల్ తెలిపారు. వాస్తవిక నియామకాలు మాత్రం భవిష్యత్ డిమాండ్‌పై ఆధారపడి ఉంటాయని మాత్రం గోవిల్ స్పష్టం చేశారు.

బిజినెస్

స్పీచ్‌ను టెక్స్ట్‌గా మార్చే ఎల్ఎల్ఎం

- ఆవిష్కరించిన జోహో

బెంగళూరు: కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం) ఆవిష్కరణలో దేశీయ కంపెనీలూ తమ సత్తా చూపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్) పద్దతిలో కంపెనీలకు సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు అందించే దేశీయ టెక్నాలజీ కంపెనీ జోహో 'జియా ఎల్ఎల్ఎం' పేరుతో తన సొంత ఎల్ఎల్ఎంను ఆవిష్కరించింది. తమ సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను ఉపయోగిస్తున్న ఖాతాదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఎల్ఎల్ఎంను అభివృద్ధి చేసినట్టు జోహో తెలిపింది. తమ ఎల్ఎల్ఎంతో ఉద్యోగాలకు, నియామకాలకు ఎలాంటి ముప్పు ఉండదని పేర్కొంది. స్పీచ్‌ను టెక్స్ట్‌గా మార్చడం ఈ ఎల్ఎల్ఎం ప్రత్యేకత.

యాక్సిస్ బ్యాంక్‌కు మొండిబాకీల సెగ

న్యూఢిల్లీ: జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో యాక్సిస్ బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 4 శాతం తగ్గి రూ.5,806 కోట్లకు పరిమితమైంది. మొండి బకాయిలు (ఎన్‌పీఏ) స్వల్పంగా పెరగడం ఇందుకు కారణమైంది. సమీక్షా కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం మాత్రం రూ.38,322 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.31,064 కోట్లుగా నమోదైంది. గత ఏడాది జూన్ 30 నాటికి 1.54 శాతంగా ఉన్న స్థూల ఎన్‌పీఏలు ఈ జూన్ చివరి నాటికి 1.57 శాతానికి పెరిగాయి. నికర ఎన్‌పీఏలు 0.34 శాతం నుంచి 0.45 శాతానికి ఎగబాకాయి. ఈ కాలంలో బ్యాంక్ మొండిబకాయిలతో పాటు ఇతర అవసరాలకు రూ.3,948 కోట్లను కేటాయించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	520
వరంగల్	512	గోదావరి	500
చిత్తూరు	563	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్ 375 పాయింట్లు డౌన్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 375.24 పాయింట్లు కోల్పోయి 82,259.24 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 110.60 పాయింట్లు తగ్గి 25,111.45 వద్దకు జారుకుంది. ఐటీ, బ్యాంకింగ్ రంగ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం ఇంకా కొలిక్కి రాకపోవడంతో ఈక్విటీ మదుపరులు వేచి చూసే ధోరణిలో ఉన్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ, నిరాశాజనక త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌పై ఒత్తిడిని పెంచాయన్నారు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోగా.. టెక్ మహీంద్రా షేరు అత్యధికంగా 2.76 శాతం క్షీణించింది. ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ స్టాక్స్ ఒక శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.30 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో ఫోకస్డ్ ఐటీ 1.47 శాతం, ఐటీ 1.33 శాతం, టెక్ 1.06 శాతం, బ్యాంకెక్స్ 0.51 శాతం తగ్గాయి. కాగా, డాలర్‌తో రూపాయి మారకం విలువ 20 పైసల నష్టంతో రూ.86.12 వద్ద ముగిసింది.

నెఫ్రోప్లస్ రూ.2,000 కోట్ల ఐపీఓ

నెఫ్రోప్లస్ బ్రాండ్ నేమ్‌తో డయాలసిస్ సేవలందిస్తోన్న హైదరాబాద్ కంపెనీ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ కూడా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు రాబోతోంది. ఇందుకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి కంపెనీ త్వరలోనే ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించనున్నట్లు తెలిసింది. ఐపీఓ ద్వారా రూ.2,000 కోట్లకు పైగా సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ఈ నిధులతో మరిన్ని డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు భారత్, ఫిలిప్పీన్స్‌లో ఇతర కంపెనీలను కొనుగోలు చేయాలనుకుంటోంది. 2010లో ప్రారంభమైన నెఫ్రోప్లస్.. ప్రస్తుతం భారత్, ఫిలిప్పీన్స్, ఉజ్బెకిస్థాన్, నేపాల్ మార్కెట్లలో 400కు పైగా డయాలసిస్ కేంద్రాలను నిర్వహిస్తోంది.

హెరిటేజ్ ఫుడ్స్ ఆదాయం రూ.1,137 కోట్లు

క్యూ1 లాభం రూ.41 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హెరిటేజ్ ఫుడ్స్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,136.80 కోట్ల ఆదాయంపై రూ.40.54 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.1,032.67 కోట్లు)తో పోల్చితే ఆదాయం 10 శాతం వృద్ధి చెందగా లాభం మాత్రం 31 శాతం (రూ.58.42 కోట్లు) తగ్గింది. ఏప్రిల్- మే నెలల్లో అకాల వర్షాల కారణంగా అన్ని మార్కెట్లలో పెరుగు, బటర్‌మిల్క్, ఫ్లేవర్డ్ మిల్క్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ తగ్గటం పనితీరు ప్రభావం చూపించిందని హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడించింది. అయితే జూన్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనటం కొంతమేరకు కలిసివచ్చిందని పేర్కొంది. కాగా జూన్ త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూలు తొలిసారిగా రూ.1,100 కోట్ల మార్కును అధిగమించాయని తెలిపింది. మరోవైపు ఈ కాలంలో వ్యయాలు కూడా రూ.958.90 కోట్ల నుంచి రూ.1,085.76 కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికంలో వ్యాపారపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొన్నప్పటికీ కంపెనీ తొలిసారిగా రూ.1,100 కోట్ల రెవెన్యూ మార్కును అధిగమించిందని హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మణి నారా తెలిపారు. కంపెనీ వ్యాపార ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉన్నాయని, దీర్ఘకాలంలో మరింత వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. కాగా కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఐస్‌క్రీమ్ ప్లాంట్ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. హెరిటేజ్ నోవాండెల్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్ఎన్ఎఫ్‌పీఎల్)లో అదనంగా 44.4 శాతం వాటాలను కొనుగోలు చేసేందుకు బోర్డు ఆమోదం లభించిందని హెరిటేజ్ ఫుడ్స్ పేర్కొంది. ఈ కొనుగోలుతో హెచ్ఎన్ఎఫ్‌పీఎల్‌లో కంపెనీ మొత్తం వాటా 94.4 శాతానికి చేరనుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	96	విజయవాడ	99
వరంగల్	96	గుంటూరు	104
కరీంనగర్	96	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	100
కర్నూలు	96	నెల్లూరు	105
విశాఖపట్నం	85	అనంతపురం	105
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,330 ▲	91,050 ▲	1,24,000 ▼
విజయవాడ	1,00,000 ▼	94,000 ▼	1,13,800 ▼
విశాఖపట్నం	1,00,150 ▼	91,050 ▲	1,24,000 ▼
రాజమండ్రి	99,330 ▲	91,050 ▲	1,14,600 ▼
ప్రొద్దుటూరు	97,650 ▼	89,840 ▼	1,13,600 ▲
ముంబై	97,453 ▼	89,267 ▼	1,11,000 ▼

'ఎఫ్ఎంసీజీ'కి అదానీ గుడ్‌బై

అదానీ విల్మర్‌లో 20 శాతం వాటా విక్రయం

న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ వ్యాపారానికి అదానీ గ్రూప్ గుడ్‌బై చెప్పింది. ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్ లిమిటెడ్ (గతంలో అదానీ విల్మార్ లిమిటెడ్) ఈక్విటీలో తనకు ఉన్న 20 శాతం వాటాను సింగపూర్ భాగస్వామ్య సంస్థ విల్మార్ ఇంటర్నేషనల్ కంపెనీకి రూ.7,150 కోట్లకు విక్రయించింది. గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ అనుబంధ సంస్థ అయిన అదానీ కమోడిటీస్ ఎల్ఎల్‌పీ (ఏసీఎల్) ఈ వాటాలను విక్రయించింది. దీంతో ఏడబ్ల్యూఎల్ ఈక్విటీలో సింగపూర్ కంపెనీ వాటా 64 శాతానికి చేరింది. సింగపూర్ సంస్థ ఇందుకోసం ఒక్కో షేరుకు రూ.275 చొప్పున చెల్లించింది. కాగా ఏడబ్ల్యూఎల్ అగ్రి బిజినెస్‌లో మిగిలిన 10.42 శాతం వాటాలను ఏసీఎల్ త్వరలో విక్రయించనుంది. ఈ ఏడాది జనవరిలోనే ఏడబ్ల్యూఎల్‌లో ఏసీఎల్ 13.51 శాతం వాటాలను రూ.4,855 కోట్లకు విక్రయించింది. కాగా గురువారం బీఎస్ఈలో ఏడబ్ల్యూఎల్ అగ్రి షేరు 6.06 శాతం లాభంతో రూ.278.25 వద్ద ముగిసింది.

ఆర్ఎస్ బ్రదర్స్‌లో సూపర్ ఆషాఢం కేజీ సేల్



హైదరాబాద్: ఆర్ఎస్ బ్రదర్స్.. సూపర్ ఆషాఢం కేజీ సేల్ పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆషాఢ మాసం ప్రత్యేకతను గుర్తించి మహిళలు, పురుషులు, పిల్లలకు సంబంధించిన అన్ని రకాల వస్త్రాలపై 70 శాతం వరకు తగ్గింపును ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ సూపర్ ఆషాఢం కేజీ సేల్ కింద అలంకారీ ప్రింట్ చీర కొనుగోలుపై రెండో చీరను కేవలం రూ.39కే (రూ.3,695 విలువ గల) అందిస్తున్నట్లు వెల్లడించింది. దీంతోపాటు 22 క్యారట్ల బంగారు ఆభరణాల కొనుగోలుపై గ్రాముకు ఫ్లాట్ రూ.20-0 తగ్గింపుతో పాటు పాత బంగారం మార్పిడిపై వినియోగదారులకు గ్రాముకి రూ.100 అదనంగా అందిస్తున్నట్లు తెలిపింది. అలాగే కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై ఫ్లాట్ రూ.5,000 తగ్గిస్తున్నట్లు ఆర్ఎస్ బ్రదర్స్ వెల్లడించింది.



నిజాం కళాశాలలో జరిగిన సదస్సులో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి

మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యమే లక్ష్యం

- అతివలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తున్నాం
- నిజాం కాలేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : భట్టి

హైదరాబాద్/బర్కత్‌పుర, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, మహిళలు ఆర్థికంగా బలోపేతమైనప్పుడే లింగ వివక్ష దూరమవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. నిజాం కళాశాలలో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన లింగ సమానత్వం సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏటా మహిళా సంఘాలకు రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను ఇస్తున్నామని తెలిపారు. మొదటి ఏడాదిలోనే రూ.21,632 కోట్ల రుణాలను అందించామని చెప్పారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు మహిళలకు చేరితే ఆర్థిక స్వాతంత్ర్యం, లింగ సమానత్వం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. ఆ విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాల ద్వారా 650 బస్సులను కొనుగోలు చేయించి, ఆర్టీసీకి అద్దెకు ఇప్పించామని అన్నారు. నిజాం కళాశాల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని, పూర్వ విద్యార్థిగా ఒక రోజు కళాశాలలో గడపాలని నిర్ణయించుకున్నానని భట్టి తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్ ఘనత

- ఢిల్లీలో అవార్డు స్వీకరించిన అధికారులు
- సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు మొదటి ర్యాంకు

న్యూఢిల్లీ, హైదరాబాద్ సిటీ, సికింద్రాబాద్, జూలై 17: స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో 10 లక్షలకుపైగా జనాభా గల నగరాల కేటగిరీలో హైదరాబాద్ జాతీయస్థాయిలో ఆరో ర్యాంకు సాధించింది. సర్వే ప్రారంభించిన తొమ్మిదేళ్లలో ఇంత మెరుగైన ర్యాంకు సాధించడం ఇదే ప్రథమం. వ్యర్థాల రహిత నగరం కేటగిరీలో భాగ్యనగరానికి సెవెన్ స్టార్ రేటింగ్ దక్కింది. గతేడాది తొమ్మిదో ర్యాంకు, ఫైవ్ స్టార్ ర్యాంకు రాగా.. ఈ సారి మెరుగైన ర్యాంకు, స్టార్ రేటింగ్ దక్కాయి. గురువారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి మనోహర్‌లాల్ చేతుల మీదుగా పురపాలక శాఖ కార్యదర్శి కే ఇలంబరిది, జీహెచ్ఎంసీ కమిషనర్ ఎంవీ కర్ణన్ అవార్డు అందుకున్నారు. పారిశుధ్య నిర్వహణలో దేశంలోని మొత్తం 58 కంటోన్మెంట్లలో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు మొదటి ర్యాంకు దక్కింది. పారిశుధ్య నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ పనితీరుకుగాను ప్రత్యేక కేటగిరీ కింద ఈ అవార్డు దక్కింది. దేశంలోనే అత్యంత స్వచ్ఛ నగరంగా అహ్మదాబాద్ నిలిచింది. తర్వాతి స్థానాల్లో భోపాల్, లక్నో చోటు సంపాదించుకున్నాయి. శుభ్రత పాటించే నగరాలపై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త ర్యాంకింగ్ విధానం ప్రకారం సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ కేటగిరీలో అత్యంత శుభ్రమైన నగరంగా నోయిడా నిలిచింది.

ఆరడుగులు పెరిగాడే కానీ.. అరంగుళమైనా మెదడు పెంచుకోలేదు

- హరీశ్ వాదనలో పస లేదు: మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): "ఢిల్లీలోని జలశక్తి కార్యాలయంలో జరిగిన ఏపీ, తెలంగాణ సీఎంల సమావేశంలో ఏయే అంశాలపై మాట్లాడింది.. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ వెల్లడించినా.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పినా బీఆర్ఎస్ నేత హరీశ్ రావు మెదడుకు ఎక్కలేదు. ఆయన ఆరడుగులు పెరిగాడే కానీ.. మెదడును అరంగుళం కూడా పెంచుకోలేదు. అడ్డగోలు వాదనలు, అర్థంలేని తర్కం చేస్తూ తెలంగాణ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నడు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడగానే.. ఏదో ఒకటి మాట్లాడి ఉనికి చాటుకోవాలనే తపనే తప్ప.. రాష్ట్ర ప్రయోజనాల గురించి ఆయనకు పట్టింపు లేదు" అంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ధ్వజమెత్తారు. హరీశ్ వాదనల్లో పసే లేదని గురువారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి అసెంబ్లీలో చర్చిద్దాం రండి అంటూ సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌కు సవాల్ విసిరితే అటునుంచి స్పందన ఏదని ప్రశ్నించారు. ప్రెస్‌మీట్లు పెట్టి కోడిగుడ్డుపై ఈకలు పీకాలని చూస్తే ప్రజలు నమ్మబోరని ఆయన అన్నారు. కాగా, పీసీసీ మాజీ చీఫ్ ఎం. సత్యనారాయణరావు సతీమణి సుగుణ మృతి పట్ల మహేష్‌కుమార్‌గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. మరోవైపు, మెదక్ జిల్లా కేంద్రంలో జరిగిన సభలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. తన వల్లే బీసీ రిజర్వేషన్లు వచ్చాయంటున్న లిక్కర్ రాణి కవిత.. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు.

ఏటేటా తెలంగాణలో ధాన్యం దిగుబడి వృద్ధి

- ఎఫ్‌సీఐ సలహా కమిటీ చైర్‌పర్సన్‌గా డీకే అరుణ బాధ్యతల స్వీకరణ

తెలంగాణలో ఏడాదికేడాది ధాన్యం దిగుబడితోపాటు సేకరణ గణనీయంగా పెరుగుతుండటంతో గోదాముల నిల్వ సామర్థ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సలహా కమిటీ చైర్ పర్సన్ డీకే అరుణ చెప్పారు. బియ్యం నిల్వకు అవసరమైనచోట గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎఫ్‌సీఐ కార్యాలయంలో ఆమె ఎఫ్‌సీఐ సలహా కమిటీ చైర్ పర్సన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులు, అధికారులతో చర్చించిన అనంతరం డీకే అరుణ మాట్లాడుతూ ఎఫ్‌సీఐలోని సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించి సంస్థ మరింత బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

125 ఎకరాలకు టోకరా!

- మృతుడి సంతకం ఫోర్జరీతో నకిలీ వీలునామా
- దత్తపుత్రులమంటూ భూమి కాజేసే యత్నం
- దాయాదుల ఫిర్యాదుతో అక్రమార్కుల గుట్టురట్టు
- భార్యాభర్తల రిమాండ్.. పరారీలో ఏడుగురు

చేవెళ్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన వ్యక్తి సంతకం ఫోర్జరీ చేసి, 125 ఎకరాల భూమిని కాజేసేందుకు యత్నించిన వారి గుట్టు రట్టయింది. దత్తపుత్రులమని చెప్పుకొంటూ మృతుడి సంతకాన్ని ఫోర్జరీ చేశారని దాయాదులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ బాగోతం బయటపడింది. చేవెళ్ల పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం పామెన గ్రామానికి చెందిన పట్లోళ్ల ప్రతాప్‌రెడ్డికి 125 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆయనకు పిల్లలు లేరు. 2018 అక్టోబరు 9న అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన భార్య అంతకంటే ముందే చనిపోయారు. ఈ క్రమంలో ప్రతాప్‌రెడ్డి తనను దత్తత తీసుకున్నారని, అయన మరణానంతరం ఆస్తిపాస్తులు తనకు, తన భార్య సురేఖకు దక్కుతాయంటూ మహబూబ్‌నగర్ జిల్లా నందారం గ్రామానికి చెందిన గుమ్మల జగన్‌మోహన్‌రెడ్డి కోర్టులో సివిల్ కేసు వేశారు. ప్రతాప్‌రెడ్డి బతికుండగానే 2017 డిసెంబరు 3న ఆయన రాసినట్లుగా వీలునామా సృష్టించారు. ప్రతాప్‌రెడ్డి మృతిచెందాక దాన్ని తెరపైకి తెచ్చారు. భూములను తమ పేరిట బదలాయించుకోవడంతోపాటు చేవెళ్ల ఎస్బీఐలో ప్రతాప్‌రెడ్డి పేరిట ఉన్న రూ.19 లక్షలకుపైగా నగదును సైతం తీసుకున్నారు. ప్రతాప్‌రెడ్డి అన్నదమ్ముల పిల్లలు పట్లోళ్ల మహేశ్‌కుమార్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి (ఆర్మీ రిటైర్డ్), నరేశ్‌కుమార్‌రెడ్డి, హేమలతలు ఆరా తీయగా ఈ బాగోతం బయటపడింది. ఆయన ఎవరినీ దత్తత తీసుకోలేదని, నకిలీ వీలునామా సృష్టించారని వారు కోర్టును ఆశ్రయించారు. 2023లో చేవెళ్ల కోర్టు ఆదేశాలతో జగన్‌మోహన్‌రెడ్డి, సురేఖతో పాటు అతని సోదరులపై కేసు నమోదైంది. ప్రతాప్‌రెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు ఫోరెన్సిక్ పరీక్షలో తేలింది. దీంతో జగన్‌మోహన్‌రెడ్డి జంటతో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి, సురేఖను అరెస్టు చేసి సంగారెడ్డి జిల్లా జైలుకు తరలించారు. కేసులో మిగతా నిందితులు పరారీలో ఉండగా.. గుమ్మల మధుసూదన్‌రెడ్డి (న్యాయవాది)పై చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని చేవెళ్ల ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు.

కేటీఆర్ పిరికిపంద

(మొదటిపేజీ తరువాయి)

ఎవరికీ తెలియదనుకుంటే ఎలాగని ప్రశ్నించారు. ఆయన హైదరాబాద్‌లో చీకట్లో ఎవరికీ తెలియకుండా లోకేశ్‌ను కలిసిన విషయం అందరికీ తెలుసన్నారు. దాంతో, 'మీరు కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారా?' అని విలేకరులు ప్రశ్నించగా.. ఆ అవసరం తమకు లేదని, వారి భేటీ గురించి బీఆర్ఎస్ వ్యక్తులే అందరికీ చెబుతున్నారు కదా? అని బదులిచ్చారు.

కేటీఆర్‌ను నాయకుడిగా ఇంట్లో వాళ్లే ఒప్పుకోవట్లేదు



కేటీఆర్ నాయకత్వాన్ని కవిత ఒప్పుకోవడం లేదని, ఇంట్లో వాళ్లే కేటీఆర్‌ను నాయకుడిగా ఒప్పుకోకపోతే ఇక ప్రజలెలా అంగీకరిస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. "ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని తండ్రి దగ్గరికి వెళ్లి అడగలేని కేటీఆర్.. సవాళ్లు విసరడం విడ్డూరంగా ఉంది. కేటీఆర్ పనితనం తెలుసు కాబట్టే.. ఆయన ఎలాగూ పనికిరాడనే కేసీఆర్ ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదు. ఉచిత, పనికిమాలిన సలహాలు ఇవ్వడం, సవాళ్లు విసరడం మానేసి ముందు ఇంటి సమస్యను పరిష్కరించుకోండి. అది సాధ్యం కాకపోతే కనీసం ఇంటికే పరిమితం కండి. అప్పుడు కనీస మర్యాదైనా దక్కుతుంది" అని ఎద్దేవా చేశారు. కేటీఆర్, హరీశ్, కవిత తీసేసిన తహసీల్దార్లని, వాళ్లకు ఇంట్లోనే విలువ లేదని, ప్రజలకు ఏం చేస్తారని విమర్శించారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు.. ఎవరూ తప్పించుకోలేరు

తప్పు చేస్తే తెల్లారే శిక్ష పడకపోవచ్చని, కానీ, శిక్ష తప్పదని, దాని నుంచి ఎవరూ తప్పించుకోలేరని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. "మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌ను మొదటే అరెస్టు చేయలేదు. దర్యాప్తును కొలిక్కి తీసుకొచ్చిన తర్వాత చివర్లోనే అరెస్టు చేశారు. తెలంగాణలో జరిగిన కుంభకోణాల్లోనూ ఇప్పుడు అలాగే జరుగుతుంది. ఎన్నో సినిమాల్లో చూస్తాం కదా? విలన్ సినిమా చివర్లోనే చనిపోతాడు. అప్పటి వరకూ ఓపిక పట్టాల్సిందే" అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం కేసులో కేసీఆర్, హరీశ్ రావులపై; ఈ పార్ములా కారు రేసు కేసులో కేటీఆర్, విద్యుత్తు కొనుగోళ్లలో జగదీశ్ రెడ్డిపై విచారణ జరుగుతోందని వివరించారు.

ముఖ్యమంత్రుల భేటీలో రోడ్ మ్యాప్ వేశాం

ముఖ్యమంత్రుల భేటీలో తెలంగాణ భవిష్యత్తు నీటి అవసరాల కోసం రోడ్ మ్యాప్ వేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేశాం. కృష్ణా, గోదావరి బేసిన్లలో ఉన్నవి.. కొత్తగా చేపట్టే ప్రాజెక్టులు, నీటి కేటాయింపులకు సంబంధించి అధికారులు, ఇంజినీర్ల కమిటీ చూస్తుంది. ఆ కమిటీతో పరిష్కారం కాని అంశాలను ముఖ్యమంత్రుల స్థాయిలో పరిష్కరిస్తాం" అని వివరించారు. గోదావరి- కావేరీ (వయా నాగార్జున సాగర్) అనుసంధానాన్ని కేంద్రం ప్రతిపాదించిందని, అయితే.. పాత లెక్కల ప్రకారం డీపీఆర్ తయారు చేశారని, ఆ తర్వాత ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని, దాంతో, మరోసారి సమగ్రంగా డీపీఆర్ సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

తెలంగాణ ద్రోహి కేసీఆర్

"తెలంగాణ ద్రోహి కేసీఆర్. పదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారు. రాయలసీమను రతనాల సీమ చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాం (2004-2014)లో రాయలసీమకు 728 టీఎంసీలు పోతే.. బీఆర్ఎస్ హయాంలో (2014-23) 1200 టీఎంసీలు తరలించారు. కేసీఆర్ తెలంగాణ ద్రోహి అనడానికి ఇది సరిపోదా!?" అని ప్రశ్నించారు. ఇప్పుడు రాయలసీమకు నీళ్లు నిలిపేస్తే.. శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆపిస్తే అది తెలంగాణ విజయం కాదా? అని నిలదీశారు. "కేంద్రం, ఏపీతో చర్చకు పోకపోతే.. కేసీఆర్‌లా ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో పడుకోవాలా? గతంలో 2016, 2020ల్లో అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో కేసీఆర్, హరీశ్ పాల్గొనలేదా? వాళ్ల హాజరైతే విజయం, నేను, ఉత్తమ్ పాల్గొంటే అపచారం ఎలా అవుతుంది!?" అని నిలదీశారు. భారత్, పాక్ మధ్యే జల ఒప్పందం జరిగిందని, పక్కనే ఉన్న ఏపీతో మాత్రం వద్దంటే ఎలాగని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం కడుపు నిండా విషమే ఉంటుందని, జల వివాదం పరిష్కారం కాకూడదని, ఇలాగే ఉంటే రాజకీయంగా కొంతకాలమైనా బతకొచ్చనే స్వార్థం వాళ్లదని మండిపడ్డారు. కేసీఆర్ తనకు శత్రువు కాదని, రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని స్పష్టతనిచ్చారు. "తెలంగాణ మీ తాత జాగీరా అని హరీశ్ అడుగుతున్నాడు. మరి హరీశ్ తాత, మామల జాగీరా!? తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై చర్చలు జరగడం, పరిష్కారం దొరకడం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కు ఇష్టం లేదు. కేసీఆర్‌ది సంకుచిత మనస్తత్వం" అని విమర్శించారు.

కొట్లాట నా చివరి అస్త్రం

సమస్య ఏదైనా చర్చలతో పరిష్కరిద్దామనుకునే మనస్తత్వం తనదని, కొట్లాట తన చివరి అస్త్రమని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. ఎవరికైనా భయపడితే తాను రేవంత్ రెడ్డిని ఎలా అవుతానని ప్రశ్నించారు. తాను కేవలం వ్యవస్థకు మాత్రమే భయపడే వ్యక్తినని, తన ప్రాధాన్యం రాష్ట్రం, ప్రజలు మాత్రమేనని స్పష్టం చేశారు. "ఇదే ధోరణితో కేంద్రం, ఏపీతో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నా. ప్రతి దానికీ కొట్లాడుడే అంటే.. పాలకులకు లాభం జరుగుతుందేమో కానీ.. అంతిమంగా ప్రజలకు నష్టం జరుగుతుంది. నా వైఖరి వల్లే సుదీర్ఘ కాలంగా కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం లభించింది. కేంద్రం సానుకూలంగా స్పందిస్తోంది. ఎలివేటర్ కారిడార్ కోసం ఎంతో విలువైన రక్షణ రంగానికి చెందిన భూముల బదలాయింపు జరిగింది. పదేళ్ల క్రితమే కేసీఆర్ ఢిల్లీ వెళ్లినా.. ఫెడరల్ వ్యవస్థలో భాగంగా కేంద్రంతో సఖ్యతగా ఉన్నా.. తెలంగాణకు ఎంతో మేలు జరిగేది. కానీ.. రాజకీయ స్వార్థమే బీఆర్ఎస్ లక్ష్యం. ఇప్పుడు కూడా రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు పెంచితే రాజకీయంగా కొంత కాలమైనా బతకొచ్చని ప్రయత్నిస్తున్నారు. వాళ్లది అధికారం, ఆస్తుల పంచాయితీ. మాది ప్రజల జీవితాలు, భవిష్యత్తు తరాలకు మంచి జరగాలనే ఆరాటం" అని వ్యాఖ్యానించారు. 21న మరోసారి ఢిల్లీకి వస్తానని, తెలంగాణ కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీకి వస్తానే ఉంటానని చెప్పారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు కోసం త్వరలో మహారాష్ట్రకు వెళతానని తెలిపారు.

ప్రధాన ప్రతిపక్ష నేత వస్తే చర్చకు సిద్ధమే

ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ వస్తే ఏ అంశంపైన అయినా చర్చకు తాను సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అసెంబ్లీకి రావాలని, ప్రతిపక్ష నేతగా గౌరవిస్తామని, ఆయన అనుభవంతో సలహాలివ్వాలని కేసీఆర్‌కు సూచించానని, ఆయన మాత్రం ఫాంహౌజ్‌కే పరిమితమవుతున్నారని తప్పుబట్టారు. "అంతే తప్ప.. కేటీఆర్‌కు ఏ స్థాయి ఉందని ఆయన సవాళ్లను నేను పరిగణనలోకి తీసుకోవాలి. కేటీఆర్ సవాళ్లకు ఆయన స్థాయి వ్యక్తులనే పంపిస్తాను. నల్లగొండలో సవాల్ అంటే.. కేటీఆర్ స్థాయి వ్యక్తి కాబట్టే ఎమ్మెల్యే మందుల సామేల్ వస్తాడని చెప్పా" అని వ్యాఖ్యానించారు. దొంగ సారా కాయడం, సోడా పోయడం తప్ప జగదీశ్ రెడ్డికి ఇంకేమీ తెలియదన్నారు. నల్లగొండ ఎక్సైజ్ ఆఫీసుకు వెళితే జగదీశ్ రెడ్డి సారా బాగోతం తెలుస్తుందన్నారు. చివరికి.. దొంగ సారా అమ్మిన జగదీశ్ రెడ్డి కూడా నీతులు చెబితే ఎలాగని ప్రశ్నించారు. ఉత్తమ్‌పై పోటీ చేసి డిపాజిట్లు కోల్పోయిన వ్యక్తి సవాళ్లు విసరడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

బీసీ రిజర్వేషన్లు 23 శాతానికి తగ్గించిందే కేసీఆర్

"కాంగ్రెస్ పార్టీ 2014కు ముందు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించింది. వాటిని 23 శాతానికి తగ్గించిందే కేసీఆర్" అని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదంటూ 2018లో కేసీఆర్ పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చి బీసీలకు అన్యాయం చేశారన్నారు. ఆ చట్టంలో ఇప్పుడు 50 శాతం పరిమితిని ఎత్తి వేస్తూ.. ఆర్డినెన్స్ తెస్తున్నామని చెప్పారు. "50 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు వేరు. ప్రస్తుత ఆర్డినెన్స్ వేరు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడని చెప్పుకొనే లక్ష్మణ్‌కే ఈ బిల్లు, ఆర్డినెన్స్‌పై అవగాహన లేదు. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన బిల్లు ఉండగానే.. ఆర్డినెన్స్ ఎలా తెస్తారని ఆయన ప్రశ్నించడం విడ్డూరంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని లక్ష్మణ్ కాగితంపై రాసి ఇస్తే.. 48 గంటల్లో ప్రత్యేక సమావేశాలు పెట్టి కేంద్రానికి పంపుతాం" అని వ్యాఖ్యానించారు. అవసరమైతే ఆర్డినెన్స్ ఆమోదానికి గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తానని చెప్పారు. "స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్నాయి. మోదీ సొంత రాష్ట్రం గుజరాత్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తరప్రదేశ్, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న మహారాష్ట్రలోనూ ముస్లిం రిజర్వేషన్లు ఉన్నాయి. ముందు అక్కడ తొలగించి.. ఆ తర్వాత తెలంగాణలో ముస్లిం రిజర్వేషన్లు తొలగించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేయాలి" అని సవాల్ విసిరారు. బీజేపీ కొత్త అధ్యక్షుడు రామచంద్రరావు ఎన్నికపైనా రేవంత్ తనదైన శైలిలో స్పందించారు. కాంగ్రెస్ బీసీకి రాష్ట్ర పార్టీ బాధ్యతలు అప్పగిస్తే, బీజేపీ అయ్యగారికి అప్పగించిందని వ్యాఖ్యానించారు. అలాగే, 42 శాతం రిజర్వేషన్ల అమలుపై తమ దగ్గర వ్యూహం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. వర్గీకరణ, కుల గణన సర్వేపై కూడా ఇలాంటి విమర్శలు చేశారని, వాటిని విజయవంతంగా చేసి చూపించామని చెప్పారు.

ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను రక్షించేందుకు కిషన్‌రెడ్డి ప్రయత్నం

ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు సుమోటోగా తీసుకొని పర్యవేక్షిస్తోందని, మళ్లీ కొత్తగా న్యాయస్థానం కలగజేసుకోవాల్సిన అవసరం ఏముందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. "కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు తన ఫోన్ ట్యాప్ అయిందని గతంలో అన్న కిషన్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు ఫిర్యాదు చేయలేదో ప్రజలకు చెప్పాలి. కేవలం కేసీఆర్‌ను కాపాడేందుకే ఫోన్ ట్యాపింగ్ కేసును కేంద్రానికి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్ రావును దేశానికి తీసుకురావడంలో ఏడాదిన్నర జాప్యం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ఎంతో పోరాడి సుప్రీంకోర్టుకు వెళ్లి ప్రభాకర్ రావును తీసుకురావాల్సి వచ్చింది. ఆయన వచ్చిన తర్వాత కేసు విచారణ చకచకా ముందుకు సాగుతోంది. చివరి దశకు చేరింది. ఫోన్ ట్యాపింగ్ కేసును కేంద్రానికి అప్పగించాలని కోరుతున్న కిషన్ రెడ్డి.. తెలంగాణలో కీలక కేసుల విషయంలో ఈడీ ఏం సాధించింది!? జీహెచ్ఎంసీ, ఈ-ఫార్ములా, గొర్రెల స్కాం.. వంటి కేసుల్లో ఎంత మందిని అరెస్టు చేసింది!?" అని నిలదీశారు. కేంద్ర హోం మంత్రి సహా ఎవరినైనా కలిసి ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేయించారా? అని నిలదీశారు. ఇందులో కేసీఆర్ పాత్ర ఉందని, ఆయన్ని అరెస్టు చేస్తే నిజాలు బయటికి వస్తాయని చెప్పారా? అని ప్రశ్నించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లాభం చేకూరేలా కేసీఆర్‌ను కేసుల నుంచి బయట పడెయ్యాలని కిషన్ రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ఇంజినీర్ల అక్రమ సంపాదన ఏ స్థాయిలో ఉందో ఏసీబీ దాడులతో ప్రజలకు అర్థమైందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్లుగా కాళేశ్వరం అక్రమాలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే ఎన్నో నిజాలను బయటికి తీసుకొచ్చామని అన్నారు.

రేవంత్.. ఓ పిరికి దద్దమ్మ!

- డ్రగ్స్ కేసంటూ నాపై విషం చిమ్మడం ఎందుకు?
- ఆయనకు దమ్ముంటే ఆధారాలు చూపించాలి
- లేదంటే పర్యవసానాలు తప్పవు: కేటీఆర్

హైదరాబాద్, సిరిసిల్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ ఓ పిరికి దద్దమ్మ అని, తన వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న ఆయన్ను వదిలిపెట్టేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తనపై డ్రగ్స్ కేసు అంటూ రేవంత్ విషం చిమ్ముతున్నారని, దమ్ముంటే ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. చట్ట పరిధి నుంచి, న్యాయస్థానాల నుంచి తప్పించుకోవడానికే చిట్‌చాట్‌ల పేరుతో ముఖ్యమంత్రి దొంగచాటు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో తనతో ముఖాముఖి చర్చకు వచ్చేందుకు రేవంత్‌కు దమ్ములేదని, ఢిల్లీకి వెళ్లి అక్కడ తనపై ఆయన బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఎక్స్‌లో కేటీఆర్ ట్వీట్ చేశారు అలాగే సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించిన సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేవలం ముఖ్యమంత్రి కార్యాలయంపై ఉన్న గౌరవంతో ఇప్పటిదాకా సంయమనం పాటించానని కేటీఆర్ పేర్కొన్నారు. డ్రగ్స్ కేసులో తనపై విచారణ జరుగుతోందంటూ ఢిల్లీలో రేవంత్ అడ్డగోలుగా వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలకు ఆధారం ఏమిటనేది రేవంత్ చెప్పాలన్నారు. లేదంటే తాను చేసింది చౌకబారు, చిల్లర వ్యాఖ్యలు అని ఆయన ఒప్పుకొని.. క్షమాపణలు చెప్పాలని పేర్కొన్నారు. తనపై రేవంత్ దురుద్దేశపూర్వకంగా నిందలు వేశారని, ఇందుకు ఆయన పర్యవసానాల రూపంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక.. సీఎం రేవంత్: యెన్నం

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక సీఎం రేవంత్‌రెడ్డి అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కొనియాడారు. కృష్ణా జలాలను కేసీఆర్.. ఏపీకి అప్పగిస్తే, కృష్ణా.. గోదావరి జలాల్లో తెలంగాణ వాటా కోసం సీఎం రేవంత్‌రెడ్డి పోరాడుతున్నారన్నారు. ప్రధాని కావడం కోసం తెలంగాణ ప్రజల హక్కుల్నే తాకట్టు పెట్టిన వ్యక్తి కేసీఆర్ అని ఆరోపించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం.. రేవంత్‌రెడ్డి అన్నారు.

కేటీఆర్ వీక్లీ లీడర్: సామా రామ్మోహన్

కేటీఆర్ ఒక వీక్లీ లీడర్ అని, సీఎం రేవంత్‌రెడ్డిని సవాల్ చేసే స్థాయి ఆయనది కాదని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మాజీ సీఎం కేసీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డిలది సమాన స్థాయి అని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైనవారిలో కేవలం ముగ్గురు అధికారుల ఆస్తుపై సోదాలు జరిగితేనే రూ. వెయ్యి కోట్ల అవినీతి సొమ్ము బయటపడిందన్నారు.

సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు ఆమోదం తెలపండి

ఎలక్ట్రానిక్స్ పార్కులను ఏర్పాటు చేయండి.. కొత్త రైలు మార్గాలను మంజూరు చేయండి

- కేంద్ర ఐటీ, రైల్వే మంత్రి వైష్ణవ్‌కు సీఎం రేవంత్ వినతి



కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయిన సీఎం రేవంత్, మంత్రులు దుద్దిళ్ల, ఉత్తమ్


న్యూఢిల్లీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రైల్ భవన్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో కలిసి గురువారం ఆయన అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. "ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం తెలంగాణలో ఉంది. ప్రపంచ స్థాయి పరిశోధనలు, అభివృద్ధి కేంద్రాలు రాష్ట్రంలో ఉన్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్ (ఏఎస్ఐపీ) ప్రాజెక్టు, మైక్రో ఎల్ఈడీ డిస్‌ప్లే ఫ్యాబ్ ప్రాజెక్టు, క్రిస్టల్ మ్యాట్రిక్స్‌కు ఆమోదం తెలపండి" అని కోరారు. అలాగే, ఈఎమ్‌సీ 2.0 పథకం కింద రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటు చేయాలన్న తెలంగాణ వినతిని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. రీజనల్ రింగు రోడ్డు సమీపంలో నూతన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పార్క్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రీజినల్ రింగ్ రైల్‌కు అనుమతించండి

తెలంగాణలో రైలు మార్గాల అనుసంధానాన్ని మరింత పెంచేందుకు నూతన ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని రైల్వే శాఖ మంత్రి కూడా అయిన అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజనల్ రింగు రోడ్డుకు సమాంతరంగా రీజనల్ రింగ్ రైలు ప్రాజెక్టును ప్రతిపాదించామని, రైల్వే బోర్డు ఇప్పటికే తుది లోకేషన్ సర్వేకు అనుమతి ఇచ్చిందని, రూ.8,000 కోట్ల ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానం పెరగడంతోపాటు నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని వివరించారు. గ్రామీణ పేదరికం తగ్గడంతోపాటు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు. హైదరాబాద్ డ్రై పోర్టు నుంచి బందరు ఓడ రేవుకు అనుసంధానంగా రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. ఔషధాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తుల ఎగుమతులకు ఈ మార్గం దోహదపడుతుందని చెప్పారు. తెలంగాణలో రైల్వే ఆపరేషన్లను మరింత సమర్థంగా నిర్వహించేందుకు కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో, ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందుతాయన్నారు. అలాగే, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానించడంతోపాటు పారిశ్రామిక, వ్యవసాయ ఎగుమతులు, దిగుమతుల కోసం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి నూతన రైలు మార్గాలు మంజూరు చేయాలని కోరారు. ఇందులో వికారాబాద్ - కృష్ణా (122 కి.మీ., అంచనా వ్యయం రూ.2,677 కోట్లు); కల్వకుర్తి - మాచర్ల (100 కి.మీ., అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు); డోర్నకల్ - గద్వాల (296 కి.మీ., అంచనా వ్యయం రూ.6,512 కోట్లు); డోర్నకల్ - మిర్యాలగూడ (97 కి.మీ., అంచనా వ్యయం రూ.2,184 కోట్లు) మార్గాలను వంద శాతం రైల్వే వ్యయంతో మంజూరు చేయాలని కోరారు.

బనకచర్లపై ఏం జరిగిందో ఇద్దరు సీఎంలూ చెప్పాలి

- ఇద్దరూ సొంత అజెండాలతో ఢిల్లీ సమావేశానికి వెళ్లారు
- 42% రిజర్వేషన్లు బీసీలకేనంటే ప్రధానిని ఒప్పిస్తా: సంజయ్



హుజూరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏం జరిగిందో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రజలకు బహిర్గతం చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. సమావేశంలో ఏం జరిగిందో ఇరు రాష్ట్రాల ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వారిద్దరిపై ఉందని, ఇద్దరూ తలో మాట చెప్పడం సరికాదన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. కేంద్రం పెద్దన్న పాత్ర పోషించిందన్న సీఎం రేవంత్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇద్దరు ముఖ్యమంత్రులు సొంత అజెండాతో సమావేశానికి వెళ్లినట్లు కబనడుతోందన్నారు. జల వివాదాలపై బీఆర్ఎస్ ఆరోపణలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీలోని నాటి ప్రభుత్వంతో కుమ్మక్కై కృష్ణా జలాలను తాకట్టు పెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాలో ఉన్నట్లుందన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ వైఖరి స్పష్టంగా ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే అందజేస్తానంటే ప్రధాని మోదీని ఒప్పించి బిల్లును ఆమోదింపజేసేందుకు కృషి చేస్తానని సంజయ్ చెప్పారు. అలా కాకుండా 42శాతం రిజర్వేషన్లలో 10శాతం ముస్లింలకు ఇస్తానంటే ఒప్పుకునే ప్రసక్తి లేదన్నారు. బీసీల ముసుగులో తెలంగాణలో ముస్లింలందరికీ నూరు శాతం రిజర్వేషన్లు అందించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇరిగేషన్ అధికారుల అవినీతిని చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒకటేనని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ నెల 24న విచారణకు రావాలని సిట్ నుంచి సమాచారం వచ్చిందని తెలిపారు.

ట్యాపింగ్ కేసులో సంజయ్‌కు నోటీసు

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కు సిట్ అధికారులు నోటీసు జారీ చేశారు. అలాగే ఆయన పీఆర్‌ఓ పసునూరు మధు, పీఏ బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, మాజీ పీఏ పోగుల తిరుపతిలకు నోటీసులు ఇచ్చారు. ఈనెల 24న 11 గంటలకు విచారణకు హాజరు కావాలని కోరారు. అయితే, తాను సిట్ కార్యాలయానికి రాలేనని లేక్ వ్యూ గెస్ట్‌హౌస్‌లో ఉంటానని, అక్కడికి వచ్చి వాంగ్మూలం రికార్డు చేసుకోవాలని సంజయ్ అధికారులను కోరారు. దీనికి సిట్ అధికారులు అంగీకరించారు.

కేసీఆర్ నీచమైన పనుల ఫలితమే..

కేసీఆర్ చేసిన నీచమైన పనుల ఫలితంగానే ఈ రోజు ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసుల నుంచి ఈ 'లవ్ లెటర్' (నోటీసులు) అందుకోవాల్సి వచ్చిందని సంజయ్ అన్నారు. 'నాతో పాటు నా కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాప్ చేసిన నీచుడు కేసీఆర్. ఎంతోమంది జీవితాలను నాశనం చేసిన దుర్మార్గ కుటుంబం కేసీఆర్‌దే'నని ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు.

కులోన్మాద హత్య

ప్రేమించిన పాపానికి దళిత యువకుడి బలి

జగిత్యాల జిల్లా కిషన్‌రావుపేటలో దారుణం

వెల్గటూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తమ అమ్మాయితో ప్రేమలో ఉన్నాడని గ్రామంలోని దళిత యువకుడిపై ఓ వర్గం వారు కోపం పెంచుకున్నారు. నచ్చజెబితే వినడం లేదని అతడిపై పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. అయితే, యువతికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారనే సమాచారంతో ఆ యువకుడు కోపోద్రిక్తుడయ్యాడు. వెనకా ముందు చూడకుండా వాళ్ల ఇంటికి వెళ్లి గొడవ చేశాడు. దీంతో అమ్మాయి కుటుంబ సభ్యుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గొడవ జరిగిన గంటల వ్యవధిలోనే కత్తులతో పొడిచి అతడిని అంతమొందించారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో గురువారం ఈ దారుణం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటకు చెందిన దళిత యువకుడు సల్లూరి మల్లేశ్(26) అదే గ్రామంలోని బీసీ వర్గానికి చెందిన యువతి కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలిసిన అమ్మాయి కుటుంబ సభ్యులు గతంలో మల్లేశ్‌పై వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. ప్రస్తుతం కోర్టులో ఆ కేసు నడుస్తోంది. ఇద్దరి కులాలు వేరు వేరు కావడంతో యువతి బంధువులు వారి ప్రేమను అంగీకరించలేదు. అమ్మాయికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారనే విషయం తెలిసి గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మల్లేశ్ వారి ఇంటికి వెళ్లి గొడవ చేశాడు. ఆ సమయంలో యువతి తండ్రి ఇంటి వద్ద లేడు. అనంతరం ఆ కుటుంబ సభ్యులు అమ్మాయి తండ్రి, బంధువులకు సమాచారం ఇచ్చారు. మల్లేశ్ వెల్గటూర్ వస్తున్న క్రమంలో యువతి తండ్రి, బాబాయి, మరో వ్యక్తి వెల్గటూర్ మండల కేంద్రంలోని పెద్ద వాగు బ్రిడ్జి పైన మాటు వేసి దాడి చేశారు. ఈ చర్యను ప్రత్యక్ష సాక్షులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో అతడిని తీవ్రంగా కొట్టి, అక్కడి నుంచి కిలోమీటరు దూరంలో కోటిలింగాల వెళ్లే రహదారి పక్కన పాత వైన్స్ వెనుకకు తీసుకెళ్లి కత్తులతో పొడిచి హతమార్చారు. యువకుడిపై బ్రిడ్జి సమీపంలో కొందరు దాడి చేశారనే సమాచారాన్ని ఒకరు 100 నంబరుకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు సమీప ప్రాంతంలో గాలించగా కిలోమీటరు దూరంలో రక్తపు మడుగులో పడి ఉన్న మల్లేశ్ మృతదేహాన్ని గుర్తించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాం నరసింహారెడ్డి, ఎస్ఐ ఉమాసాగర్ పరిశీలించారు. కాగా, తమ కొడుకును అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారని, వారిని కఠినంగా శిక్షించాలని మల్లేశ్ తండ్రి రాజయ్య డిమాండ్ చేశారు.

బీసీ గురుకుల బాలికల హాస్టల్‌లో ఆహారం కల్తీ

- 40మంది విద్యార్థినులకు అస్వస్థత..జగిత్యాల జిల్లాలో ఘటన

జగిత్యాలరూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల హాస్టల్‌లో కల్తీ ఆహారంతో 40 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థినులకు బుధవారం రాత్రి భోజనంలో చికెన్ కర్రీ వడ్డించారు. అందులో కారం, మసాలా ఎక్కువకావడంతో జీర్ణంకాక కడుపు నొప్పి, అజీర్ణ సమస్యలతో విద్యార్థినులు వాంతులు చేసుకున్నట్లు జగిత్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ తెలిపారు. ఆయనతోపాటు ఉప వైద్యాధికారి శ్రీనివాస్ హాస్టల్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థినులకు వైద్య శిబిరం నిర్వహించి చికిత్స అందించడంతో విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడింది. మరో ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని జగిత్యాలలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ సత్యప్రసాద్ ఆస్పత్రిలో విద్యార్థినులను పరామర్శించారు.

'దళారుల పిన్‌కోడ్'పై విచారణ షురూ !

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో రవాణా శాఖలో కదలిక

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో అవినీతి దందాకు కీలకంగా మారిన స్టాప్లర్ పిన్నులకు సంబంధించి 'దళారుల పిన్‌కోడ్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై ఆ శాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. దళారులు, అధికారులు కుమ్మక్కైన వ్యవహారంపై విచారణ ప్రారంభించారు. హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో రవాణా శాఖ కార్యాలయాల్లో ఇటీవల కాలంలో వచ్చిన కొన్ని దరఖాస్తుల్ని తెప్పించుకుని ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పరిశీలించారు. అంతేకాదు ప్రాంతీయ, జిల్లా కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు. ఇటీవల కాలంలో ఎక్కువగా అవినీతి ఆరోపణలు వస్తున్న ప్రాంతీయ కార్యాలయాల్లోనూ తనిఖీలు చేయాలని నిర్ణయించారు.

కేసీఆర్ హయాంలో వేల ఫోన్లు ట్యాప్ చేశారు

- ఎమ్మెల్సీ చింతపండు నవీన్

హైదరాబాద్, జూలై17(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో వేల మంది ఫోన్లను ట్యాప్ చేశారని, నాటి సీఎం కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోవడం వల్ల ఈ అరాచకం బయటపడిందని, లేదంటే ఇప్పటికీ కొనసాగేదన్నారు. సీఎం రేవంత్ కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడేనని నవీన్ చెప్పారు. తనతో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లనూ ట్యాప్ చేశారనిఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి వాగ్మూలం ఇవ్వడానికి తీన్మార్ మల్లన్న సిట్ కార్యాలయానికి వచ్చారు.

అమ్రాబాద్‌లో 36 పెద్ద పులులు

మన్ననూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్)లో 36 పెద్ద పులులు ఉన్నట్లు టైగర్ రిజర్వు ఫీల్డ్ డైరెక్టర్ (ఎఫ్‌డీ) డాక్టర్ సునీల్ ఎస్ హిరమత్ తెలిపారు. రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో 2024-25 4వ ఫేజ్ పర్యవేక్షణ ఫలితాలను గురువారం ఆయన మీడియాకు తెలిపారు. నాలుగు నెలల వ్యవధిలో 10 అటవీ రేంజ్‌లలోని 797 లొకేషన్లలో 1594 సీసీ ట్రాప్ కెమెరాల ద్వారా ఈ పులులను గుర్తించినట్లు తెలిపారు.

తెలుగు వర్సిటీలో సంగీతం, దర్శకత్వ కోర్సులు

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి సంగీతం, సినిమా దర్శకత్వంలో.. డిప్లొమా కోర్సుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ ప్రాంగణంలో సాయంత్రం నిర్వహించే ఈ కోర్సుల్లో చేరడానికి కనీస విద్యార్హత పదో తరగతిగా నిర్ణయించారు. ఆసక్తికల వారు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9059794553, 9346461733 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎఫ్‌సీఐ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



హైదరాబాద్, జులై 17 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) ఉద్యోగ సంఘాల ఎన్నికల్లో భారత ఖాద్య నిగమ్ కర్మచారీ సంఘ్ (బీకేఎన్‌కేఎస్) విజయం సాధించింది. సంఘం అభ్యర్థి మంథని రాజేంద్రప్రసాద్ తెలంగాణ రీజియన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన హైదరాబాద్ ఎఫ్‌సీఐ కార్యాలయంలో అసిస్టెంట్ గ్రేడ్ వన్ డిపో అధికారిగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నారు. కార్యదర్శిగా విష్ణువర్ధన్, ఆర్థిక కార్యదర్శిగా భూమయ్య ఎన్నికయ్యారు.

వంశీచంద్‌కు డీసీసీ అధ్యక్షుల ఎంపిక బాధ్యత

హైదరాబాద్/ఆమనగల్లు జూలై 17 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)లకు అధ్యక్షులను ఎంపిక చేసే ప్రక్రియకు ఇన్‌చార్జ్‌గా ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియతో పాటు ఆయా అధ్యక్షుల పనితీరుపై అభిప్రాయాలు సేకరించే బాధ్యత ఆయన నిర్వహించనున్నారు.

ఆ 12 గ్రామాలు మావే!

- మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి ప్రకటన
- సరిహద్దు గ్రామాల ప్రజల ఆందోళన
- తెలంగాణలోనే కొనసాగించాలని డిమాండ్
- ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా



ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సరిహద్దు గ్రామాల ప్రజలు

ఆసిఫాబాద్/కెరమెరి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని 12 వివాదాస్పద గ్రామాల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఆ గ్రామాలు తమ పరిధిలోకే వస్తాయని మహారాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి చంద్రశేఖర్ బావన్కులే ముంబైలో ప్రకటించారు. దీంతో వివాదాస్పద గ్రామాల అంశం మరోసారి చర్చనీయాంశమైంది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో ఉన్న పరందోళి, అంతాపూర్ గ్రామ పంచాయతీల పరిధిలోని 12 గ్రామాలు.. పరందోళి, అంతాపూర్, ఎస్సాపూర్, కోట, పరస్వాడ, బోలాపటార్, పద్మావతి, ఇందిరానగర్, మహారాజ్‌గూడ, ముక్దంగూడ, లెండిజాల, గౌరి ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిధిలోని ఈ గ్రామాలను భౌగోళికంగా తమకు అనుకూలంగా ఉందనే కారణంతో 1987లో మహారాష్ట్ర ప్రభుత్వం చంద్రాపూర్ జిల్లా జివితి తాలూకాలో చేర్చుకుంది. అప్పటి నుంచి వివాదం ప్రారంభమైంది. ఇరు రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదంగా మారిన నేపథ్యంలో 12 గ్రామాల భవితవ్యం తేల్చేందుకు 1989లో కేంద్రం నియమించిన కేకే నాయుడు కమిషన్ ఈ గ్రామాల పరిస్థితులపై క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. పరందోళి పంచాయతీని విభజించి అంతాపూర్ పేరుతో మరో పంచాయతీని ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. వీటి పరిధిలోని మిగిలిన 10 గ్రామాలూ ఆంధ్రప్రదేశ్‌కే చెందాలని ముంబైలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించి, కేంద్రానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఈ గ్రామాలను తెలంగాణలో కలిపింది. దీన్ని సవాలు చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఇప్పటికీ ఆ కేసు పెండింగ్‌లోనే ఉంది. తాజాగా మహారాష్ట్ర ప్రభుత్వం 12 గ్రామాలు తమవేనని ప్రకటించడంతో స్థానిక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తాము తెలంగాణలోనే కొనసాగుతామంటూ సరిహద్దు గ్రామాల ప్రజలు గురువారం కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు.

యూ సీటింగ్!

(మొదటి పేజీ తరువాయి)



ముందు వరుసల్లోని పిల్లలను దృష్టిలో పెట్టుకొనే పాఠాలు చెబుతుంటారనే అభిప్రాయంతో వెనుక బెంచీల్లో కూర్చునే విద్యార్థుల్లో ఆత్మన్యూనతా భావం పెరుగుతోంది. దీనికి తగ్గట్టుగానే చాలాచోట్ల తరగతి గదిలోని మొదటి, రెండు, మూడు వరసల్లో కూర్చునే విద్యార్థులే పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని ఫస్ట్ క్లాసులో ఉత్తీర్ణులవుతున్నారు. వెనక బెంచీల్లోని పిల్లల్లో కొందరు అత్తెసరు మార్కులు తెచ్చుకుంటుంటే, ఇంకొందరు ఫెయిల్ అవుతున్నారు. అయితే.. ఈ 'ఫస్ట్ బెంచ్-లాస్ట్ బెంచ్' సమస్యకు 'స్థానార్థి శ్రీకుట్టన్' అనే ఓ మలయాళీ సినిమా చక్కని పరిష్కారం చూపింది. ఆ సినిమాలో చూపించిన విధంగా తరగతి గదుల్లో ఆంగ్ల అక్షరమైన 'యూ' ఆకారంలో విద్యార్థులను కూర్చోబెడితే బాగుంటుందని.. ఉపాధ్యాయులు గదిలోని అందరు విద్యార్థులపై సమ దృష్టి పెడతారని.. ఆ మేరకు ప్రతి విద్యార్థి కేంద్రం (స్టూడెంట్ సెంట్రిక్)గా విద్యాబోధన జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా ముందు బెంచీలు-వెనుక బెంచీలు అనే అసమానతలు ఉండవని అంటున్నారు. 'స్థానార్థి శ్రీకుట్టన్' సినిమాను ప్రేరణగా తీసుకొని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి.. జిల్లాలోని ప్రభుత్వ, రెసిడెన్షియల్, ఆశ్రమ పాఠశాలల్లోని తరగతి గదుల్లో 'యూ' ఆకారంలో విద్యార్థులకు సీటింగ్ ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఒకటో తరగతి మొదలుకుని 10వ తరగతి దాకా అన్ని క్లాసుల్లో ఇదే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఇటీవల సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ అక్కడ తరగతి గదిలోని బెంచీలను చూసి వెంటనే యూ ఆకారంలోకి మార్పించారు. పాఠశాలల్లో బ్యాక్‌బెంచ్ అన్నదే లేకుండా 'యూ' సీటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

'యూ' సీటింగ్ ఏర్పాటు అంటే..

గదిలో బ్లాక్ బోర్డు ఉన్న వైపు మినహా మిగతా మూడు వైపులా గోడలకు తగిలేలా బల్లలు వేస్తారు. ఆ బెంచీల మీద పిల్లలు కూర్చుంటారు. ఈ విధానం వల్ల బోర్డు దగ్గర నిల్చుని పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడు విద్యార్థులందరిపైనా దృష్టిని కేంద్రీకరించగలుగుతాడు. పిల్లల్లోనూ పాఠ్యాంశంపై ఆసక్తి పెరిగి వారిలో అభ్యసన సామర్థ్యం పెరుగుతుంది. ఫలితంగా ముందు-వెనుక బెంచీల పిల్లల మధ్య అసమానతలు తొలగి.. తరగతి గదిలో అందరం సమానమేనన్న అభిప్రాయం విద్యార్థుల్లో ఏర్పడుతుంది. కొన్నినెలల క్రితం కేరళలోని బడుల్లో 'యూ' ఆకారం సీటింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. కేరళను స్ఫూర్తిగా తీసుకొని ఒడిసా ఆ దిశగా అడుగులు వేసింది. తొలుత బెర్హంపూర్‌లోని అప్పర్ ప్రైమరీ స్కూల్లో ప్రవేశపెట్టి.. తర్వాత మిగతా చోట్ల ప్రారంభించారు. పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా కొన్ని స్కూళ్లలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. 'స్థానార్థి శ్రీకుట్టన్' 2024 నవంబరు 22న విడుదలైంది. తరగతి గదిలో విద్యార్థుల మధ్య వివక్షకు తావు ఉండొద్దనే సందేశాన్నిస్తుందీ సినిమా. కుటుంబాల ఆర్థిక స్థితిగతులు, విద్యార్థుల తెలివితేటలు, ప్రవర్తనను ఆధారంగా చేసుకొని కొందరిని ముందు బెంచీల్లో.. ఇంకొందరిని వెనుక బెంచీల్లో కూర్చోబెట్ట కూడదని ఈ సినిమా ద్వారా దర్శకుడు చెప్పారు. వెనుక బెంచీలో కూర్చునే విద్యార్థి చదువులో వెనుకబడితే ఆ విద్యార్థిదే తప్పు అన్నట్లుగా అందరూ చూస్తున్నారని.. ఈ ధోరణి ఏళ్లుగా వస్తోందన్న దర్శకుడి ఆవేదన చిత్రీకరణలో కనిపిస్తుంది. క్లాస్‌రూమ్‌లో విద్యార్థుల మధ్య అసమానతలను తొలగించేందుకు 'యూ' ఆకారపు సీటింగ్‌ను ఏర్పాటు చేస్తారు. తద్వారా ఒక బ్యాక్‌బెంచ్ స్టూడెంట్.. తన తెలివితేటలు, చురుకుదనం ద్వారా ఎలా హీరోగా నిలిచాడనేది దర్శకుడు చూపిస్తారు.

పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది

పాఠశాలల్లో యూ ఆకారంలో సీటింగ్ ఏర్పాటు చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నా యి. ఈ విధానం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. క్లాసులో ఒకరు ఎక్కువ.. మరొకరు తక్కువ కాదని, అందరం సమానం అన్న భావన పిల్లల్లో ఏర్పడుతుంది. ఉపాధ్యాయులకు ప్రతి విద్యార్థిపై దృష్టి ఉంటుంది. మా స్కూల్లో కూడా త్వరలో యూ-టైప్ సీటింగ్‌ను ఏర్పాటు చేస్తాం.

-ప్రభాకర్, ఎల్ఎఫ్ఎల్,
హెచ్ఎం జీజీపీఎస్, డెయిరీ క్వార్టర్స్

అమలు సాధ్యమయ్యేనా?

యూ-టైప్ సీటింగ్ విధానం బాగానే ఉన్నా హైదరాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇది సాధ్యమయ్యే పనేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విశాలంగా ఉండే తరగతి గదుల్లో బెంచీలను యూ ఆకారంలో ఏర్పాటు చేసేందుకు ఇబ్బందులు ఉండవని.. చిన్నపాటి గదుల్లో మాత్రం సాధ్యం కాదని పలువురు టీచర్లు అభిప్రాయపడుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో యూ-టైప్ సీటింగ్ విధానం దిశగా కొన్నిచోట్ల ఉపాధ్యాయులు ముందుకు సాగుతున్నారు. కొన్నిచోట్లనేమో తమకు స్థలం సరిపోదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



బీఆర్ఎస్ దాడిలో గాయపడిన కాంగ్రెస్ నేత దేవేందర్‌రెడ్డి

'చలో వేల్పూర్'లో తీవ్ర ఉద్రిక్తత

- ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లేందుకు.. కాంగ్రెస్ నేత యత్నం.. అతడిపై బీఆర్ఎస్ దాడి
- హామీలను ప్రశ్నిస్తే దాడులా..?: ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్/హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పిలుపునిచ్చిన చలో వేల్పూర్ కార్యక్రమం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. గల్ఫ్ బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందంటూ బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కనువిప్పు పేరుతో ఈ నిరసనకు పిలుపునిచ్చింది. దీంతో గురువారం ఉదయం నుంచి పోలీసులు ఎక్కడికక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్ ముఖ్య నాయకులను అరెస్టు చేశారు. పలువురు బీఆర్ఎస్ నాయకులు పోలీసుల కళ్లుగప్పి గ్రామంలోకి వచ్చేందుకు యత్నించగా అరెస్టు చేశారు. కొందరు మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఇంటి వైపు వెళ్లేందుకు యత్నించగా వారిని అడ్డుకున్నారు. ఎన్ఆర్ఐ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నంది దేవేందర్‌రెడ్డి.. ప్రశాంత్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించగా గమనించిన బీఆర్ఎస్ నాయకులు అతడిపై దాడి చేశారు. కాగా, ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే తన ఇంటిపై వరంగల్‌కు చెందిన నంది దేవేందర్‌రెడ్డి దాడి చేయడం సరికాదని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇళ్లపై దాడి చేయడం కాదు.. ముఖ్యమంత్రిని ఒప్పించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రశాంత్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తే.. మాజీ మంత్రి ఇంటిపై దాడిచేయడం దుర్మార్గమని హరీశ్ రావు మండిపడ్డారు.

బీఆర్ఎస్ నా దారిలోకి రావాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)



మాట్లాడుతున్నారా? అసలు కవిత వ్యూహం ఏంటి? అన్న అంశాలపై గులాబీ శ్రేణుల్లో చర్చోపచర్చలు సాగుతున్నాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో గురువారం ఆమె మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు వీలుగా ఆర్డినెన్స్ తేవడం సరైందేనని కవిత ప్రకటించారు. "బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ కేంద్రానికి పంపిన బిల్లు, ప్రస్తుతం తీసుకొచ్చే ఆర్డినెన్స్.. రెండూ వేర్వేరనే విషయం చెప్పకుండా బీఆర్ఎస్ వాళ్లు ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించడం విడ్డూరంగా ఉంది. 2018లో తెచ్చిన పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసింది. ప్రభుత్వం తెచ్చే ఆర్డినెన్స్‌పై న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాతే నేను మద్దతు ఇస్తున్నా. ఈ విషయంలో చివరకు బీఆర్ఎస్ కూడా నా దారిలోకి రావాల్సిందే" అని వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రెండు బిల్లులు పెట్టాలని మొదట డిమాండ్ చేసింది కూడా తానేనని గుర్తు చేశారు. తనను ఉద్దేశించి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన అసభ్య వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు నోరు మెదకపకోవడం దారుణమని, దీనిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని వెల్లడించారు. మల్లన్నను జనాభా లెక్కల నుంచి తీసేశానని, ఆయనెవరో కూడా తనకు తెలియదని, ఆ ఎమ్మెల్సీ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని పేర్కొన్నారు. కొప్పుల ఈశ్వర్ స్వయంగా బొగ్గు గని కార్మికుడని, ఆయనకు టీబీజీకేఎస్ బాధ్యతలు అప్పగించడాన్ని స్వాగతిస్తున్నానని కవిత వెల్లడించారు.

సీఎం రేవంత్‌రెడ్డి బుకాయిస్తున్నారు

తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీలో బనకచర్ల అంశమే లేదంటూ రేవంత్‌రెడ్డి బుకాయిస్తున్నారని కవిత ధ్వజమెత్తారు. అదే సమావేశంలో బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబుకు అప్పనంగా అప్పగించారని ఆరోపించారు. తెలంగాణ పట్ల బాధ్యత లేని రేవంత్‌రెడ్డికి సీఎం పదవిలో ఉండే అర్హత లేదని, ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తన స్కూల్.. బీజేపీలో అని, కాలేజీ.. టీడీపీలో అని, ఉద్యోగం కాంగ్రెస్‌లో అని చెప్పుకొన్న రేవంత్‌రెడ్డి.. ఇంకా కాలేజీలోనే ఉన్నాననుకొని చంద్రబాబుకు గోదావరి నీళ్లను దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. ఢిల్లీ మీటింగ్‌లో శాలువాతో సన్మానం చేయించుకొని బలికా బక్రా అయ్యారని ఎద్దేవా చేశారు. ఆయన ఏమైనా నష్టం లేదని, తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలగడం ఆందోళనకరమన్నారు. ఈ సమావేశం ద్వారా సీఎం సాధించిందేమీ లేదని, టెలిమెట్రీ స్టేషన్లు ఇప్పటికే ఉన్నాయని, కేఆర్ఎంబీని ఏపీకి తరలించాలన్నది విభజన చట్టంలోనే ఉందని గుర్తు చేశారు. బనకచర్లతో ఏపీ ప్రజలకూ ఉపయోగం లేదని, తెలంగాణలోని తుపాకులగూడెం నుంచి నదుల అనుసంధానం చేపడితే రెండు రాష్ట్రాలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు కడితే.. వచ్చే కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టుకు రేవంత్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని దుయ్యబట్టారు. ప్రభుత్వం బనకచర్లపై తగిన చర్యలు తీసుకోకుంటే కలిసి వచ్చే పక్షాలతో జాగృతి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. 21నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బనకచర్లతోపాటు బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు.

పునరుత్పాదక విద్యుదుత్పత్తి పెంపునకు సహకరించండి

- ప్రభుత్వ సంస్థల నుంచి సంపూర్ణ సహకారం అందిస్తాం..
- సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

న్యూఢిల్లీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పునరుత్పాదక విద్యుదుత్పత్తిని పెంచేందుకు సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుదుత్పత్తి పెంపునకు తమ మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈమేరకు సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి గురువారం లేఖ రాశారు. తమ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ప్రధానంగా కోల్ ఇండియా, నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్.. తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో సౌర, పవన విద్యుత్ ప్లాంట్లు, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటి కీలకమైన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల కోసం వచ్చే మూడేళ్లలో దాదాపు రూ.10వేల కోట్లు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణలోని అధిక సౌర విద్యుదుత్పత్తి సామర్థ్యం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల అభివృద్ధితోపాటు అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ల అభివృద్ధికీ రెడీగా ఉన్నట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనలు, ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపునకు తెలంగాణ ప్రభుత్వ మద్దతు అవసరమన్నారు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం, సీపీఎస్‌యూల మధ్య భాగస్వామ్యం, సరైన సమన్వయం అత్యంత అవసరమున్నందున ప్రత్యేక చొరవ తీసుకోవాలని సీఎంను కిషన్‌రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు అంగీకరించి సహకారం అందించాల్సిందిగా విన్నవించారు.

ఏపీ లిక్కర్ స్కామ్ నిందితులు..

శ్రవణ్‌రావు ఫ్లాట్‌లోనే!

(మొదటి పేజీ తరువాయి)

ఉచితంగా, మరో నెల కేవలం నిర్వహణ ఖర్చులు చెల్లించినట్టు తేలింది. టవర్ సెక్యూరిటీ నిబంధనల ప్రకారం.. యజమానులు సహా ఎవరు ఫ్లాట్‌లోకి వెళ్లాలన్నా ఆధారపూర్వక వివరాలు ఇవ్వాల్సిందే. ఆ వివరాల మేరకు ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకు శ్రవణ్‌రావు, చాణక్య, మరో నలుగురు ఫ్లాట్‌లోనే ఉన్నారని తేలినట్టు సమాచారం. శ్రవణ్‌రావు అక్కడున్న కాలంలో నిక్కరు (షార్ట్) వేసుకుని చక్కర్లు కొట్టారని, సీసీ కెమెరా ఫుటేజీలో ఆయనను శ్రవణ్‌రావుగా సెక్యూరిటీ సిబ్బంది ధ్రువీకరించినట్టు తెలిసింది. లిక్కర్ స్కామ్ కీలక నిందితులు ఉండటంతో ఈ అంశంపై ఏపీ సిట్ మరింత దృష్టిపెట్టింది. నిందితుల కాల్ డేటా రికార్డులను పరిశీలిస్తే మరిన్ని వివరాలు బయటికి వస్తాయని భావిస్తోంది.

ఫ్లాట్ భాగస్వామిని ఇబ్బందిపెట్టిన శ్రవణ్

వాస్తవానికి శ్రవణ్‌రావు ఆ ఫ్లాట్‌కు పూర్తి యజమాని కాదు. భాగస్వామి ఉన్నారు. ఆ భాగస్వామిని కూడా శ్రవణ్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు తీవ్రంగా ఇబ్బందిపెట్టినట్టు తెలిసింది. హైదరాబాద్‌కు చెందిన ఆకర్ష్ కృష్ణ దుబాయ్‌లో పెట్టుబడి కింద ఓ ఫ్లాట్ కొనుగోలు చేయాలని భావించారు. ఆకర్ష్‌తో పరిచయమున్న శ్రవణ్‌రావు ఫ్లాట్ కొనుగోలులో భాగస్వామ్యం వహించేందుకు ఆసక్తి చూపారు. ఈ క్రమంలో ఆకర్ష్, శ్రవణ్‌రావు కలిసి 2 మిలియన్ దిర్హామ్‌లు (సుమారు రూ.4.7 కోట్లు) పెట్టి 2023 ఫిబ్రవరి 15న ఫ్లాట్ కొనుగోలు చేశారు. ఆకర్ష్ భార్య కావ్య, శ్రవణ్‌రావు భార్య స్వాతి పేరిట చెరో సగం సమాన వాటాతో రిజిస్ట్రేషన్ చేయించారు. తర్వాత శ్రవణ్‌రావు ఇష్టారాజ్యంగా ప్రవర్తించారని.. అది ఉమ్మడి ఆస్తి అయినా కూడా భాగస్వామికి తెలియకుండా ఫ్లాట్‌ను డీలక్స్ హాలిడే హోమ్స్ సంస్థకు లీజుకు ఇచ్చారు. కనీసం అద్దెలో వాటాను కూడా ఆకర్ష్, ఆయన భార్యకు ఇవ్వలేదు. వారు ఫోన్ చేసినా శ్రవణ్‌రావు, స్వాతిరావు స్పందించలేదు. దీనితో ఆకర్ష్, కావ్య కలిసి స్వాతిరావుకు ఈ-మెయిల్ చేశారు. తమకు అద్దె వాటా చెల్లించాలని, లేదంటే ఫ్లాట్ అమ్మేసి ఎవరి వాటా వారు తీసుకుందామని కోరారు. అయినా స్పందన రాకపోవడంతో డీలక్స్ హాలిడే హోమ్స్ ప్రతినిధులను కలిసి.. ఫ్లాట్ పత్రాలను చూపారు, అద్దెలో తమకు రావాల్సిన వాటా గురించి చర్చించారు.

ఆకర్ష్ కృష్ణకు ఏపీ సిట్ నోటీసులు

ఏపీ లిక్కర్ స్కామ్‌తో దుబాయ్ ఫ్లాట్‌కు లింకులు ఉన్న నేపథ్యంలో.. ఫ్లాట్ భాగస్వామిగా ఉన్న ఆకర్ష్ కృష్ణ, ఆయన భార్య కావ్యకు ఏపీ సిట్ అధికారులు గురువారం నోటీసులు ఇచ్చారు. 22న విచారణకు హాజరై సమాచారం అందించాలని కోరారు. దుబాయ్ ఫ్లాట్ విషయంలో శ్రవణ్‌రావు నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్న ఆకర్ష్.. సిట్ విచారణలో వివరాలు వెల్లడించడంతోపాటు తమ వద్ద ఉన్న ఆధారాల్ని అందించనున్నారు.

అడ్డంగా దొరికిన రేవంత్

- బనకచర్ల అంశమే అజెండా అని ఆకాశవాణి రేడియో కూడా చెప్పింది: హరీశ్

హైదరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల విషయంలో బుకాయించి సీఎం రేవంత్‌రెడ్డి నగ్నంగా దొరికిపోయాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. బనకచర్ల అంశమే అజెండాలో ఉన్నట్లు ఏపీ మంత్రి వెల్లడించడమే కాకుండా.. కేంద్రం పరిధిలోని ఆకాశవాణి రేడియోలోనూ ప్రసారమైందని చెప్పారు. కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 763 టీఎంసీల నీళ్ల కోసం కొట్లాడుతూ.. 500 టీఎంసీలు చాలనడం దౌర్భాగ్యమని మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో హరీశ్ చిట్‌చాట్ చేశారు. ఏపీతో తన చీకటి బాగోతాన్ని కప్పి పుచ్చుకునేందుకు, బనకచర్ల అంశాన్ని పక్కదోవ పట్టించేందుకే రేవంత్ కేటీఆర్‌పై విమర్శలకు దిగారన్నారు. డ్రగ్స్, గంజాయి అంటూ మోకాలికి బోడిగుండుకు ముడిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అర్ధరాత్రి ఏపీ మంత్రి లోకేశ్‌ను కేటీఆర్ కలిశారని సీఎం చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు. ఆయనలా దొంగచాటుగా అర్ధరాత్రి కార్లలో తిరిగే అలవాటు మాకు లేదు. రేవంత్.. కంపల్సివ్ లయింగ్ సిండ్రోమ్ అనే వ్యాధితో బాధ పడుతున్నారు. నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడుతున్నారు. నీటి వినియోగానికి, నీటి పంపకానికి తేడా తెలియని సీఎం ఉండటం తెలంగాణకు పట్టిన దురదృష్టం' అని దుయ్యబట్టారు. 'ఎత్తు ఎక్కువంటూ నన్ను విమర్శిస్తున్న నువ్వు.. ఎన్నటికీ.. నా అంత ఎత్తు పెరగలేవు. ఎన్ని చేసినా కేసీఆర్ స్థాయికి రాలేవ్..!' అని రేవంత్‌ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎవడో దుబాయ్‌లో చనిపోతే కేటీఆర్‌కేం సంబంధం? అని ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థతో తమపై నిఘా పెట్టిన రేవంత్‌రెడ్డి.. తమ ఫోన్లు కూడా ట్యాపింగ్ చేస్తున్నారన్నారు. అందుకే ఢిల్లీలో ఓ విలేకరిని పట్టుకొని హరీశ్‌రావుతో రోజూ ఫోన్‌లో ఎందుకు మాట్లాడుతున్నావంటూ.. బెదిరించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.